సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 268
సోమవారం 19-12-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

సన్నిధి
సాక్షి ఫ్యామిలీ
II
శ్రీకాకుళం
సోమవారం ॥ 19-12-2022

మంచి మాట

ఏ ఒకవ్యక్తిని మాత్రమో... ఏ కొంతమందిని మాత్రమో కాదు. కుటుంబాలకు కుటుంబాలను. ఊళ్లకు ఊళ్లను. రాష్ట్రాలకు రాష్ట్రాలను. దేశాలకు దేశాలను. మొత్తం ప్రపంచాన్ని వేధించేది శత్రుత్వం. ప్రతిమనిషికీ, ప్రపంచానికీ శత్రుత్వం తీరని గాయాల్ని కలిగిస్తూనే ఉంది. జీవితాలకు జీవితాలే శత్రుత్వానికి కాలి బూడిద అయిపోయాయి. శత్రుత్వం అగ్ని అయి అందరికీ అంటుకుంది. అంటుకుంటోంది... ఉన్నంతవరకూ నిప్పు కాలుస్తూనే ఉంటుంది. అదే విధంగా శత్రుత్వం మనిషి కడతేరిపోయేంతవరకూ రగులుతూనే ఉంటుంది. అంతేకాదు వ్యక్తులుపోయాక కూడా వాళ్ల వారసులకూ అంటుకుని శత్రుత్వం వ్యాపిస్తూనే ఉంటుంది. వ్యాపిస్తూనే ఉంది. శ్వాస తీసుకుంటున్నట్లుగా మనిషి శత్రుత్వాన్ని కూడా తీసుకుంటున్నాడేమో అని అనిపిస్తోంది.



శత్రుత్వంతో శత్రుత్వం పెట్టుకుందాం

పుట్టీపుట్టడంతోనే శత్రువును, వ్యాధిని ఎవరైతే పోగొట్టుకోడో అతడు ఎంతటి బలవంతుడైనా నశించిపోతాడని భోజ చరిత్రం చెబుతోంది. అంటే వ్యాధిని, శత్రువును లేదా శత్రుత్వాన్ని ముదరనివ్వకూడదు. సాధ్యమైనంత వేగంగా వాటిని తీర్చేసుకోవాలి. శత్రుత్వం వ్యాధిలాంటిది అని అనడం, అనుకోవడం కాదు శత్రుత్వం వ్యాధికన్నా వినాశకరమైంది అనే సత్యాన్ని మనం తప్పకుండా అవగతం చేసుకోవాలి.

కొన్ని దేశాల మధ్యనున్న శత్రుత్వం మరికొన్ని దేశాలనూ బాధించింది, బాధిస్తోంది... కొన్ని దేశాల మధ్యనున్న శత్రుత్వం వల్ల జరిగిన యుద్ధాల్లో కలిగిన ప్రాణ నష్టాన్ని, సంపద నష్టాన్ని చరిత్ర మనకు తెలియజెబుతూనే ఉంది. శత్రుత్వం కారణంగా దేశ దేశాల ప్రజలు విలవిలలాడిపోయారు, విలవిలలాడిపోతున్నారు...ఇటీవలి కరోనా విలయానికి కూడా కొన్ని దేశాల శత్రుత్వమే కారణం అని కొన్ని పరిశీలనలు, విశ్లేషణలు తెలియజేస్తున్నాయి.

సంస్కృతి పరంగానూ, సంపదపరంగానూ, విద్యపరంగానూ, అభివృద్ధి పరంగానూ ఏర్పడిన శత్రుత్వం ప్రధాన కారణం కాగా మనదేశంలోకి విదేశీ దురాక్రమణదారులు చొరబడి దేశాన్ని కొల్లగొట్టడమూ, ఆక్రమించుకోవడమూ, సామాజిక పరిస్థితిని అల్లకల్లోలం చెయ్యడమూ అందువల్ల మనదేశానికి పెద్ద ఎత్తున నష్టం, కష్టం కలగడమూ చారిత్రిక సత్యంగా మనకు తెలిసిందే. కొన్ని శతాబ్దులకాలం మనదేశం పరపాలనపీడనలో దురవస్థలపాలవడానికి శత్రుత్వం ప్రధానమైన కారణం అయింది. ఒక్క మనదేశంలోనే కాదు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో కూడా శత్రుత్వం కారణంగా ఇలాంటి ఉదంతాలు ఉన్నాయి. ప్రపంచంలోని ఎన్నో దురంతాలకు శత్రుత్వం ఒక్కటే ప్రాతిపదిక అయింది. శత్రుత్వం ఉంటే దురంతమే ఉంటుంది. శత్రుత్వం ప్రేరణకాగా ప్రపంచంలో ఎన్నో ఘోరమైన పరిణామాలు జరిగాయి.

శత్రుత్వంవల్ల మనం ఎంత మాత్రమూ క్షేమంగా లేం. శత్రుత్వంవల్ల చాలకాలం క్రితమే మనిషితో మనిషికి ఉండాల్సిన సంబంధం లేకుండాపోయింది. శత్రుత్వం మనిషిని ఆవహించింది అందువల్ల మనం ఎంత మాత్రమూ భద్రంగా లేం. ఈ క్షేత్రవాస్తవాన్ని మనం బుద్ధిలోకి తీసుకోవాలి. మనిషి ప్రగతి, ప్రశాంతతలను, ప్రపంచ ప్రగతి, ప్రశాంతతలను ధ్వంసం చేస్తున్న శత్రుత్వాన్ని తక్షణమే త్యజించాలి. క్షయకరమైన శత్రుత్వం మనిషి లక్షణం కాకూడదు. శత్రుత్వం మనిషి జీవనంలో భాగం కాకూడదు.

'ఇది నాలుగురోజుల జీవితం
ఎందుకు ఎవరితోనైనా శత్రుత్వం?
నీకు శత్రుత్వమే కావాలనుకుంటే
చెయ్యి శత్రుత్వంతోనే శత్రుత్వం' ఈ భావంతో తెలుగు కవి–గాయకుడు పి.బి. శ్రీనివాస్ ఒక ఉర్దూ గజల్ షేర్ రాసి, పలికారు. ఆలోచిద్దాం... మన బతుకుల వర్తమానాన్నీ, భవిష్యత్తునూ ఛిద్రం చేసే శత్రుత్వం మనకు ఎందుకు? ఆలోచిద్దాం... మనం జీవించడానికి శత్రుత్వం అవసరం ఉందా?

మనం శత్రుత్వాన్ని సంపూర్ణంగా వదిలేసుకుందాం. అది సాధ్యం కాకపోతే శత్రుత్వంతోనే శత్రుత్వం చేద్దాం. సాటి మనిషికీ, సమాజానికీ కాదు మనిషి శత్రుత్వానికి శత్రువైపోవాలి. మనిషికి శత్రుత్వంలో ఉన్న నిజాయితీ, అభినివేశం స్నేహంలో లేకుండా పోయాయి. ఇది విధ్వంసకరమైన స్థితి. ఈ స్థితి మనకు వద్దు. మనిషి తీరు మారాలి. శత్రుత్వం ఇలలో లేకుండా పోవాలి.

ఇప్పటికే మనమందరమూ శత్రుత్వం వల్ల ఆవేదన చెందుతున్నాం. ఇకనైనా సంసిద్ధులమై శత్రుత్వంతో శత్రుత్వమూ, స్నేహంతో స్నేహమూ చేస్తూ బతుకుదాం. నిజమైన మనుషులమై మనం మనకూ, ప్రపంచానికీ వీలైనంత మంచి, మేలు చేసుకుందాం.

– రోచిష్మాన్

తెల్లవారడం తథ్యం

గురువాణి

సర్వ సాధారణంగా కష్టం–సుఖం లేకుండా జీవితాలుండవు. కష్టం అనేది రాకుండా ఉండాలంటే ఎలా సాధ్యం? అసలు మనుష్యులుగా ఈ లోకంలోకి వచ్చాం అంటేనే కష్టాన్ని పొందవలసి ఉంటుంది. కానీ సుఖాన్ని పొందకుండా ఉంటుందని మాత్రం ఎక్కడా లేదు. నిజానికి ఓర్చుకోలేని కష్టం కలిగినప్పుడు ఏడ్చేయడంలోనే సుఖం ఉంటుంది. ఆ క్షణాల్లో విన్న ఒక్క మాట ఎన లేని ఓదార్పును, ధైర్యాన్నీ ఇస్తుంది. అంత కష్టంలోనూ పూర్తిగా కుంగిపోకుండా నిలబెడుతుంది. ఆ సమయానికి ఆ చల్లటి ఓదార్పే ప్రాణానికి సుఖమనిపిస్తుంది.



కష్టాలు పడనివారెవరున్నారు... ఈ కష్టం పరాయివాడికి కూడా వద్దనుకునేంత కష్టంలో మనం ఉన్నప్పుడు.. కొందరి కష్టాలు వింటే మనది పెద్ద కష్టం కాదనిపిస్తుంది. ఇన్ని కష్టాలు ఎదుర్కొంటూ ఎప్పటికయినా సుఖం పొందవచ్చన్న ఆశతో వారింకా ఎలా బతికి ఉన్నారా... అనిపిస్తుంది. అన్ని కష్టాలూ పడి చివరన ఎవరికీ అందనంత ఉన్నత స్థితికి ఎలా చేరుకొన్నారా అని ఆశ్చర్యపోతాం. అందుకే కష్టాలు ఎప్పుడూ శాశ్వతం కాదు. కారుచీకటి తరువాత కాంతిరేఖ తప్పక కనబడుతుంది. ఎంత వర్షంపడినా, ఎంత ఎండ కాసినా అవి శాశ్వతంగా అలాగే ఉండవు. అంతేకానీ కష్టం వచ్చింది కదా అని ప్రతిదానికీ కదిలిపోయి శరీరం వదిలిపెట్టేస్తానంటే ఎలా! ఆ స్థితికి లేదా కనీసం ఆ ఆలోచనను కూడా రానీయకూడదు. సీతమ్మ పడిన కష్టాలు ఎవరు పడ్డారు కనుక! అన్ని కష్టాల్లో ఉన్న ఆమె దగ్గరకు హనుమ వచ్చి రామచంద్రమూర్తి పంపగా వచ్చానంటూ ఆనవాలుగా ఉంగరం చూపి స్వామి క్షేమవార్తలు చేరవేసి, రాముడు వచ్చి రావణుని నిర్జించి ఆమెను తీసుకెడతాడన్న శుభ వార్తను వినిపిస్తాడు. అప్పుడు సీతమ్మ సంతోష పడి.. ''కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా ఏతి జీవన్తమానన్దో నరం వర్ష శతాదపి ..'' అంటుంది. అంటే జీవించి ఉన్న నరులు నూరేళ్ళ తరువాత అయినా సుఖాన్ని, ఆనందాన్ని పొందుతారన్న ఈ సామెత చాలా మంగళప్రదమయినదిగా తోస్తున్నది హనుమా... అంటుంది.

అసలు కష్టాలలోకెల్ల పెద్ద కష్టం ఏమిటో తెలుసా... కష్టం వచ్చినప్పుడు చెప్పుకోవడానికి మరో మనిషి లేకపోవడం. రాముడికి కూడా కష్టాలు వచ్చాయి. తెల్లవారితే పట్టాభిషేకం..తెల్లవారిన తరువాత ఫలితం 14 ఏళ్ళ వనవాసం. తండ్రి మరణం, కోరి తనవెంట వచ్చిన సహధర్మచారిణి అపహరణ, భయంకర కీకారణ్యాలు, అడుగడుగునా రాక్షసులు... అయినా ధైర్యం కోల్పోలేదు. ఊన్చుకొని నిలబడ్డాడు. ధర్మం తప్పలేదు. రాముడికి గుండె చెరువయ్యేంత దుఃఖం పొంగుకొచ్చినప్పడంతా ఓదార్చడానికి, తన గోడు వెళ్ళగక్కుకుంటే వినడానికి లక్ష్మణుడున్నాడు, హనుమ ఉన్నాడు, సుగ్రీవుడు ఉన్నాడు. కానీ సీతమ్మకో.... తన కష్టం చెప్పుకోవడానికి ఎవరూ లేరు. బాధను పంచుకోవడానికి ఎవరూ లేరు. ప్రతిక్షణం గుండెల్ని పిండేసేంత నరకం అనుభవించింది. అందుకే సీతమ్మ అంటున్నది ఇది మంగళప్రదమయిన మాట అని... అందువల్ల ఏ కష్టం ఎక్కువ కాలం ఉండదని గుండెదిటవు చేసుకొంటే ప్రతి కష్టం దూదిపింజలా, ఓ మేఘంలా మనల్ని దాటి పోతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఇప్పుడు ఎంత చీకటిగా ఉన్నా తెల్లవారడమయితే తథ్యం. మళ్ళీ సూర్యోదయం అవుతుంది.

ప్రతి కీడును మేలుగా మార్చు దేవుడు

సువార్త



వాలి! తన సొంత అన్నలు యోసేపును హింసించిన విధానం వర్ణనాతీతం. గోతిలోనికి తోసి మరలా బయటకు తీసి ఎంత విలపిస్తున్నా వినకుండా పరాయి దేశస్థులకు అమ్మేశారు. ఒకపక్క యోసేపును అన్నలు తమ సొంత ప్రణాళికలతో బాధిస్తుంటే మరొక పక్క పరమతండ్రియైన దేవుడు తన మహిమాన్వితమైన ప్రణాళికలు రచించడం ప్రారంభించాడు. అన్నలు చేసే ప్రతి కీడును మేలుగా మార్చివేసే ప్రణాళికలు దేవునివి. బహిరంగంగా యోసేపు అన్నలు తమ కార్యములు చేస్తుంటే ప్రపంచంలో ఉన్నత స్థానంలో యోసేపును నిలుపడానికి దేవుడు అంతర్లీనంగా తన సన్నాహాలు పూర్తిచేశాడు.

మానవుడు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దేవుడు ఆశీర్వాదంగా మార్చగలడు. దేవుడు సర్వాధికారిగా సింహాసనం మీద కూర్చుంది టైంపాస్ కోసం కాదు. మనిషి జీవితంలో ఊహించని కార్యములు చేయడానికే. మానవ తలంపుల కంటే దేవుని తలంపులు చాలా గొప్పవని ప్రతి ఒక్కరూ గ్రహిస్తే చాలు. పోతీఫరు ఇంటిలో పనిచేస్తుండగా జీవితాంతం ఇలా గడిచిపోతే చాలనుకొని ఉంటాడు యోసేపు. తాను చేయని నేరానికి చెరశాలలోనికి వెళ్ళినప్పుడు దానినుండి బయటపడిపోతే చాలనుకొని ఉంటాడు. కానీ దేవుని ప్రణాళికలు వేరుకదా! యోసేపును ఐగుప్తు దేశం సింహాసనం మీద నిలబెట్టాలన్నదే దేవుని లక్ష్యం. అది నెరవేర్చకుండా దేవుడు ఎలా ఊరకుండిపోతాడు? తన స్వీయసంతృప్తి కోసమైనా దేవుడు అద్భుతాలు చేస్తాడు. మనుష్యుల మెప్పు ఆయనకు అవసరం లేదు. మనమిచ్చే అవార్డులు రివార్డుల కోసం దేవుడు పనిచేయడు.

మీరు నాకు కీడు చేయనుద్దేశించితిరి గాని... అది మేలుకే దేవుడు ఉద్దేశించెను (ఆది 50:20). పరిశుద్ధ గ్రంథంలో అనేకుల జీవితాలు దర్శనమిస్తాయి. వాటిలో ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొనే చరిత్ర యోసేపు చరిత్ర. ఆదికాండములో యోసేపు పుట్టుక నుండి మరణం వరకు జరిగిన ప్రతి సంఘటన రాయబడింది. ''నేను నమ్మినవారు నాకు చాలా కీడు చేశారు. నా స్వంత జనులే నన్ను అతి భయంకరంగా హింసించారు. మనుష్యులెవ్వరూ నమ్మదగినవారు కాదు... అని అనిపిస్తుందా?'' యోసేపు పరిస్థితిని ఒక్కసారి జ్ఞాపకం చేసుకో

యోసేపు పడిన బాధను దేవుడు కొలిచాడు. అతడు కార్చిన ప్రతి కన్నీటిబొట్టును దేవుడు ఒక బుడ్డిలో ఉంచాడు. వాటికి ప్రతిఫలం ఇవ్వాలి కదా! తనకు కలిగిన ప్రతి కీడు గురించి ఆలోచన చేసే సమయం దొరకనంతగా దేవుడు అతనిని ఆశీర్వదించాడు. అతడు కార్చిన ప్రతి కన్నీటి బొట్టు ఆశీర్వాద వర్షంగా తిరిగి అతనిమీద కురిసింది. నా అనుకొనే వారే నీవు మాకొద్దు అని దూరం చేస్తే ప్రాణ ప్రదంగా ప్రేమించే ఆసెనతును దేవుడు బహుమానంగా యోసేపుకు ఇచ్చాడు. నా ప్రాణం దక్కితే చాలు అనుకున్న యోసేపుకు తన కుమారులను ఇశ్రాయేలు గోత్రకర్తలుగా చేయడం ద్వారా దేవుని ప్రేమ సంపూర్తిగా అర్థమయ్యింది. శ్రమను, కీడును అనుభవిస్తున్న దేవుని బిడ్డా! దేవుని సమయం వస్తుంది. ఆ సమయంలో ప్రతి కీడు మేలుగా మారుతుంది. ప్రతి శాపం దీవెనగా మారుతుంది. కొంచెం ఓపిక పట్టు!!

– డా.జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

ఫిబ్రవరిలో స్టార్ట్?


● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' వంటి హిట్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ సినిమాగా రూపొందనున్న ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఇటీవల మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుక సంక్రాంతికి కుదిరిందనీ, ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని ఫిల్మ్‌నగర్ లేటెస్ట్ టాక్. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనున్నారు. కాగా ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు పారిస్ వెళ్లారు ఎన్టీఆర్. న్యూ ఇయర్ వేడుకలు కూడా ఆయన అక్కడే జరుపుకోనున్నారని టాక్.

పోర్టులో ప్రేమ


● సూర్య

పోర్టు ఏరియాలో ప్రేయసికి ప్రేమ కబుర్లు చెబుతున్నారు హీరో సూర్య. శివ దర్శకత్వంలో సూర్య, దిశాపటానీ జంటగా తెరకెక్కుతోన్న కొత్త సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోంది. ఎన్నూరు పోర్టు, థర్మల్ ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో సూర్య, దిశాలపై కీలకమైన లవ్ ట్రాక్‌ను చిత్రీకరిస్తున్నారు.

ఈ షెడ్యూల్‌లోనే ఓ పాటని కూడా చిత్రీకరించనున్నారట శివ. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా రెండు భాగాలుగా పదిభాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుందని కోలీవుడ్ టాక్. కాగా ఈ సినిమా మొదటి భాగాన్ని వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


● భీమ్స్, టీజీ విశ్వప్రసాద్, త్రినాథరావు, శ్రీలీల, కె. రాఘవేంద్ర రావు, రవితేజ, వివేక్ కూచిభొట్ల

నేను అప్పుడే ఊహించాను – కె.రాఘవేంద్రరావు

''నేను దర్శకత్వం వహించిన 'అల్లరి ప్రియుడు' చిత్రంలోని ఆర్కెస్ట్రా గ్రూపులో రవితేజ ఒకడు. ఆ టీమ్‌లో రవితేజ డ్రమ్స్ వాయించాడు. తను భవిష్యత్‌లో పెద్ద మాస్ హీరో అవుతాడని అప్పుడే ఊహించాను. ఇక 'పెళ్ళి సందడి'(2021) సినిమాలో ఫ్లూటు వాయించి ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించారు శ్రీలీల. వీరిద్దరితో 'ధమాకా'కి కనకవర్షం కురవాలి'' అని డైరెక్టర్ కె.రాఘవేంద్ర రావు అన్నారు. రవితేజ, శ్రీలీల జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ధమాకా'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ– ''ధమాకా' సినిమా పెద్ద హిట్ కావాలి. త్వరలో రవితేజ కొడుకు కూడా హీరో కాబోతున్నాడు'' అన్నారు.

రవితేజ మాట్లాడుతూ– ''ధమాకా' విజయంపై టీమ్ అంతా పూర్తి నమ్మకంతో ఉన్నాం. త్రినాథరావు, రైటర్ ప్రసన్న, శ్రీలీల, భీమ్స్ నెక్స్ట్ లెవల్‌కి వెళతారు. విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల మంచి పాజిటివ్ నిర్మాతలు. ఏ విషయంలోనూ రాజీపడని నిర్మాత అభిషేక్ అగర్వాల్'' అన్నారు. ''నేనూ రవితేజగారి అభిమానినే. 'ధమాకా' సక్సెస్ అవుతుంది'' అన్నారు త్రినాథరావు నక్కిన. ''సినిమా ఇండస్ట్రీలో స్టార్ అవ్వడానికి ఉన్న ప్రతి మెట్టు ఎక్కి వచ్చిన హీరో ఒక్క రవితేజగారే'' అన్నారు రైటర్ ప్రసన్న కుమార్. ''భీమ్స్ అవుట్‌డేట్ అయిపోయాడని చాలామంది అనుకున్నారు. 'ధమాకా' తో నన్ను మళ్లీ నిలబెట్టిన రవితేజగారికి థ్యాంక్స్'' అన్నారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. ''ధమాకా' పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, వివేక్ కూచిభొట్ల. ''ధమాకా'కు ప్రేక్షకులు అద్భుత విజయం చేకూర్చాలి'' అన్నారు శ్రీలీల.

ఈ వేడుకలో డైరెక్టర్స్ నందినీ రెడ్డి, బీవీఎస్ రవి, మారుతి, శ్రీవాస్, సుధీర్ వర్మ, కృష్ణచైతన్య, వంశీ, వై.విజయ్, విజయ్ కనకమేడల, దర్శక–నటులు శ్రీనివాస్ అవసరాల, సముద్రఖని, నిర్మాత అభిషేక్ అగర్వాల్, ఫైట్‌మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీలో ఆ తేడా లేదు – బ్రహ్మానందం

''చిత్ర పరిశ్రమలో చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేదు. ఓ మూవీ కోసం అందరూ ఎంతో కష్టపడి పనిచేస్తారు. సినిమా బాగుంటే అదే హిట్ అవుతుంది'' అని నటులు బ్రహ్మానందం అన్నారు. వెంకట్ కల్యాణ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'చెడ్డీ గ్యాంగ్ తమాషా'. గాయత్రీ పటేల్ హీరోయిన్. అబుజా, శ్రీ లీల ఎంటర్‌టైన్మెంట్స్‌పై సీహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని బ్రహ్మానందం విడుదల చేసి, మాట్లాడుతూ–''


● గాయత్రి, వెంకట్ కల్యాణ్, బ్రహ్మానందం, క్రాంతి కిరణ్

హాస్య నటులు తీసే సినిమాలన్నీ సక్సెస్ కావాలని, హాస్యం బయటకు రావాలని మా గురువు జంధ్యాలగారు చెప్పేవారు. హాస్యాన్ని బతికించాలని కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీ వేడుకకి వచ్చాను'' అన్నారు.''నిర్మాతలు రైతుల్లాంటి వాళ్లు.. ప్రేక్షకులకు వినోదాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తాం. ఈ మూవీ రెండో భాగం ఉంటుంది.. అన్నీ కుదిరితే బ్రహ్మానందంగారు నటిస్తారు'' అన్నారు సీహెచ్ క్రాంతి కిరణ్. ''పూర్తి కామెడీ డ్రామాగా రూపొందిన సినిమా ఇది'' అన్నారు వెంకట్ కల్యాణ్. ఈ చిత్రానికి కెమెరా: జీకే యాదవ్ బంక, సంగీతం: అర్జున్ నల్లగొప్పుల.

సంతోషంగా ఉంది – మంత్రి వేణుగోపాలకృష్ణ


● విజయ్ ప్రకాష్ , వేణుగోపాలకృష్ణ, వీరు కె.రెడ్డి

''కృష్ణగారి 'అవే కళ్లు' చిత్రంలోని 'మా ఊళ్లో ఒక పడుచుంది.. దెయ్యమంటే భయమన్నది..' పాట ఇప్పటికీ చాలా పాపులర్. ఆ పేరుతో నిర్మించనున్న చిత్రాన్ని కృష్ణగారికి అంకితం ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది'' అని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. వీరు కె.రెడ్డి దర్శకత్వంలో విజయ్ సినీ క్రియేషన్స్‌పై సోమా విజయ్ ప్రకాష్ నిర్మించనున్న చిత్రం 'మా ఊళ్లో ఒక పడుచుంది'. 'దెయ్యమంటే భయమన్నది' అనేది ఉపశీర్షిక. నూతన నటీనటులు నటించనున్న ఈ చిత్రం షూటింగ్‌కి ముందే డబ్బింగ్, ఎడిటింగ్(ఆడియో), రీ–రికార్డింగ్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో 'భారత్ వరల్డ్ రికార్డ్స్' సంస్థ ఈ రికార్డును నమోదు చేసింది. ఈ మేరకు తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో 'భారత్ వరల్డ్ రికార్డ్స్' ధృవీకరణ పత్రాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా యూనిట్‌కి అందించారు. ''మా సినిమా ప్రత్యేకతను యావత్ సినిమా ప్రపంచం గుర్తించేలా చేసిన 'భారత్ వరల్డ్ రికార్డ్స్' చైర్మన్ రమణారావుకి, వేణుగోపాలకృష్ణగారికి థ్యాంక్స్'' అన్నారు సోమా విజయ్ ప్రకాష్, వీరు కె.రెడ్డి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నీలకంఠ, జ్యూరీ మెంబర్ ఇంద్రాణి, నిర్మాతలు ముత్యాల రాందాసు, రవి కనగాల పాల్గొన్నారు.

దానికి కారణం నేనే అవుతా!


● ఆది, రియా

ఆది సాయికుమార్, రియా సుమన్ జంటగా కె.శశికాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టాప్‌గేర్'. కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రవితేజ సోషల్ మీడియాలో షేర్ చేసి, చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ట్రైలర్ చూస్తే ఈ చిత్రంలో క్యాబ్‌డ్రైవర్ అర్జున్ పాత్రలో ఆది నటించినట్లు తెలుస్తోంది. 'ఎవర్రా మీరు.. నన్నెందుకు చంపాలనుకుంటున్నారు', 'తనకేదన్నా జరిగితే.. నువ్వు ఎక్కడ ఎలా చచ్చినా దానికి కారణం నేనే అవుతా' అంటూ ఆది సాయికుమార్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో కనిపిస్తున్నాయి. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

గ్రంథాలయంలో...


● స్మిరిత రాణి, బెక్కం వేణుగోపాల్

విన్ను మద్దిపాటి, స్మిరిత రాణి బోర జంటగా ప్రభాకర్, కాశీ విశ్వనాథ్, డా.భద్రం, సోనియా చౌదరి ముఖ్య పాత్రల్లో సాయి శివన్ జంపన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గ్రంథాలయం'. వైష్ణవి శ్రీ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను నిర్మాత బెక్కం వేణుగోపాల్ రిలీజ్ చేసి, 'సినిమా హిట్ కావాలి' అని ఆకాంక్షించారు. ''సినిమా చేయాలనే నా 20 ఏళ్ల కల ఈ మూవీతో ఫలించింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందింది'' అన్నారు సాయి శివన్ జంపన. ఈ వేడుకలో విన్ను మద్దిపాటి, డైరెక్టర్ నరేష్, సీనియర్ జర్నలిస్ట్ రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అయ్యప్ప, స్మిరిత రాణి బోర, భద్రం మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: సామల భాస్కర్, సంగీతం: వర్ధన్, నేపథ్య సంగీతం: చిన్నా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అయ్యప్ప, లైన్ ప్రొడ్యూసర్: మహేష్ బాబు దొప్పలపూడి.

సైకలాజికల్ థ్రిల్లర్


● శ్రీరామ్, హ్రితిక

శ్రీరామ్ శ్రీకాంత్, హ్రితిక శ్రీనివాస్ జంటగా డా.రవికిరణ్ గాడలే దర్శకత్వంలో కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. కేయస్ఆర్ సమర్పణలో డా.ఉదయ్ కె.రెడ్డి పాల్వాయ్, డా.శ్రీధర్ రెడ్డి కరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో సందీప్ మాధవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ సుధీర్ వర్మ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ డా.రవికిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు శ్రీరామ్ శ్రీకాంత్. ''సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. జనవరి 2 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు డా.రవికిరణ్ గాడలె. ఈ చిత్రానికి కెమెరా: సైక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నితిన్ కుమార్.ఆర్.

ఒకే ఒక పాత్రతో...


● నందితా శ్వేత, మణిశర్మ

హీరోయిన్ నందితా శ్వేత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రారా.. పెనిమిటి'. నూతన దర్శకుడు సత్యవెంకట్ తెరకెక్కించారు. శ్రీ విజయానంద్ పిక్చర్స్‌పై ప్రమీల నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ సినిమాలోని ఫస్ట్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ''ఒకే ఒక పాత్రతో రూపొందిన చిత్రం 'రారా.. పెనిమిటి'. సినిమా మొత్తం ఒకే పాత్రతో ప్రయోగాత్మకంగా తీయడంతో ఇండస్ట్రీలోని ప్రముఖులు అభినందిస్తున్నారు. మణిశర్మ 5 అద్భుతమైన మెలోడి గీతాలను అందించారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 268
సోమవారం 19-12-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



లాంఛనం.. లంచ్‌లోపే

బంగ్లాతో తొలి టెస్టులో 188 పరుగులతో భారత్ ఘన విజయం - 12లో



పన్నుల రూటే.. సప'రేటు'


ఈక్విటీ, డెట్ సాధనాలకు పన్ను భిన్నం.. హోల్డింగ్ వ్యవధి వేర్వేరు - 13లో



నేవీలోకి 'ఐఎన్ఎస్ మర్ముగావ్'

దేశీయ క్షిపణి విధ్వంసక నౌక 'ఐఎన్ఎస్ మర్ముగావ్ ఆదివారం భారత నౌకాదళంలో అడుగుపెట్టింది.

వివరాలు 6లో ▸



ఈశాన్యం అభివృద్ధికి అడ్డంకుల్లేవ్

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించామని.. విభజన ఆటలను సాగనివ్వబోమని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



మా దగ్గర అణుబాంబు ఉంది!

తమ వద్ద అణు బాంబు ఉన్న విషయం మరిచిపోవద్దంటూ భారత్‌ను ఉద్దేశించి పాకిస్తాన్ మంత్రి షాజియా రెచ్చిపోయారు.

వివరాలు 6లో ▸



ప్రపంచకప్‌తో మెస్సీ ఆనందోత్సాహం

36 ఏళ్ల తర్వాత మళ్లీ శిఖరంపైకి..

ఖతర్‌నాక్ అర్జెంటీనా

మెస్సీ కల నెరవేరింది.. విశ్వవిజేతగా అర్జెంటీనా



- ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం
- షూటౌట్‌లో తేలిన ఫలితం
- 4-2 గోల్స్‌తో మెస్సీ సేనదే పైచేయి

12లో

మెస్సీ కల సాకారమైంది. అర్జెంటీనా జట్టు ఫుట్‌బాల్ ప్రపంచకప్ గెలిచింది. ఫైనల్ అంటే ఇది... అన్నట్లుగా ఆరంభం నుంచి సాగిన మ్యాచ్‌లో ముందుగా మెస్సీ 'పెనాల్టీ కిక్' అర్జెంటీనాను ఆధిక్యంలో నిలిపింది. డి మరియా గోల్‌తో మ్యాచ్ గెలిచినట్లే అనిపించింది. కానీ ఎంబాపె 97 సెకన్ల మ్యాజిక్‌తో (వరుస నిమిషాల్లో 2 గోల్స్) ఆట ఏకపక్షం నుంచి రసవత్తర దశకు చేరింది. చివరికి 'ఎక్స్‌ట్రా టైమ్' కూడా ఇరు జట్లను మరోసారి సమవుజ్జీలుగా నిలబెట్టింది. ఇటు మెస్సీ... అటు ఎంబాపెల కిక్‌లతో 3-3తో మ్యాచ్ ముగిసింది. విజేత కోసం పెనాల్టీ 'షూటౌట్' అనివార్యమైన పోరులో అర్జెంటీనా గోల్‌కీపర్ మార్టినెజ్ స్టార్ అయ్యాడు. దీంతో అర్జెంటీనా 4-2తో ప్రపంచకప్‌ను గెలుచుకుంది.

న్యూస్‌రీల్

రెండుగా చీలిన టీ కాంగ్రెస్!



అంతర్గత విభేదాలతో తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రెండుగా చీలింది. ఆదివారం జరిగిన టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి పార్టీ సీనియర్ నేతలు హాజరుకాలేదు. మరోవైపు తమపై సీనియర్లు చేసిన ఆరోపణలు బాధించాయంటూ రేవంత్ అనుచరులు 12 మంది పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

వివరాలు 10 ▸

మిసెస్ వరల్డ్‌గా సర్గమ్ కౌశల్



ముంబైకి చెందిన సర్గమ్ కౌశల్ మిసెస్ వరల్డ్-2022 కిరీటం దక్కించుకున్నారు. అమెరికాలో జరిగిన పోటీల్లో 63 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీ పడ్డారు.

వివరాలు 6 ▸

భార్యను చంపి.. 50 ముక్కలు చేశాడు



జార్ఖండ్‌లో ఓ దుర్మార్గుడు రెండో భార్యను చంపి 50కిపైగా ముక్కలుగా నరికి వేర్వేరుచోట్ల పడేశాడు. ఓ పాడుబడ్డ ఇంట్లోంచి ఒక మనిషి కాలు, శరీర భాగాలను కుక్కలు లాక్కెళుతుండగా స్థానికులు పోలీసులకు చెప్పడంతో ఈ ఘోరం వెలుగుచూసింది.

వివరాలు 6 ▸

పల్లె తలుపు తట్టి.. ప్రజల నాడి పట్టి..

'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామీణులకు అత్యుత్తమ వైద్యం

నెలలో రెండుసార్లు గ్రామాల సందర్శన

- రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా ట్రయల్ రన్.. మధ్యాహ్నం వరకు అవుట్ పేషెంట్ సేవలు
- ఆ తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం.. అంగన్‌వాడీలు, పాఠశాలల సందర్శన
- 14 రకాల పరీక్షలు, మందులు ఉచితం.. ఇప్పటి వరకు 12.72 లక్షల మందికి వైద్య సేవలు
- ఖర్చు, ఇబ్బందులు తప్పాయని గ్రామీణుల ఆనందం



ఎన్టీఆర్ జిల్లా చిట్యాల గ్రామంలో ఇంటికే వెళ్లి చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

(చిట్యాల, మేములపల్లి గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి వడ్డే బాలశేఖర్)

"ఆరోగ్యం ఎలా ఉంది? సమయానికి మందులు వాడుతున్నారా?" "బాగానే ఉంది.." సైగల ద్వారా కోటేశ్వరరావు సమాధానం. "పెద్ద డాక్టర్ రాసిచ్చిన మందులతో పాటు పోయినసారి మీరిచ్చిన బీపీ మందులు సమయానికి ఇస్తున్నామమ్మా.. ఫర్వాలేదు.. నా బిడ్డ ఆరోగ్యం బాగానే ఉంది" ఇదీ.. తమ ఇంటికే వచ్చి పరామర్శిస్తున్న డాక్టర్‌తో ఆనందంగా కోటేశ్వరరావు తల్లి నాగమ్మ సమాధానం. "సరే.. గుండె కొట్టుకోవడం, పల్స్ రేట్, బీపీ, షుగర్.. అన్నీ బాగానే ఉన్నాయి. ప్రస్తుతం వాడుతున్న మందులు అలానే కొనసాగించండి. ఏదైనా సమస్య వస్తే సిబ్బందిని సంప్రదించండి. లేదంటే నాకు ఫోన్ చేయండి. ధైర్యంగా ఉండండి.." డాక్టర్ భరోసా. ఇలా 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో ఉన్న ఊరికే వైద్యులు వచ్చి ఆరోగ్య వివరాలను వాకబు చేస్తుండటంతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవస్థలు తొలగాయని గ్రామీణ ప్రాంత ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం వరకు

మిగతా 2వ పేజీలో ▶

'ఫ్యామిలీ డాక్టర్'పై నాలుగు అంచెల పర్యవేక్షణ

- పీహెచ్‌సీ, అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏర్పాట్లు
- ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నోడల్ అధికారుల నియామకం
- నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్ నోడల్ అధికారి నియామకానికి చర్యలు
- పీహెచ్‌సీ స్థాయిలో సీహెచ్‌వో/ఎంపీహెచ్ఈవోలకు పర్యవేక్షణ బాధ్యత

2లో



ఆర్చరీలో పోటీ పడుతున్న క్రీడాకారిణులు

10లో

జిమ్నాస్టిక్స్‌లో ఏపీకి స్వర్ణం

ఏకలవ్య ఆదర్శ గురుకులాల విద్యార్థుల మూడవ జాతీయ క్రీడా పోటీల్లో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ వివిధ విభాగాల్లో సత్తా చాటింది. జిమ్నాస్టిక్స్ అండర్-14 విభాగంలో వి.లక్ష్మణ్‌రెడ్డి స్వర్ణపతకం సాధించారు. ఆర్చరీ 30 మీటర్ల కేటగిరీలో 232 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బసాయ్ ప్రీతి మొదటి స్థానం కైవసం చేసుకుంది.

సచివాలయ సిబ్బందికి 'బోధనేతర' బాధ్యతలు

- వెల్ఫేర్ అసిస్టెంట్‌కు బడి పిల్లల హాజరు పర్యవేక్షణ
- ప్రతి స్కూల్‌లోనూ ఫిర్యాదుల బాక్స్‌- వాటి బాధ్యత మహిళా పోలీసులకు..
- ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మధ్యాహ్న భోజన పర్యవేక్షణ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటిలో పలు బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అప్పగించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను గ్రామ, వార్డు సచివాలయ శాఖ తాజాగా విడుదల చేసింది. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్త, ప్రాథమిక వైద్యాధికారులు వివిధ పర్యవేక్షణ బాధ్యతల్లో పాల్గొంటారని పేర్కొంది. వారు తమ పరిధిలోని స్కూల్‌ను సందర్శిస్తూ బోధనేతర కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు తమ పరిధిలోని

మిగతా 2వ పేజీలో ▶

డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల సేవలకే పరిమితం

- సచివాలయాలకు దూరంగా ఉంచే ఏ విధులూ అప్పగించొద్దు
- జిల్లాల కలెక్టర్లకు గ్రామ వార్డు సచివాలయ శాఖ లేఖ

- వివరాలు 2లో



ఉభయ రాష్ట్రాల మధ్య

మరో హైవే

- కల్వకుర్తి నుంచి జమ్మలమడుగు నాలుగు లేన్ల రహదారి
- 255 కి.మీ.. రూ.4,706 కోట్లు
- ఏడు ప్యాకేజీల కింద టెండర్ల ప్రక్రియ.. ఏపీ పరిధిలో రూ.2,300 కోట్లతో 164 కి.మీ. మేర నిర్మాణం

10లో

'అసైన్డ్' ప్లాట్లు అమ్ముతాం!

- అమరావతిలో పచ్చ గ్యాంగ్ నయా దందా.. పరిరక్షణ సమితి నేతలదే కీలక పాత్ర
- టీడీపీ హయాంలో యథేచ్ఛగా అసైన్డ్ భూముల అక్రమాలు
- సీఐడీ దర్యాప్తుతో బండారం బట్టబయలవుతుందని బెంబేలు

- వివరాలు 11లో

ఇవాళ్టి కార్టూన్



అబద్ధాలు చెప్పటమే అసలు దగా!

ఎస్సీ, ఎస్టీలంటే బాబుకెప్పుడూ చులకన భావమే

ఎస్సీల్లో ఎవరూ పుట్టాలనుకోరంటూ దారుణమైన వ్యాఖ్యలు

- ఐదేళ్లలో బాబు వీరికి ఖర్చు చేసింది కేవలం రూ.46,115 కోట్లు
- ఈ ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఖర్చుచేసింది రూ.74,013 కోట్లు
- ఇప్పటిదాకా దాదాపు 18.05 లక్షల మందికి రుణాలు
- కళ్యాణమస్తు పథకాన్ని ప్రకటించి వదిలేసిన బాబు
- నాటి మొత్తాన్ని రెట్టింపు చేసి అమలు చేస్తున్న వైఎస్ జగన్
- విద్యపై ప్రత్యేక దృష్టి... ఎస్సీ, ఎస్టీలకు గణనీయంగా ఐఐటీ సీట్లు
- రాజకీయ పదవుల్లో సింహభాగం బడుగు వర్గాలకే
- పంచాయతీల నుంచి మున్సిపాలిటీలు.. ఆఖరికి కేబినెట్లోనూ అగ్రాసనం
- వీటన్నిటినీ దాచిపెట్టి దగా అంటూ 'ఈనాడు' విషపు రాతలు



సాక్షి, అమరావతి: నాడు.. చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలంటే అత్యంత చులకన. 'ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అనే ఈసడింపు.. దళితులకు శుద్ధీ శుభ్రం ఉండవంటూ ఏవగింపు. నేడు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీలంటే ఎంతో గౌరవం. ఎక్కడైనా 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు' అంటూనే మాట్లాడటం మొదలెడతారు. వారి హక్కులను కాపాడటమే కాదు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వారికి సమున్నత స్థానమిస్తున్నారు. సామాజిక న్యాయంలో సరికొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. అయినా సరే... 'ఎస్సీ, ఎస్టీలకు దగా' అంటూ చంద్రబాబు కళ్లలో సంతోషం కోసమే కథనాలు వండే స్థాయికి దిగజారిపోయింది 'ఈనాడు'. అసలు ఎస్సీ, ఎస్టీలకు ఎవరేం చేశారు? 2014-19 మధ్య ఐదేళ్లలో చంద్రబాబు సీఎంగా ఎస్సీల సంక్షేమానికి ఖర్చు చేసింది రూ.33,629 కోట్లు, ఎస్టీలకు రూ.12,488 కోట్లు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది

మిగతా 11వ పేజీలో ▶

చంద్రబాబుకు, దుష్టచతుష్టయానికి పిచ్చెక్కింది



- ఎస్సీ, ఎస్టీలకు రుణాలు ఇవ్వట్లేదంటూ పచ్చమీడియా పిచ్చిరాతలు
- ఇది ఎస్సీ, ఎస్టీల సంక్షేమ రాజ్యం
- ఇప్పటివరకు ఎస్సీలకు రూ.58,353 కోట్లు, ఎస్టీలకు రూ.15,660 కోట్ల లబ్ధి
- సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగు నాగార్జున

3లో

క్లుప్తంగా...

కరకట్ట అభివృద్ధికి సేకరించిన భూమికి నష్టపరిహారం విడుదల

తాడేపల్లి రూరల్: కృష్ణానది ఎగువ ప్రాంతంలోని ప్రకాశం బ్యారేజ్ నుంచి ఉద్దండరాయుని పాలెం వరకు ఉన్న అమరావతి కరకట్టను విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొంతమంది నుంచి భూసేకరణ చేసింది. దానిలో భాగంగా ఆదివారం భూమి ఇచ్చిన వారికి వారి ఖాతాల్లో రూ.19,71,090 జమ చేసింది. డబ్బులు జమ అయిన రైతులు లీలా ఫుడ్స్ అండ్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ ఖాతాకు రూ.4,12,610, సానికొమ్ము శ్రీనివాస రెడ్డి ఖాతాలో రూ.8,56,680, ఎ1 దుర్గా డిస్కవరీ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి రూ.7,01,800 జమ చేశారు. దీంతో కొంతమేర కరకట్ట నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి.

నేడు 89 వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి : ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీ వీవీపీ) ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల భర్తీకి చేపడుతున్న వాక్-ఇన్ ఇంటర్వ్యూ సోమవారంతో ముగియనుంది. సోమవారం ఆర్థోపెడిక్స్‌లో 10, పీడియాట్రిక్స్ 29, ఆప్తమాలజీ 16, రేడియాలజీ 34 ఇలా నాలుగు స్పెషాలిటీల్లో 89 పోస్టుల భర్తీని చేపట్టనున్నారు. 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 14 నుంచి వాక్-ఇన్ ఇంటర్వ్యూలను వైద్య శాఖ చేపట్టింది. కాగా, ఇప్పటి వరకూ 109 పోస్టులు భర్తీ అయ్యాయి. శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీని చేపడుతున్నారు. అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో పట్టణాల్లో రూ.1.30 లక్షలు, గ్రామీణంలో రూ.2 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో రూ.2.50 లక్షల చొప్పున ప్రభుత్వం వేతనాలను నిర్దేశించింది. అంతేకాకుండా ఎంపిక చేసుకునే ప్రాంతం, అభ్యర్థి అనుభవం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించింది. ఇప్పటి వరకూ భర్తీ చేసిన 109 పోస్టుల్లో 45 పోస్టులు కాంట్రాక్ట్ విధానంలోనే భర్తీ అయ్యాయి.

బిగ్‌బాస్ సీజన్-6 విజేత రేవంత్



సాక్షి, హైదరాబాద్ : బిగ్ బాస్ రియాల్టీ షో తెలుగు సీజన్-6 విజేతగా తెలుగు సినీ గాయకుడు రేవంత్ నిలిచారు. ఆదివారం రాత్రి జరిగిన గ్రాండ్ ఫినాలేలో రేవంత్ ట్రోఫీని దక్కించుకున్నారు. 105 రోజుల పాటు సాగిన ఈ సీజన్‌లో మొత్తం 21 మంది కంటెస్టెంట్లు పోటీ పడగా.. గ్రాండ్ ఫినాలేకు ఐదుగురు.. రేవంత్, శ్రీహాన్, ఆదిరెడ్డి, కీర్తి భట్, రోహిత్ చేరుకున్నారు. ఉత్కంఠగా సాగిన గ్రాండ్ ఫినాలేలో వరసగా రోహిత్, ఆదిరెడ్డి, కీర్తి ఎలిమినేట్ అయి హౌస్ నుంచి బయటకు వచ్చారు. తుదకు టైటిల్ పోరు టాప్-2లో శ్రీహాన్, రేవంత్ నిలిచారు. గోల్డెన్ బాక్స్‌తో హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన వ్యాఖ్యాత, అగ్ర కథ నాయకుడు నాగార్జున పోటీలో మిగిలిన ఇద్దరికీ అదిరే ఆఫర్ ఇచ్చారు. ప్రైజ్ మనీలో సగం మొత్తం తీసుకుని హౌస్ నుంచి వెళ్లిపోవచ్చని సూచించారు. తొలుత ఇందుకు ఇద్దరూ ససేమిరా అంగీకరించపోవడంతో ఆ తర్వాత ఆ మొత్తాన్ని రూ.30 లక్షలకు, ఆ తర్వాత రూ.40 లక్షలకు పెంచడంతో శ్రీహాన్ ఆ మొత్తం తీసుకొని రన్నర్‌గా నిలిచారు. రేవంత్ మాత్రం బిగ్‌బాస్ సీజన్-6 ట్రోఫీ, రూ.10 లక్షలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ కార్యక్రమానికి ఈ సీజన్‌లో ఎలిమినేట్ అయిన హౌస్‌మేట్స్ అందరూ విచ్చేసి సందడి చేశారు. అలనాటి నటి రాధ, యువ నటుడు నిఖిల్, మాస్ హీరో రవితేజ, అందాల భామ శ్రీలీల తదితరులు ఫినాలే ఎపిసోడ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

నేటి భవితలో..

- ఎస్ఎస్‌సీ జాబ్స్: ఇంటర్‌తోనే కేంద్ర కొలువులు
  ఇంటర్మీడియెట్‌తోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే అవకాశం వచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)..4,500 పోస్టుల భర్తీకి కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్(సీహెచ్ఎస్ఎల్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల పరిధిలో..గ్రూప్-సి కేడర్‌లో..ఎల్‌డీసీ/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేయనుంది. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్-2022 ముఖ్య సమాచారం, పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పల్లె తలుపు తట్టి.. ప్రజల నాడి పట్టి..

▶ మొదటి పేజీ తరువాయి

ఓపీ (అవుట్ పేషంట్) సేవలు అందించి, ఆ తర్వాత నడవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేయడంతో పాటు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం 'ఫ్యామిలీ డాక్టర్' అనే సరికొత్త కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గత అక్టోబర్ 21న వైద్య శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ట్రయల్ రన్ ప్రారంభించగా 'సాక్షి' క్షేత్ర స్థాయిలో పర్యటించి అమలు తీరును పరిశీలించింది. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ ప్రియదర్శిని చిట్యాల గ్రామంలో నివసించే పక్షవాత బాధితుడు కోటేశ్వరరావు ఇంటిని నెలకు ఒకసారి సందర్శిస్తున్నారు. 'గతంలో బీపీ, షుగర్ పరీక్షల కోసం ఆస్పత్రికి ప్రత్యేకంగా ఆటోలో వెళ్లాల్సి రావడంతో డబ్బులు ఖర్చయ్యేవి. ఇప్పుడు ఆ ఇబ్బందులు లేవు' అని ఆ కుటుంబం చెబుతోంది. ఇదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వి.కృష్ణ గత ఆగస్టులో రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో కాలు విరిగింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించి ఉచితంగా మందులతో పాటు మూడు నెలల విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆసరా కింద రూ.12,500 ఆర్థిక సాయం చేసింది. పీహెచ్‌సీ డాక్టర్ ఇంటికే వెళ్లి ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్య వివరాలను వాకబు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం వేములపల్లి గ్రామానికి చెందిన కె.లక్ష్మి ఐదు నెలల గర్భిణి. గతంలో వైద్య పరీక్షల కోసం ప్రతి నెల 9వ తేదీన పెండ్యాల పీహెచ్‌సీకి వెళ్లేది. మిగిలిన రోజుల్లో ఎప్పుడైనా అవసరమైతే గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌కు వెళ్లేది. అయితే ప్రస్తుతం నెలలో రెండు రోజులు పీహెచ్‌సీ వైద్యురాలు గ్రామానికే వస్తున్నారు. ఆమెకే కాకుండా విలేజ్ క్లినిక్ పరిధిలోని 21 మంది గర్భిణులకు వైద్య సేవలు ఇంటి వద్దే అందుతున్నాయి.

తొలగిన వ్యయ ప్రయాసలు

దాదాపు 1,800 మంది నివసించే చిట్యాలలో 2019కి ముందు ప్రాథమిక ఆరోగ్య సేవల కోసం ఆరు కి.మీకి పైగా ప్రయాణించి వత్సవాయి పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. స్పెషలిస్ట్ డాక్టర్ కోసం 30 కి.మీ పైగా దూరంలో ఉండే నందిగామ లేదంటే 80 కి.మీ పైనే ఉన్న విజయవాడకు వెళ్లక తప్పదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలోనే విలేజ్ క్లినిక్ సేవలు ప్రారంభం అయ్యాయి. 12 రకాల వైద్య సేవలు, 14 పరీక్షలు, 67 రకాల మందులు అక్కడే అందుబాటులోకి వచ్చాయి. టెలీ మెడిసిన్ ద్వారా గైనిక్, పీడియాట్రిషన్, ఇతర స్పెషాలిటీ వైద్యుల కన్సల్టెన్సీ లభిస్తుంది. తాజాగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పీహెచ్‌సీ డాక్టర్ ప్రతి నెలా గ్రామానికే వస్తున్నారు. గ్రామంలో 239 మంది బీపీ, షుగర్ బాధితులున్నారు. 13 మంది గర్భిణులు, ఏడుగురు బాలింతలు, 18 మంది అనీమియా బాధితులకు డాక్టర్ సేవలు అందుతున్నాయి. వేములపల్లిలో 220 మంది బీపీ, షుగర్ బాధితులు, 21 మంది గర్భిణులు, 9 మంది బాలింతలకు పీహెచ్‌సీ డాక్టర్ నెలలో రెండు దఫాలు గ్రామానికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

అంగన్‌వాడీలు, స్కూళ్లకు కూడా..

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా రాష్ట్రంలోని 1,142 పీహెచ్‌సీల్లో ఇద్దరు చొప్పున వైద్యులకు ఆయా పరిధిలోని గ్రామ సచివాలయాలను కేటాయించారు. ఒక్కో సచివాలయం పరిధిలో నెలకు రెండుసార్లు సందర్శించి గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. 104 ఎంఎంయూతో పాటు వెళ్లి విలేజ్ క్లినిక్‌లలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓపీ సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ గ్రామంలో మంచానికే పరిమితం అయిన వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాత బాధితులు, ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకే వెళ్లి పరామర్శించి అవసరమైన సేవలు అందచేస్తున్నారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చిన్నారులు, పిల్లల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.



ఎన్టీఆర్ జిల్లా వేములపల్లిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు పొందుతున్న రోగులు



ఇప్పటి వరకు 12.72 లక్షల మందికి వైద్యం

రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్‌రన్ అక్టోబర్ 21న ప్రారంభం కాగా ఇప్పటి వరకు పీహెచ్‌సీ వైద్యులు 7,166 విలేజ్ క్లినిక్‌లను నెలలో రెండుసార్లు, 2,866 క్లినిక్‌లను నెలలో ఒకసారి సందర్శిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ 12,72,709 మందికి వైద్య సేవలు అందించారు.

విభాగం	వైద్య సేవలు పొందిన వారు
ఓపీ సేవలు	5,66,834
జ్వరాలు	60,313
గర్భిణులు	77,398
బాలింతలు	58,150
రక్తహీనత	6,660
బీపీ	2,86,542
షుగర్	2,11,214
నోటి క్యాన్సర్ బాధితులు	2,042
ఛాతీ క్యాన్సర్ బాధితులు	406
గర్భాశయ క్యాన్సర్ బాధితులు	2,366
టీబీ రోగులు	784

'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామాల్లో అందే వైద్య సేవలు

- జనరల్ అవుట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు. చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు.
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితం అయిన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం.
- పాలియేటివ్ కేర్
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ

గ్రామాల్లోనే 14 రకాల పరీక్షలు

■ గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్ ■ హిమోగ్లోబిన్ టెస్ట్ ■ ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్) ■ మలేరియా టెస్ట్ ■ హెచ్ఐవీ నిర్ధారణ ■ డెంగ్యూ టెస్ట్ ■ మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్) ■ అయోడిన్ టెస్ట్ ■ వాటర్ టెస్టింగ్ ■ హెపటైటిస్ బి నిర్ధారణ ■ ఫైలేరియాసిస్ టెస్ట్ ■ సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్ ■ విజువల్ ఇన్‌స్పెక్షన్ ■ స్పుటమ్ (ఏఎఫ్‌బీ)

'ఫ్యామిలీ డాక్టర్'పై నాలుగు అంచెల పర్యవేక్షణ

సాక్షి, అమరావతి : పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెడుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించిన ట్రయల్ రన్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 12.72 లక్షల మందికి వైద్యులు గ్రామాల్లోనే సేవలు అందించారు. ఈ కార్యక్రమంపై సునిశిత పర్యవేక్షణ ఉంచడం ద్వారా ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాలుగు అంచెల పర్యవేక్షణకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)/మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్‌ఈవో), అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్ నోడల్ అధికారిగా డిప్యూటీ సివిల్ సర్జన్(డీసీఎస్), జిల్లా స్థాయిలో అడిషనల్ డీఎంహెచ్‌వో, రాష్ట్ర నోడల్ అధికారిగా అడిషనల్ డైరెక్టర్ స్థాయి అధికారిని ఉంచుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు అధికారులను గుర్తించి వారికి బాధ్యతలు అప్పగించారు. పీహెచ్‌సీ, క్లస్టర్ స్థాయిల్లో పర్యవేక్షణాధికారుల నియామకానికి చర్యలు చేపడుతున్నారు.

సమర్థవంతమైన పర్యవేక్షణ కోసమే

పీహెచ్‌సీ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సిబ్బంది హాజరు, సరిపడా మందులు, వైద్య పరీక్షల కిట్‌ల అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. గ్రామాల్లో ఆరోగ్య కార్యక్రమాల అమలు, గ్రామ స్థాయి నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం వంటి అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో ఆరు నుంచి ఎనిమిది పీహెచ్‌సీల్లో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు, వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతరం వాకబు చేస్తారు. ఆయా పీహెచ్‌సీల పరిధిల్లోని అన్ని విలేజ్ క్లినిక్‌లలో ఫ్యామిలీ డాక్టర్ బృందాలు సరైన సేవలను అందజేసేలా సమన్వయం చేస్తారు.

అదనపు డీసీఎస్ పోస్టులు



ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సునిశిత పర్యవేక్షణ ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో నాలుగంచెల పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారులను నియమించాం. క్లస్టర్ నోడల్ అధికారుల నియామకానికి ప్రస్తుతం ఉన్న డీసీఎస్ పోస్టులు చాలవు. అదనంగా డీసీఎస్ పోస్టుల సృష్టికి చర్యలు తీసుకుంటున్నాం.
–జె.నివాస్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్

పెద్ద భారం తప్పింది



నాకు 72 ఏళ్లు. నడుము నొప్పి ఉంది. కర్ర సాయంతో కొద్ది దూరం నడవగలను. బీపీ, షుగర్‌కు నెల నెలా డాక్టర్‌కు చూపించుకునేందుకు నా కుమార్తె పట్టణానికి తీసుకెళ్లేది. ఇప్పుడు వేములపల్లెకు ప్రభుత్వ డాక్టర్ నెలకు రెండు సార్లు వస్తున్నారు. డాక్టరమ్మ బాగా చూస్తోంది. మందులు రాసిచ్చింది. దగ్గరే కాబట్టి ఒక్కదాన్నే వస్తున్నా. పెద్ద భారం తొలగింది. లేదంటే నా కుమార్తె రోజంతా తన పని వదులుకోవాల్సి వచ్చేది.
– వసంత నాగేంద్రమ్మ, ఎస్.అమరవరం, ఎన్టీఆర్ జిల్లా

బాలింతకు వైద్య సేవలు..



ఇటీవల పాప పుట్టింది. నాకు పుట్టుకతోనే ఫిట్స్ సమస్య ఉంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవానికి నిరాకరించడంతో వత్సవాయి పీహెచ్‌సీ డాక్టర్ విజయవాడకు రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు కాన్పు చేశారు. ఫిట్స్ సమస్యకు కూడా వైద్యం చేశారు. డిశ్చార్జి అయి ఇంటికి వచ్చాక వైద్యులు రెండు సార్లు మా ఇంటికి వచ్చి మా ఆరోగ్యం గురించి వాకబు చేశారు. అవసరమైన మందులిస్తున్నారు.
– అద్దంకి మౌనిక, చిట్యాల, ఎన్టీఆర్ జిల్లా

కొత్త అనుభూతి..



నెలలో ఏ రోజు ఏ గ్రామానికి వెళ్లాలో మాకు ముందుగానే టైమ్ టేబుల్ నిర్దేశించారు. ఉదయమే 104 ఎంఎంయూతో పాటు గ్రామానికి వెళ్తాం. ముందు రోజే సంబంధిత గ్రామ ప్రజలకు ఆరోగ్య సిబ్బంది సమాచారం ఇస్తారు. ప్రజల వద్దకే వెళ్లి సేవ చేస్తుండటం ఓ కొత్త అనుభూతి.
– డాక్టర్ సుష్మ ప్రియదర్శిని, వత్సవాయి పీహెచ్‌సీ, ఎన్టీఆర్ జిల్లా

నిరంతరం సమీక్షిస్తున్నాం



సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్‌రన్ విజయవంతంగా నడుస్తోంది. నిరంతర సమీక్షతో క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నాం. మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువయ్యేలా చర్యలు చేపడుతున్నాం. రోగులు, వైద్యం వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. దీని ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య చరిత్ర 'ఆయుష్మాన్ భారత్' డిజిటల్ ఖాతాల్లో నిక్షిప్తం అవుతుంది.
– ఎం.టి.కృష్ణ బాబు, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి

సమూల మార్పులు



ఒకప్పుడు గ్రామీణ ప్రజలు ప్రభుత్వ వైద్యులు ఎక్కడున్నారో వెతుక్కుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. ఆ పరిస్థితులను సీఎం జగన్ సమూలంగా రూపుమాపారు. వైద్య, ఆరోగ్య శాఖలో సంస్కరణలు చేపట్టారు. ఇందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డాక్టర్లు ప్రజలకు అందుబాటులోకి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. టీడీపీ హయాంలో పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది, మందులు ఉండేవి కాదు. ఇప్పుడు విలేజ్ క్లినిక్‌ల ద్వారా 67 మందులు, 14 వైద్య పరీక్షలు, వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాం.
– విడదల రజని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం

గుంటూరు జిల్లా మంగళగిరి పరిధిలోని సీకే కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుమార్తె వివాహ వేడుకకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. మల్లాది విష్ణు కుమార్తె డాక్టర్ లలిత నాగదుర్గ, డాక్టర్ సాయి సూర్యతేజలను ఆయన ఆశీర్వదించారు.
- మంగళగిరి

స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీకి రాజీలేని చర్యలు

- ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్
- పచ్చ పత్రికల్లో కథనాలకు ఖండన

సాక్షి, అమరావతి: వైద్యారోగ్య శాఖలో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు చేపడుతోందని ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి ఓ వైపు పలు రకాలుగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే.. ప్రభుత్వ సేవల్లో చేరడానికి స్పెషలిస్ట్ వైద్యులు ఆసక్తి చూపడం లేదంటూ పచ్చ పత్రికలో కథనాలు రాస్తున్నారు. ఆ వార్తలను ఖండిస్తూ కమిషనర్ వినోద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా గణాంకాలను పరిశీలిస్తే.. 61 శాతం స్పెషలిస్ట్, 50 శాతం జనరల్ ఫిజిషియన్‌ల కొరత ఉందని పేర్కొన్నారు. అదే రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వైద్యుల అందుబాటులో దేశంలోనే ఏపీ అగ్ర స్థానంలో నిలుస్తోందని తెలిపారు. 2019 జూన్ నాటికి ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 1,250 స్పెషలిస్ట్ వైద్యుల కొరత ఉండేదని, ఈ క్రమంలో ఎనిమిది నోటిఫికేషన్‌లు జారీ చేయడం ద్వారా 277 గైనిక్, 234 అనస్తీషియా, 146 పీడియాట్రిషన్, 144 జనరల్ మెడిసిన్, 168 జనరల్ సర్జన్, 55 ఆర్థో, 78 ఆప్తామాలజీ, 65 ఈఎన్‌టీ, మిగిలిన స్పెషాలిటీల్లో 145 పోస్టులు భర్తీ చేసినట్టు తెలిపారు. 403 స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి గత అక్టోబర్ వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించగా 251 పోస్టులు భర్తీ అయినట్టు తెలిపారు. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న 250 పోస్టుల భర్తీకి తాజాగా వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 110 పోస్టులను భర్తీ చేశామని వెల్లడించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు సహకరించక, పలు పోస్టుల్లో అభ్యర్థులు లేకనే కొన్ని పోస్టులు భర్తీ అవ్వడం లేదని వివరించారు. స్పెషలిస్ట్ వైద్యులను ప్రభుత్వ సేవల్లోకి ఆకర్షించడం కోసం అన్ని చర్యలనూ ప్రభుత్వం తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే గ్రామీణంలో రూ.2 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో రూ.2.50 లక్షల వేతనాన్ని కూడా ఇస్తున్నామని తెలిపారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా చింతూరు, కూనవరం, పాడేరు వంటి ఆస్పత్రులనూ ఎంపిక చేసుకుని వైద్యులు చేరుతున్నట్టు ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు.

సమాజాభివృద్ధిలో జీఎంఆర్‌ది కీలక పాత్ర

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

రాజాం: సమాజంలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు జీఎంఆర్ గ్రూపు తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగమైన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తోందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి కొనియాడారు. 25 ఏళ్లకు పైగా విద్య, ఆరోగ్యం, ఉపాధి, జీవనోపాధులు, స్థానిక ప్రజల అభివృద్ధి సహా అనేక రంగాల్లో జీఎంఆర్ పనిచేస్తోందని తెలిపారు. రాజాంలోని జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జీఎంఆర్ ఐటీ) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. తొలుత జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహించిన ఎగ్జిబిషన్ స్టాల్‌ను, ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ యువత సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు మాట్లాడుతూ జీఎంఆర్ ఐటీ విద్యార్థులు విజయవంతమైన ఎంట్రప్రెన్యూర్లుగా మారాలని ఆకాంక్షిస్తున్నామని వెల్లడించారు. శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జీఎంఆర్ ఐటీ డైరెక్టర్ జె.గిరిష్ తదితరులు పాల్గొన్నారు.



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, గ్రంథి మల్లికార్జునరావు తదితరులు

డిజిటల్ అసిస్టెంట్లు 'సచివాలయాల'కే పరిమితం

జిల్లాల కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ లేఖ

సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు సచివాలయాల్లోని వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు.. వారి సొంత సచివాలయాలకు దూరంగా ఉంచే ఎలాంటి ఇతర విధులు అప్పగించవద్దంటూ గ్రామ వార్డు సచివాలయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు విధి నిర్వహణ సమయమంతా ఆయా సచివాలయాల్లోనే అందుబాటులో ఉండి ప్రజల వినతులను ఎప్పటికప్పుడు సంబంధిత వెబ్ పోర్టల్ నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగుల ప్రతినిధులు ఈ మేరకు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో అజయ్ జైన్ ఈ మేరకు లేఖ రాశారు.

జల వివాదాలకు తెరపడేనా?

సాక్షి, అమరావతి : జలాశయాల నిర్వహణ కమిటీ(ఆర్ఎంసీ) నివేదికను ఆమోదించి జల వివాదాలకు కృష్ణా బోర్డు తెరదించుతుందా? లేక యథాప్రకారం నివేదికను అటకెక్కించి జల వివాదాలను కొనసాగనిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆర్ఎంసీ నివేదికపై చర్చించి, ఆమోదించడమే అజెండాగా జనవరి 6న కృష్ణా బోర్డు 17వ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ ఇప్పటికే లేఖలు రాశారు. రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరాక ఆర్ఎంసీ రూపొందించిన నివేదికపై సంతకాలు చేయడంలో తెలంగాణ అధికారులు అడ్డం తిరిగిన నేపథ్యంలో.. సర్వసభ్య సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది.

నివేదిక తయారీలోనే తీవ్ర జాప్యం

- కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విభేదాలకు ప్రధానంగా కారణమవుతున్న ఉమ్మడి ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి, రూల్ కర్వ్(ప్రాజెక్టుల నిర్వహణ విధి విధానాలు), మళ్లించిన వరద జలాలను కోటాలో కలపాలా? వద్దా అనే అంశాలపై 2022, మే 6న సర్వ సభ్య సమావేశంలో చర్చించారు. ఈ మూడు సమస్యల పరిష్కారానికి కృష్ణా బోర్డు సభ్యులు ఆర్కే పిళ్లై అధ్యక్షతన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీ, జెన్‌కోల డైరెక్టర్లు సభ్యులుగా ఆర్ఎంసీని 2022, మే 10న నియమించారు.
- ఉమ్మడి ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తిపై 15 రోజుల్లోగా.. రూల్ కర్వ్, వరద జలాలపై నెలలోగా నివేదిక ఇవ్వాలని ఆర్ఎంసీని ఆదేశించారు. కానీ.. గడువులోగా ఆర్ఎంసీ నివేదిక ఇవ్వలేదు.
- నివేదికను రూపకల్పనకు ఆరు సార్లు ఆర్ఎంసీ సమావేశమైంది. 3న శ్రీశైలంలో కనీస నీటిమట్టం 854 అడుగులుగానూ, ఉత్పత్తయ్యే విద్యుత్‌లో చెరి సగం పంచుకునేలా.. దిగువన సాగు, తాగునీటి అవసరాలు ఉంటేనే విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని విడుదల చేసేలా రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. సాగర్ రూల్ కర్వ్‌పై సీడబ్ల్యూసీను సంప్రదించి ఖరారు చేసుకునేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. వరద రోజుల్లో మళ్లించే జలాలను లెక్కించినా.. వాటిని నికర జలాల కోటాలో కలపకూడదని నిర్ణయించాయి. ఇదే అంశాలతో 3న నివేదికను రూపొందించింది.

కృష్ణా బోర్డు నిర్ణయమే ఫైనల్

ఆర్ఎంసీ నివేదికపై సంతకం చేయడానికి కొంత సమయం కావాలని తెలంగాణ అధికారులు అడిగారు. దాంతో 5న నివేదికపై సంతకాలు చేయడానికి ఆర్ఎంసీ సమావేశాన్ని ఏర్పాటు చేయగా, సంతకాలు చేసేదిలేదని తెలంగాణ అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. దీంతో నివేదికపై కృష్ణా బోర్డు సభ్యులు ఆర్కే పిళ్లై, మౌతాంగ్, ఏపీ అధికారులు సంతకాలు చేసి 8న బోర్డు చైర్మన్‌కు అందజేశారు. ఈ నివేదికపై జనవరి 6న కృష్ణా బోర్డు తీసుకునే నిర్ణయమే ఫైనల్. నివేదికను అమలు చేస్తేజల వివాదాలకు తెరపడినట్టేనంటున్నారు.

సచివాలయ సిబ్బందికి 'బోధనేతర' బాధ్యతలు

▶ మొదటి పేజీ తరువాయి

పాఠశాలను కనీసం వారానికొకసారి సందర్శించి పిల్లల హాజరును పరిశీలించాలి. హాజరు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి.. వంద శాతం హాజరుకు అవసరమైన కృషి చేయాలి. పాఠశాలలోని పరిస్థితులే కారణమైతే.. వాటిని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లాలి.

పౌష్టికాహారం అందేలా..

మధ్యాహ్న భోజన రికార్డులను కూడా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలే పరిశీలించాల్సి ఉంటుంది. వారానికొకసారి స్కూల్‌ను సందర్శించినప్పుడు మధ్యాహ్న భోజన రికార్డుల పరిశీలనతో పాటు మెనూ ప్రకారం భోజనం రుచిగా, శుచిగా ఉందా అనే వివరాలను సేకరించాలి. ఏదైనా సమస్య ఉంటే పేరెంట్స్ కమిటీతో కలిసి పరిష్కారానికి కృషి చేయాలి. ఏఎన్ఎంలు ప్రతి నెలా తమ పరిధిలోని స్కూళ్లను సందర్శించి.. పిల్లల పౌష్టికాహార పరిస్థితులు అంచనా వేయాలి. వ్యాధి నిరోధక టీకాలతో పాటు స్థానిక వైద్యాధికారి, ఆశా వర్కర్‌తో కలిసి పిల్లలకు వైద్య సహాయం అందించాలి.

భద్రతపై విద్యార్థినులకు అవగాహన..

ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేసి.. దానిని సచివాలయ మహిళా పోలీస్ పర్యవేక్షించాలి. అలాగే విద్యార్థినులకు తరుచూ సమావేశాలు నిర్వహించి.. వారి భద్రతకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై అవగాహన కల్పించాలి. అలాగే నాడు-నేడు పనులను సంబంధిత పాఠశాల పేరెంట్స్ కమిటీ, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షిస్తారు. పిల్లల అభిప్రాయాల మేరకు పాఠశాలలో అవసరమైన మరమ్మతులను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు గుర్తించి.. పేరెంట్స్ కమిటీ, ప్రధానోపాధ్యాయుల భాగస్వామ్యంతో నాడు-నేడులో ఆ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. స్కూల్‌లోని మరుగుదొడ్ల పరిశుభ్రతపై నెలవారీ సమీక్ష బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించారు. వీరు ఉన్నతాధికారుల సహాయంతో నీటి సరఫరాకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.



ప్రతి కదలిక.. తెలిసిపోతుందిక..

వాహనాల పర్యవేక్షణకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్.. అక్రమ రవాణా నివారణ, రహదారి భద్రతకు ప్రభుత్వ నిర్ణయం

- ఎన్ఐసీతో త్వరలో రవాణాశాఖ ఒప్పందం
- ఏప్రిల్ నుంచి దశలవారీగా అమలు



సాక్షి, అమరావతి: అక్రమ రవాణాను అరికట్టడం, రహదారి భద్రత దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అన్ని ప్రయాణ, సరుకు రవాణా వాహనాల గమనాన్ని ట్రాకింగ్ చేసే వ్యవస్థను నెలకొల్పనుంది. అందుకోసం అన్ని వాహనాలకు ట్రాకింగ్ పరికరాల ఏర్పాటును తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. వాహనాల ట్రాకింగ్‌ను పర్యవేక్షించేందుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)తో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనుంది. రాష్ట్రంలో దాదాపు 1.52 కోట్ల వాహనాలున్నాయి. వాటిలో రవాణాయేతర (వ్యక్తిగత) వాహనాలు 1.35 కోట్ల వరకు ఉంటాయని అంచనా. మిగిలిన దాదాపు 17 లక్షల వాహనాలు వాణిజ్య వాహనాలు. వాటిలో ప్రయాణ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు ఉన్నాయి. ఈ 17 లక్షల వాహనాలకు ట్రాకింగ్ పరికరాల ఏర్పాటును ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. కేంద్ర రవాణాశాఖ తాజా మార్గదర్శకాలను అనుసరించి ఈ నిర్ణయం తీసుకుంది. వాహనాలకు ట్రాకింగ్ పరికరాల ఏర్పాటును 2023 ఏప్రిల్ నుంచి దశలవారీగా అమలు చేయాలని రవాణాశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. మొదట ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల బస్సులకు ట్రాకింగ్ పరికరాలు అమరుస్తారు. ట్రాకింగ్ విధానాన్ని పర్యవేక్షిస్తారు. లోటుపాట్లు ఉంటే సరిచేసిన అనంతరం అన్ని ప్రయాణ, సరుకు రవాణా వాహనాలకు ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటుచేస్తారు. 2024 జనవరి నాటికి రాష్ట్రంలో అన్ని వాహనాలకు ట్రాకింగ్ పరికరాల ఏర్పాటు పూర్తిచేయాలని రవాణాశాఖ భావిస్తోంది.

24/7 పర్యవేక్షణ

ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేసిన వాహనాల ట్రాకింగ్‌ను 24/7 పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసీతో రవాణాశాఖ త్వరలో ఒప్పందం చేసుకోనుంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు రూ.20 కోట్లు వెచ్చించనున్నారు. వాహనాల ట్రాకింగ్‌ను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు అవసరమైన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు అక్కడ విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఎన్ఐసీ శిక్షణ ఇస్తుంది.

అక్రమాలు, నేరాలకు అడ్డుకట్ట

అక్రమ రవాణాను అరికట్టడం, రహదారి భద్రత కోసమే ట్రాకింగ్ పరికరాల ఏర్పాటును తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాకింగ్ పరికరం ఏర్పాటుతో వాహనాలు ఏ మార్గంలో ఏ సమయంలో ఎంతవేగంతో ప్రయాణిస్తోంది పర్యవేక్షించవచ్చు. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి సంబంధిత ప్రాంతంలోని పోలీసు, రవాణాశాఖ అధికారులను అప్రమత్తం చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయమై ఆ వాహనాల యజమానులకు సమాచారం ఇస్తారు. దీంతో యజమానులు తమ డ్రైవర్‌కు ఫోన్‌చేసి వేగాన్ని నియంత్రించమని ఆదేశించేందుకు అవకాశం ఉంటుంది. వాహనాల యజమానులు కూడా తమంతట తాముగా ఆ వాహనాల ట్రాకింగ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. ఇక అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టేందుకు ఈ ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుంది. స్మగ్లింగ్, ఇతర దందాల్లో ఉపయోగించే వాహనాలు ఏయే మార్గాల్లో ప్రయాణించిందీ, అక్రమంగా తరలించే సరుకును ఇతర వాహనాల్లోకి మార్చినా ఇట్టే కనిపెట్టవచ్చు. అక్రమ రవాణా దందాకు కేంద్రస్థానం, వాటి గమ్యస్థానాన్ని కూడా గుర్తించవచ్చు. ఇక కిడ్నాప్‌లు, ఇతర నేరాల్లో నేరస్తులు ఉపయోగించే వాహనాల గమనాన్ని గుర్తించి సంబంధిత ప్రాంతంలో పోలీసులను అప్రమత్తం చేయవచ్చు. కేసు విచారణలో ట్రాకింగ్ రికార్డును సాక్ష్యాధారాలుగా సమర్పించవచ్చు. ఇది దోషులకు శిక్షలు విధించేందుకు ఉపయుక్తంగా ఉంటుంది.

గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే విక్రయం

రాష్ట్రంలో ప్రయాణ, సరుకు రవాణా వాహనాలకు అవసరమైన ట్రాకింగ్ పరికరాల సరఫరాకు రవాణాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. వాహన యజమానులు తమ వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. గుర్తింపు పొందిన డీలర్ల నుంచే ట్రాకింగ్ పరికరాలు కొనుగోలు చేయాలని స్పష్టం చేయనుంది. తగిన నాణ్యత ప్రమాణాలతో ట్రాకింగ్ పరికరాలను సరఫరాచేసే డీలర్లకు రవాణాశాఖ గుర్తింపునిస్తుంది. ఒక ట్రాకింగ్ పరికరం ధర రూ.4 వేల నుంచి రూ.5 వేలలోపు ఉండేలా చూడాలని భావిస్తోంది. వాహన యజమానులకు పెద్దగా ఆర్థికభారం లేకుండానే ఈ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నది రవాణాశాఖ ఉద్దేశం.

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత

ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి



సాక్షి, అమరావతి: ఇంధన పొదుపును ప్రతి వినియోగదారుడు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఆదా చేసే ప్రతి యూనిట్... రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో సమానమని, దీనిని అందరూ దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఇంధన సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు, ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఇంధన సామర్థ్యంపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వినియోగదారులు ఇంధన సామర్థ్య చర్యలు చేపట్టాలని సూచించారు.

ఇంధన సంరక్షణ అవార్డులకు 92 దరఖాస్తులు

రాష్ట్రంలోని గృహ వినియోగదారులకు ఆధునిక ఇంధన సామర్థ్య ఉపకరణాలను అందజేయడానికి ఫాస్ట్ ట్రాక్ మోడ్‌లో నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని డిస్కంలు, ఏపీ సీడ్ కోలకు ఏపీఈఆర్సీ చైర్మన్ సూచించారు. రాష్ట్ర మొత్తం ఇంధన డిమాండ్‌లో గృహ విద్యుత్ వినియోగం దాదాపు 25 శాతం ఉన్నందున, విద్యుత్ సామర్థ్య ఉపకరణాల ప్రాజెక్ట్ గరిష్ట డిమాండ్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడానికి ఇంధన సామర్థ్యం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయమని చెప్పారు. జాతీయ స్థాయి అవార్డునందుకున్న రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం)ను ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, సభ్యులు పి.రాజగోపాల్ రెడ్డి, ఠాకూర్ రామసింగ్ అభినందించారు. జాతీయ ఇంధన సంరక్షణ అవార్డుల మాదిరిగానే రాష్ట్రస్థాయి ఇంధన సంరక్షణ అవార్డులు (సెకా)-2022 పోటీలను నిర్వహించినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. వివిధ పారిశ్రామిక యూనిట్లు, భవన నిర్మాణ రంగం, సంస్థలకు చెందిన 92 మంది పోటీదారుల నుంచి దరఖాస్తులు అందాయని, ఈ నెల 20న అవార్డులను అందజేస్తామని వెల్లడించారు. డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వను

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పునరుద్ఘాటన
- వచ్చే ఎన్నికల్లో జగన్ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేస్తా
- వారంలో ఒక్క రోజే ప్రజల్లోకి.. చందాలతో పార్టీ నడుపుతున్నా
- వైసీపీ గాడిదలు నన్ను వారాహి వాహనంపై ఎలా తిరగనివ్వవో చూస్తా



ధూళిపాళ్ల గ్రామంలో ప్రసంగిస్తున్న పవన్ కళ్యాణ్

సాక్షి, నరసరావుపేట: 'ఇప్పటం సభలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నాను. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఈసారి తిరిగి అధికారంలోకి రానివ్వను' అని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆదివారం ఆయన కౌలు రైతు భరోసా యాత్రలో మాట్లాడారు. 2014లో ఉన్న కూటమి తరఫున గత ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే, ఇప్పుడు బలమైన ప్రతిపక్షం ఉండేదన్నారు. విడిగా పోటీ చేయడం వల్ల వైఎస్సార్‌సీపీ గెలిచిందన్నారు. అందువల్ల ఈసారి జగన్ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేస్తానన్నారు. ఎన్నికల వ్యూహం తనకొదిలేయాలని, తనకు బాగా అవగాహన ఉందని చెప్పారు. ప్రజలంతా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా పవన్ ఇంకా ఏమన్నారంటే..

వారాహిని ఆపండి.. నేనేంటో చూపిస్తా...

- వారంలో ఒక్క రోజు వచ్చి రాజకీయాలు చేస్తున్నానని నన్ను ఎద్దేవా చేస్తున్నారు. నాకు ఉన్న సమయం అంతే. నాకు సొంత డబ్బులు లేవు. చందాలతో పార్టీ నడుపుతున్నాను. మీ అందరూ బలంగా కోరుకుంటేనే నేను ముఖ్యమంత్రి అవుతాను. ఇప్పటి వరకు అధికారం చూడని కులాలకు దామాషా పద్ధతిలో అధికారం లభించాలి. కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వానికి కనికరం లేదు.
- ప్రచారం కోసం సిద్ధంచేసిన వారాహి వాహనానికి వేసిన రంగు, ఎత్తు, దాని టైర్ల గురించి కొందరు విమర్శిస్తున్నారు. ఆ వాహనంతోనే రాష్ట్రంలోని రోడ్ల మీద తిరుగుతా. ముఖ్యమంత్రితో సహా ఎవరైనా వారాహిని ఆపండి.. నేనేంటో చూపిస్తా. వైఎస్సార్‌సీపీలో ఉన్న కాపు గాడిదలు ఎలా తిరగనివ్వవో చూస్తాను.
- 2019 ఎన్నికల్లో గాజు గ్లాసు కాదు, నా గుండెల్లో గునపం అన్న అంబటి రాంబాబు.. నాపై విమర్శలు మాని, ముందు పోలవరం పూర్తి చేయాలి. అంబటి కాపుల గుండెల కుంపటి.

ఇది మానవత్వం లేని ప్రభుత్వం: నాదెండ్ల

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక దాదాపు 3వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. బలవన్మరణాలకు పాల్పడిన కౌలు రైతు కుటుంబాల దీనస్థితిని చూసైనా ఈ ప్రభుత్వ పెద్దల మనసు కరగడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు.

చంద్రబాబును గాడిదలా మోస్తానని చెప్పు

- పవన్ కళ్యాణ్‌కు మంత్రి అంబటి రాంబాబు సలహా
- అమ్మవారి పేరు పెట్టిన రథంపై ఎలా ఎక్కి తిరుగుతావు?
- అందుకే రథం పేరు పంది లేదా చంద్రపందిగా మార్చుకో
- డొంకతిరుగుడు మానేసి టీడీపీలో చేరిపోతే సరి



సాక్షి, అమరావతి: 'వచ్చే ఎన్నికల్లో ఎవరు కలిసివచ్చినా, రాకపోయినా నేను మాత్రం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును గాడిదలా మోస్తాను.. మీరు కూడా చంద్రబాబును గాడిదలా మోయండి.. వ్యూహాన్ని నాకు వదిలేయండి' అనే సందేశాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బీజేపీకి, జనసేన కార్యకర్తలకు పంపుతున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తమ నాయకుడు సీఎం అవుతాడని చిందులేస్తున్న జనసేన కార్యకర్తలు, తమతో పొత్తులో ఉన్నాడని భావిస్తోన్న బీజేపీ నేతలు.. పవన్ కళ్యాణ్ అసలు వ్యూహం తెలుసుకోవాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు..

మాట మీద నిలబడతావా?

- ఇంతవరకు అధికారం చూడని కులాలకు, సామాజికవర్గాలకు అధికారం తీసుకు రావడమే జనసేన లక్ష్యం అంటున్నావు.. మరి ఆచరిస్తావా? ఇంతకు ముందు సీఎం పదవి రాని వాళ్లకు ఆ పదవి ఇవ్వడానికి సిద్ధమవుతావా? ఆ విధంగానే పొత్తులకు వెళ్తావా? మాట మీద నిలబడతావా? జగన్ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానన్నావు. అది మరిచిపోయావు.
- నాకు కులం లేదని ఇవాళ జాషువా పేరును కోట్ చేశావు. ఇంతకు ముందు చాలా మంది నాయకుల పేర్లు చెప్పావు. నీకు ఏ నాయకుడి ఆలోచన లేదు. నీకున్నదల్లా చంద్రబాబు ఆలోచనే.
- కొంచెమైనా జ్ఞానం లేకుండా ప్రచార రథానికి వారాహి అని ఎలా పేరు పెట్టుకుంటావు? వారాహి అంటే అమ్మవారు. అమ్మవారి అవతారం మీద ఎక్కి తిరుగుతావా? అందుకే రథానికి పంది లేదా చంద్రపంది అని పేరు పెట్టుకుని తిరుగు. వారాహి వాహనంపైకి ఎక్కి, పిచ్చి విమర్శలు చేస్తే.. అమ్మవారి ఆగ్రహానికి గురికాక తప్పదు. భస్మమై పోతావు.
- నాపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటాను. నీకేమైనా బుద్ధి ఉందా? ముద్రగడను నీ పార్టనర్ చంద్రబాబు వేధించినప్పుడు నేను అండగా ఉన్నా. ప్యాకేజీ పుచ్చుకున్న నీవే కాపులకు శని. నీ ప్యాకేజీ కోసం కాపులను బలి చేయొద్దు. రంగాను చంపిన వారిలో బాబు ఉన్నారని మరిచిపోవద్దు.
- బాబు హయాంలో పోలవరం గురించి ఎందుకు మాట్లాడలేదు? తిరుపతి ఉప ఎన్నిక తర్వాత, పవన్.. బీజేపీతో కలిసి పని చేశాడా? పూర్తిగా టీడీపీతోనే వెళ్తున్నాడు. డొంకతిరుగుడు లేకుండా టీడీపీలో చేరిపోతే సరి.

చంద్రబాబుకు, దుష్టచతుష్టయానికి పిచ్చెక్కింది

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని చూసి చంద్రబాబుకు, దుష్టచతుష్టయానికి పిచ్చెక్కిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. పచ్చ మీడియాకు వెర్రెక్కి పిచ్చిరాతలు రాస్తోందన్నారు. తప్పుడు రాతలు, కూతలతో చంద్రబాబును అందలం ఎక్కించేందుకు పచ్చమీడియా రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్మడం సిగ్గుచేటన్నారు. ఆయన ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ దళిత, వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యాపరంగా తలెత్తుకుని జీవించేలా సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు.

రూ.లక్షల కోట్ల సంక్షేమం కనిపించట్లేదా!

'చంద్రబాబు దళిత హక్కులు, చట్టాలను అపహాస్యం చేసినప్పుడు రామోజీరావుకు కనిపించలేదు. మాకు దక్కాల్సిన నిధులను పందికొక్కుల్లా మేసేసినప్పుడు పట్టలేదు. డ్వాక్రా రుణమాఫీ పేరిట మహిళలను వంచించినప్పుడు మేం గుర్తురాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల్ని అక్కున చేర్చుకుని ఆదరిస్తుంటే మీకు కడుపుమంట ఎందుకు? 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తే.. వారిలో మెజార్టీ మా వర్గాలే ఉన్నాయి. ఇవన్నీ కళ్లుండి చూడలేని వ్యక్తి మీరు. పల్లెల్లో ఎస్సీ, ఎస్టీలను వెళ్లి అడిగితే వాస్తవాలు తెలుస్తాయి' అని నాగార్జున విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు ఎస్సీలకు రూ.58,353.07 కోట్లు, ఎస్టీలకు రూ.15,660.03 కోట్ల మేర లబ్ధి జరిగిందని లెక్కలతో సహా వివరించారు. ఈ లబ్ధి చూసైనా అసత్య రాతలు మానుకోవాలని హితవు పలికారు.

టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడికి గుండెపోటు

చెన్నై కావేరీ ఆస్పత్రిలో చికిత్స

సాక్షి, చెన్నై: తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి (28) ఆదివారం చెన్నైలో గుండెపోటుకు గురయ్యారు. నగరంలోని కావేరీ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. శివ పేరుతో అందరికీ సుపరిచితుడైన చంద్రమౌళిరెడ్డి చెన్నైలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం ముంబయిలో ఉద్యోగం చేస్తున్నారు. త్వరలో వివాహం జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల నిమిత్తం చెన్నైకి వచ్చినట్లు తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో స్నేహితుడితో కలిసి కారులో వెళ్తుండగా గుండెపోటు వచ్చింది. వెంటనే నగరంలోని ఆల్వార్ పేటలో ఉన్న కావేరీ ఆస్పత్రిలో చేర్చారు. విషయం తెలియగానే ధర్మారెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు చెన్నై చేరుకున్నారు. ఆస్పత్రి వర్గాలు చంద్రమౌళిరెడ్డి ఆరోగ్య పరిస్థితిపై సోమవారం బులెటిన్ విడుదల చేయనున్నట్టు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు.

భలే మంచి చౌక బేరము

'సోలార్ యోజన' గడువు పొడిగింపు

- 2026 మార్చి 31 వరకూ దరఖాస్తుకు అవకాశం
- 3 కిలోవాట్ల సోలార్ యూనిట్ రూ.43 వేల వరకూ సబ్సిడీ
- 10 కిలోవాట్లు ఉంటే రూ.1,06,600 వరకూ మిగులు



సాక్షి, అమరావతి: సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను సాధించడం కోసం రూఫ్‌టాప్ సోలార్ యోజన స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. 2026 మార్చి 31 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ పథకం కింద 3 కిలోవాట్ల రూఫ్‌టాప్‌కు దాదాపు రూ.43 వేల వరకూ సబ్సిడీ అందించనుంది. 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్‌తో ఇంట్లో ఏసీ, ఫ్రిజ్, కూలర్, టీవీ, మోటార్, ఫ్యాన్ మొదలైన వాటిని నడపవచ్చు. దీని కోసం నెలనెలా ఎలాంటి బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మిగులు విద్యుత్‌ను ఇంట్లో అద్దెకున్న వారికి, పొరుగింటి వారికి విక్రయించడం ద్వారా కూడా డబ్బు సంపాదించవచ్చు.

అదనపు చార్జీలతో పనిలేదు

సోలార్ ప్యానెల్స్‌ను అమర్చడానికి ఎటువంటి అదనపు చార్జీలు చెల్లించవద్దని న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖ వినియోగదారులను కోరింది. తమ ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను అమర్చుకోవాలనుకునే వినియోగదారులు నేషనల్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకోసం ఏ కంపెనీకి అదనంగా ఎలాంటి చార్జీలు చెల్లించవద్దని, అలాగే మీటర్, టెస్టింగ్ కోసం సంబంధిత పంపిణీ సంస్థ నిర్ణయించిన మొత్తం కంటే ఎక్కువ చెల్లించవద్దని గృహ విద్యుత్ వినియోగదారులకు సూచించింది. ఎవరైనా అదనపు రుసుము కోరితే ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాల్సిందిగా తెలిపింది.

సబ్సిడీ మినహాయించి చెల్లిస్తే చాలు

ఒక కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే 100 చదరపు అడుగుల స్థలం ఉండాలి. ఎన్ని కిలోవాట్లు పెట్టాలనుకుంటే అన్ని వందల చదరపు అడుగులు అవసరం. బెంచ్‌మార్క్ ధరలపై సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (సీఎఫ్ఏ) 3 కిలోవాట్ల వరకూ 40 శాతం, 3 కిలోవాట్లపైన 10 కిలోవాట్ల కంటే ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలపై 20 శాతం సబ్సిడీ లభిస్తుంది. గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 1 కిలోవాట్‌కు అయ్యే రూ.50 వేల ఖర్చులో రూ.18,800 సబ్సిడీ వస్తుంది. అదే 10 కిలోవాట్ల ప్లాంట్ అయితే రూ.4.40 లక్షల్లో రూ.1,06,600 సబ్సిడీ లభిస్తుంది. వీటికి తోడు దరఖాస్తు రుసుం 5 కిలోవాట్ల వరకూ రూ.1,000, ఆ పైన రూ.5 వేల చొప్పున చెల్లించాలి. మీటరింగ్ చార్జీలు అదనం. ఈ ధరలు చెల్లించిన వారికి సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల రూపకల్పన, సరఫరా, ఏర్పాటు చేసి ఇవ్వడంతో పాటు బీమాతో సహా 5 ఏళ్ల వారంటీ లభిస్తుంది. ఈ మేరకు నగదును తగ్గించుకుని సంబంధిత ఏజెన్సీకి మిగతా ధర చెల్లిస్తే సరిపోతుంది. అయితే రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్, అపార్ట్‌మెంట్లకు 20 శాతం మాత్రమే సీఎఫ్ఏ వస్తుంది.

తెలంగాణ

ఘనంగా నాగోబా నూతన ఆలయ ప్రారంభం

నాగోబాతోపాటు సతీదేవతల విగ్రహాల ప్రతిష్టాపన

ఇంద్రవెల్లి: మెస్రం వంశీయులు రూ. 5 కోట్ల సొంత నిధులతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన నాగోబా ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం వేకువజామున 4.30 గంటలకు కొడప వినాయక్‌రావ్, ఆత్రం పురుషోత్తం మహారాజ్ ఆధ్వర్యంలో నాగోబా విగ్రహంతోపాటు సతీదేవతల విగ్రహాల ప్రతిష్టాపన, కలశాల ఆవిష్కరణ జరిగింది. ముందుగా వివిధ పుణ్యక్షేత్రాల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాల్లో విగ్రహాలను శుద్ధిచేసి ప్రతిష్ఠించారు. అనంతరం మెస్రం వంశీయులు హోమం నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ప్రారంభోత్సవ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ సోయం బాపూరావ్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రేఖానాయక్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురం భీం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారిని మెస్రం వంశీయులు సన్మానించారు. వేడుకలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి మెస్రం వంశీయులు, ఆదివాసీలు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మెస్రం యువకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా...

పర్యాటకంలో ఏపీకి మూడో స్థానం

- దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ కృషి
- లంబసింగిలో ఏపీ టూరిజం హరిత రిసార్ట్స్‌ను ప్రారంభించిన మంత్రి రోజా




రిసార్ట్స్ ప్రారంభిస్తున్న మంత్రి రోజా, పక్కన ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): పర్యాటకంగా మన రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కే రోజా చెప్పారు. రాష్ట్రంలో 9.30కోట్ల మంది పర్యటించారని, దీనివెనుక ప్రభుత్వ కృషి ఎంతో ఉందన్నారు. పర్యాటకంగా రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. చింతపల్లి మండలంలోని లంబసింగిలో ఏపీ టూరిజం సంస్థ రూ.3 కోట్లతో నిర్మించిన హరితా హిల్ రిసార్ట్స్‌ను ఆదివారం మంత్రి రోజా ప్రారంభించారు. అనంతరం పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో పాడేరు, అరకు, గండికోట ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగి, వంజంగి హిల్స్, పద్మాపురం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. లంబసింగిలో ఇప్పటి వరకు 4 సూట్లు మాత్రమే అందుబాటులో ఉండగా, మరో 11 అందుబాటులోకి తీసుకువచ్చామని, త్వరలో ఫంక్షన్ హాల్ కూడా పూర్తి చేస్తామన్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగానే కాకుండా పర్యాటక రాజధానిగా కూడా విలసిల్లుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70 యాక్ట్ అమలులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం లేదని, అందువల్ల పర్యాటకంగా అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, టూరిజం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం సందర్శనకు అనుమతివ్వండి

సీఎం జగన్‌కు రుద్రరాజు లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టును సందర్శించడానికి అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం లేఖ రాశారు. ప్రాజెక్టు జాప్యంపై 40మంది బృందంతో పోలవరాన్ని సందర్శించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు.

లంపీస్కిన్ వ్యాధిని అరికట్టాలి



సాక్షి, అమరావతి: ఆవులకు లంపీస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ఆదివారం ఓ లేఖలో కోరారు. పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపే ఈ వ్యాధి రాష్ట్రంలో ఆవులకు వేగంగా వ్యాపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాధి కారణంగా ఆవుల మరణాలతో పశు పోషకులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో కంటే మిన్నగా ఎస్సీ, ఎస్టీలకు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా సీఎం వైఎస్ జగన్ లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయాల ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. మూడున్నర సంవత్సరాలలో 98.5 శాతం హామీలను అమలుపరచిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. టీడీపీ, పచ్చపత్రికలు ఎస్సీ, ఎస్టీలపై కపటప్రేమను నటిస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలతో సహా యావత్ ప్రజానీకం సీఎం జగన్ వెంటే ఉందని వివరించారు.



అత్యంత సూక్ష్మమైన కల్పనాశక్తికి కూడా అందకుండా నిజ జీవితంలో వెయ్యి ఘటనలు జరగొచ్చు.
– ఫ్యొదర్ దోస్తొయెవ్‌స్కీ

సాక్షి
సోమవారం, డిసెంబర్, 19

అర్థం లేనితనం

"అమ్మ ఈ రోజు చనిపోయింది. లేదా బహుశా నిన్న, నాకు తెలీదు.'' ఈ ప్రారంభ వాక్యాలతో ఉదాసీన గొంతుకతో మొదలయ్యే 'ద స్ట్రేంజర్' నవల సరిగ్గా ఎనభై ఏళ్ల క్రితం 1942లో వచ్చింది. ఆల్బర్ట్ కామూ ఫ్రెంచ్ భాషలో రాసిన, ఆంగ్లంలో 'ది ఔట్‌సైడర్' పేరుతో కూడా ప్రసిద్ధమైన ఈ నవల అసంబద్ధవాద తాత్విక చింతనకు శిఖరాయమానమైన రచనగా నిలిచింది.

ఈ ప్రపంచానికి ఏ క్రమమూ లేదు, జీవితం అనేదానికి ఏ పరమార్థమూ లేదని అసంబద్ధవాదం చెబుతుంది. ఈ ప్రపంచం ఇలా ఉంటే బాగుంటుందనే అంచనాతో జనాలు ప్రవర్తిస్తారు. అలా ఉన్నా, ఉండకపోయినా ఈ ప్రపంచానికి పోయేదేమీ లేదు. కానీ మన తార్కిక మెదడు ఒక క్రమాన్నీ, అర్థాన్నీ అందుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంది. ఈ కఠిన సత్యాన్ని మనిషి అనేవాడు ఎదుర్కోవాల్సిందే. లేదా చచ్చిపోవడమే దారి. అలా చేయలేనివాళ్లు దేవుడినో, ఆధ్యాత్మికతనో ఆశ్రయిస్తారు. దానికి బదులుగా ఆ అర్థంలేనితనాన్ని అంగీకరించడం ఉత్కృష్ట మార్గం. దీన్నే మహత్తరమైన వచన సరళతతో, అత్యంత సంక్లిష్టమైన యాంటీ–హీరో పాత్ర చిత్రణతో నిరూపిస్తాడు కామూ.

ఫ్రెంచ్–అల్జీరియాలోని అల్జీర్స్ నగరంలో మ్యార్‌సో ఒక మామూలు ఉద్యోగి. వచ్చేది అరాకొరా జీతం. తల్లిని మరెంగో గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఉంచుతాడు. ఆమె మరణవార్త టెలిగ్రామ్ అందుకున్నాక, అంత్యక్రియలకు రెండ్రోజుల సెలవు అడుగుతాడు. (దానికి బాస్ చిరాకుగా ముఖం పెడతాడు. కారణం: అంత్యక్రియలు శుక్రవారం కాబట్టి, వీకెండ్‌తో కలుపుకొని ఆ సెలవు నాలుగు రోజులవుతుంది.) అలా సెలవు అడగాల్సి వచ్చినందుకు పశ్చాత్తాపపడుతూనే తల్లి దగ్గరికి వెళ్లిన మ్యార్‌సో ప్రవర్తనలోని పొసగనితనాన్ని ప్రపంచం అడుగడుగునా గమనిస్తుంది. తల్లి శవం పక్కన జాగారం చేస్తూ సిగరెట్ కాల్చుతాడు. కాఫీ తాగుతాడు. అతడు వెళ్లేప్పటికే మూసేసివున్న శవపేటిక తలుపు తెరవనక్కర్లేదని చెప్పి అక్కడి సహాయకుడిని విస్తుపోయేలా చేస్తాడు. ఇంకా ముఖ్యంగా తల్లి చనిపోయిందని ఏడ్వడు. తెల్లారి బీచిలో మాజీ సహోద్యోగి మరీ కార్డోనా అనుకోకుండా ఎదురవుతుంది. ఇద్దరూ ఈత కొడతారు. మ్యార్‌సో కోరిక మీద సినిమాకు వెళ్తారు. అది కూడా కామెడీ సినిమా. ఆ రాత్రి ఇద్దరూ కలిసి గడుపుతారు. గతం రోజే తల్లి ఖననం జరిగివుందనేది ఒక నేపథ్య వాస్తవం. మ్యార్‌సో తన చర్యల పరిణామాల గురించి ఆలోచించడు. ఇతరులు ఏమనుకుంటారో అని తలచడు. సందర్భశుద్ధి గల ఉద్వేగాలు ప్రకటించడు. సింపుల్‌గా చెప్పాలంటే, అతడు జీవితపు ఆట ప్రకారం ఆడడు. అందుకే అతడు సమాజానికి 'అపరిచితుడు', లేదా 'బయటివాడు'. అందువల్ల దానికి తగిన మూల్యం చెల్లిస్తాడు. అనుకోకుండా అతడు చేసిన హత్య కన్నా, అతడి (అ)ప్రకటిత ఉద్వేగాలు ఎక్కువ ప్రశ్నార్థకం అవుతాయి.

నిజాయితీతో కూడిన జవాబులే అయినప్పటికీ – విచారణ సమయంలో తాను అరబ్బును చంపడానికి కారణం మండుటెండ పుట్టించిన చీదర అని జవాబివ్వడం ద్వారా న్యాయమూర్తినీ, జైల్లో పడ్డాక కూడా తనకు దేవుడు అక్కర్లేదని మతగురువునూ చీకాకుపెడతాడు మ్యార్‌సో. ప్రకృతి మాత్రమే మన జీవితాల్ని శాసిస్తుందని చెప్పడం కామూ ఉద్దేశం. భౌతిక అవసరాలు మాత్రమే మ్యార్‌సోను శాసిస్తాయి. జైలు మూలంగా ఈత కొట్టలేకపోవడం, సిగరెట్లు కాల్చలేకపోవడం, శృంగార జీవితం లేకపోవడం గురించి బాధపడతాడు. ఆ శృంగారం కూడా ప్రత్యేకించి మరీయే అని కాదు. నిజానికి మనుషులు లోలోపల ఇలాగే ఉంటారు. కానీ పైన ఒక ఆమోదనీయ పొరను కప్పుకొంటారు. ఇంకోలా ఉండాలనో, ఉండలేకపోవడం తప్పనో భావిస్తారు.

ఒకప్పుడు లక్ష్యం ఉండి, ఇప్పుడు అంతా ఒకటే అనే స్థితి మ్యార్‌సోది. ప్రమోషన్ వచ్చినా, రాకపోయినా తేడా లేదనే మనిషి ఎవరు ఉండగలరు? ఇదొక రుషిత్వపు లక్షణంలా కనబడుతుంది. కానీ ఎలా ఉన్నా అర్థమే లేనప్పుడు, దానికోసం మళ్లీ ప్రత్యేకంగా తపన పడటం ఎందుకనేది అతడి వాదం. నిజానికి ఒక సున్నితమైన మనిషి మ్యార్‌సోలో ఉంటాడు. అరబ్బును చంపిన తర్వాత తానిక సంతోషంగా ఉండలేనని అతడికి తెలుసు. అయినా అది జరిగిపోయింది. దానికి ఇదమిత్థంగా కారణం చెప్పలేడు. అరబ్బు హత్య, ఆ హత్యకు దారితీసిన పరిస్థితులు, ఇవేవీ కూడా ఒక క్రమం వల్ల జరిగినవి కావు. కానీ మ్యార్‌సో జీవితం ఒక పెద్ద మలుపు తిరుగుతుంది. జీవితానికో ప్రత్యేక క్రమం ఉందన్న వాదనను ఇది పటాపంచలు చేస్తుంది. అందుకే చివరలో గిలటిన్‌తో తలను తెగ్గొట్టే మరణశిక్ష అనుభవించడానికి ముందు, ఇక అక్కడ పోగుకాబోయే కోపగ్రస్థ మూక అరుపులను ఊహించుకున్నాక, ప్రపంచం గురించి అతడికి ఉన్న ఆ చివరి భ్రమలు కూడా తొలగిపోతాయి. జీవితపు సున్నితమైన ఉదాసీనతకు మేలుకుంటాడు. శిక్షను తేలిగ్గా అనుభవించే మానసిక స్థితికి వస్తాడు. అతడి చింతన సంపూర్ణమవుతుంది.

ఊహ తెలిసేనాటికే మొదటి ప్రపంచ యుద్ధంలో తండ్రిని పోగొట్టుకున్నాడు కామూ. రెండో ప్రపంచ యుద్ధంలో లక్షలాది మంది జీవితాలు చెదిరిపోవడం చూశాడు. అల్జీరియాలో ఫ్రెంచివారి అణిచివేతకు సాక్షిగా ఉన్నాడు. పేదరికాన్ని అనుభవించాడు. జీవితపు అర్థరాహిత్యం ఆయన అనుభవసారం. కథకుడు, నాటకకర్త, పాత్రికేయుడు అయిన కామూ తన 28వ యేట 'స్ట్రేంజర్' రాశాడు. 1957లో నోబెల్ వరించింది. ఆ పురస్కారం అందుకున్న అత్యంత పిన్నవయస్కుల్లో ఒకరిగా నిలిచాడు. కానీ మూడేళ్లకే తన 46వ యేట కారు ప్రమాదంలో అర్ధాంతరంగా కన్నుమూశాడు, ప్రపంచపు అసంబద్ధతను తన జీవితం ద్వారా కూడా నిజం చేస్తూ!

ఎలా ఉంటే స్వతంత్రత?

కామెంట్



కరణ్ థాపర్

జర్నలిజంలో సాహసం అంటే, ఆ పదం ప్రభుత్వానికి విరోధిగా ఉండాలన్న ఒత్తిడి చేస్తుంది. అది నిజం కాదు. జర్నలిస్టులు వాస్తవికంగా ఉండాలి. ప్రతి కథనాన్ని దాని యోగ్యతను బట్టి మాత్రమే మదింపు చేయాలి. ప్రభుత్వాన్ని పొగడటం చాలా సులభం. కానీ విమర్శించడమే కష్టం. ఇక్కడ తెగువ, సాహసం ముందుకొస్తాయి. ఎన్డీటీవీ ఛానల్‌లో గౌతమ్ అదానీ మెజారిటీ వాటాదారుగా మారిన నేపథ్యంలో ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఛానల్‌ను స్వాధీనపర్చుకోవడాన్ని ఒక వ్యాపార అవకాశంలా కాక ఒక 'బాధ్యత'గా చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రాథమికంగా చూస్తే ఇది చక్కటి హామీని ధ్వనింపజేస్తోంది. అయితే మీడియా స్వాతంత్య్రం పట్ల ఆయన అభిప్రాయాలను బట్టి దీన్ని చూడాల్సి ఉంటుంది.

భారతదేశంలోని 400 వార్తా ఛానల్స్‌లో నేను ఎక్కువగా చూసేది ఎన్డీటీవీ. అయితే తరచుగా దానిలో వచ్చే అంశాల పట్ల, ఆ ఛానల్ యాంకరింగ్ పట్ల నేను విమర్శనాత్మకంగా ఉంటున్నప్పటికీ, అదే సమయంలో ఆ రెండింటినీ ఆరాధిస్తుంటాను. కాబట్టే ఛానల్‌ని గణనీయంగా మార్చేసే అధికారంతో అతి త్వరలో గౌతమ్ అదానీ ఎన్డీటీవీ మెజారిటీ వాటాదారుగా మారుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఇది మనకు తెలిసిన రూపంలోని ఎన్డీటీవీకి ముగింపు పలకనుందా?

'ద ఫైనాన్షియల్ టైమ్స్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అదానీ తన భవిష్యత్ పథకాల గురించి మాట్లాడారు. నాకు తెలిసినంతవరకూ, ఆయన ఈ ఒక్కసారి మాత్రమే ఈ విషయం మీద ఇలా మాట్లాడారు. ఎన్డీటీవీని స్వాధీనపర్చుకోవడాన్ని ఒక వ్యాపార అవకాశంలా కాక ఒక 'బాధ్యత'గా చూస్తున్నట్లు చెప్పారు. ప్రాథమికంగా చూస్తే ఇది చక్కటి హామీని ధ్వనింపజేస్తోంది. కానీ అది నిజమేనా?

మిగిలిన ఇంటర్వ్యూ విశ్వసనీయ సందేహాల కోసం మంచి కారణాలనే ప్రతిపాదిస్తుంది. మీడియా స్వతంత్రతపై అదానీ భావన నుంచి అవి పుట్టుకొస్తున్నాయి. "స్వాతంత్య్రం అంటే, ప్రభుత్వం ఏదైనా తప్పు చేస్తే అది తప్పు అని నువ్వు చెప్పడం అన్నమాట. ఎవరూ దానిపై తగవులాడరు. కానీ అదే సమయంలో, ప్రభుత్వం ప్రతిరోజూ సరైన పని చేస్తున్నప్పుడు దాని గురించి చెప్పే సాహసం నీకు ఉండాలి'' అని అదానీ జోడించారు. ప్రతిరోజూ మంచి పని చేస్తున్న ప్రభుత్వం ఏది? అలాంటి ప్రభుత్వం ఏదీ నాకు తెలీదు. అలాంటి పనిని గుర్తించడానికి మీకు సాహసం ఎందుకు కావాలి? ఆ పదం జర్నలిజపు విస్తృత సముదాయాన్ని బట్టి మిమ్మల్ని కేవలం విరోధిగా మాత్రమే ఉండాలని ఒత్తిడి చేస్తుంది. కానీ అది నిజం కాదు.

జర్నలిస్టులు వాస్తవికంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి కథనాన్ని దాని యోగ్యతను బట్టి మాత్రమే వారు మదింపు చేయవలసి ఉంటుంది. ఒక పక్షం వహించకూడదు లేదా తటస్థంగా కూడా ఉండకూడదు. ప్రభుత్వాన్ని పొగడటం నిజానికి చాలా సులభం. వారు దాన్ని ఇష్టపడతారు కూడా. కానీ ప్రభుత్వాన్ని



విమర్శించడమే చాలా కష్టం. ఇక్కడ తెగువ, సాహసం ముందుకొస్తాయి. మీడియా స్వాతంత్య్రానికి సంబంధించిన అదానీ భావన దీన్ని స్వీకరిస్తుందని నేను చెప్పలేను. ఆయన పదజాలం అలా స్వీకరించదనే సూచిస్తుంది.

అయినప్పటికీ అదానీకి ఎన్డీటీవీ కోసం పెద్ద పథకాలే ఉన్నాయి. ఆ ఛానల్‌కి అంతర్జాతీయ పాదముద్రను ఇవ్వాలని ఆయన కోరుకుంటున్నారు. 'ఫైనాన్షియల్ టైమ్స్' లేదా 'అల్ జజీరా'తో సరిపోల్చే స్థాయిలో భారతదేశానికి ఒక్క మీడియా సంస్థ కూడా లేదని కూడా ఆయన అన్నారు. ఇది రెండు విషయాలను సూచిస్తోంది. అదానీ ఎన్డీటీవీలో చాలా పెట్టుబడి పెట్టబోతున్నారు. బహుశా ఆయన ఆ ఛానల్ విశ్వసనీయతను కాపాడవచ్చు. ఎందుకంటే అలా కాపాడకపోతే, ఫైనాన్షియల్ టైమ్స్, అల్ జజీరా స్థాయిని అది సాధించలేదు మరి!

ఇక్కడ సమస్య ఏమిటంటే, మీడియా స్వాతంత్య్రంపై ఆయన భావనతో ఈ ప్రశంసించదగిన ఆకాంక్ష ఘర్షణ పడుతోంది. పైగా, ఇది ఆయనను ఒక భయంకరమైన సందిగ్ధంలో ఉంచుతోంది. లేదా రెండు సందిగ్ధాలు అని కూడా చెప్పవచ్చు.

ఎన్డీటీవీ ప్రతిరోజూ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఉన్నట్లయితే దాన్ని ప్రభుత్వ ప్రచార అంగంగా మాత్రమే చూస్తారు. అప్పుడు అది ఫైనాన్షియల్ టైమ్స్, అల్ జజీరా స్థాయికి ఎన్నటికీ పెరగలేదు. అదానీకి అర్థం కానిది ఏమిటంటే, విమర్శనాత్మకంగా ఉండే దాని వస్తుగతతత్వం, సాహసమే ఫైనాన్షియల్ టైమ్స్‌ని గొప్ప పత్రికగా మలిచిందన్నదే! అల్ జజీరా విషయంలో కూడా ఇది నిజమే. కాకపోతే ఖతార్‌లో తన సొంత ప్రభుత్వ వార్తలను కవర్ చేసే విషయంలో మాత్రం ఇది నిజం కాకపోవడం విషాదం.

మరొకటి జరగవచ్చు. ఎన్డీటీవీని గ్లోబల్‌గా మార్చడానికి తగినంత డబ్బు అదానీ వద్ద ఉంది. దాన్ని ప్రపంచంలోని ప్రతి మూలకూ చేరుకోగలిగే ఉపగ్రహాలపై అదానీ వెచ్చించగలరు. అయితే ఆ టీవీ ఛానల్ విశ్వసనీయతనే నిర్లక్ష్యం చేసినప్పుడు ఎవరైనా దాన్ని చూడగలరా? బహుశా తాము వదిలిపెట్టి వెళ్లిన గడ్డ గురించి ఇప్పటికీ బాధపడుతున్న, పూర్తిగా స్వదేశంలో లేని కొద్దిమంది ప్రవాస భారతీయులు మాత్రమే ఆ ఛానల్‌ని చూడవచ్చు తప్ప మరెవరూ చూడబోరు.

అదానీ చెప్పని మరో విషయం ఉంది. కానీ తన కొత్త ఛానల్ కోసం తన మనస్సులో ఉన్న ఏ విషయానికైనా నిజానికి అది కీలకమైంది. ఎన్డీటీవీకి విశిష్టమైన స్వభావం, విశ్వసనీయమైన వీక్షకులు, అత్యంత అధిక ప్రతిష్ఠ ఉన్నాయి. ఈ ఛానల్‌ని కొనడానికి వందలాది కోట్లు వెచ్చించిన తర్వాత (దాన్ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడానికి వేల కోట్లు కూడా వెచ్చించవచ్చు) దాని ప్రతిష్ఠను దిగజార్చి నష్టం కలిగించేలా మార్పులు చేపట్టగలరా? అందుచేత ఆ ఛానల్ ఉత్తమ యాంకర్లు, కరెస్పాండెంట్లను ఆయన అట్టిపెట్టుకోవచ్చు. వీరే లేకుంటే ఎన్డీటీవీ ఉత్త హార్డ్‌వేర్ లాగా మాత్రమే ఉంటుంది. కానీ వారి వస్తుగత పనితత్వాన్ని, వారి వాక్ స్వాతంత్య్రాన్ని దెబ్బతీసినట్లయితే వారు సంస్థలో కొనసాగుతారా?

బహుశా, ఇదే ఆయన ఆలోచనలను కాస్త పదును పెట్టవచ్చు. సంస్థ నుంచి వెళ్లిపోయేవారి స్థానంలో కొత్త జర్నలిస్టులను నియమించడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ మంచి జర్నలిస్టులను వెతకడమే చాలా కష్టమైన పని. అలాంటివారు ఇప్పటికే చక్కటి వేతనాలతో సురక్షిత స్థానాల్లో ఉండవచ్చు. తమకు సుపరిచితం కాని వ్యవహారంలోకి అడుగుపెట్టి వారు తమను తాము ఎందుకు బలిపెట్టుకుంటారు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగ్గించలేవు



ఆయుర్వేదం గానీ, హోమియోపతి మందులు గానీ గ్లకోమా, క్యాటరాక్ట్, రెటీనల్ లేదా ఆప్టిక్ నర్వ్ వ్యాధులను నయం చేయలేవు. ప్రత్యామ్నాయ చికిత్సల మీద రోగులు డబ్బునూ, సమయాన్నీ వృథా చేసుకోవడం బాధాకరం.

– పారుల్ ఎం.శర్మ, కంటి సర్జన్

ఒప్పుకోకున్నా చెప్పనివ్వు



భావ స్వేచ్ఛ అంటే, మీరు ఒప్పుకునేదాన్ని రక్షించడం వరకే పరిమితం కాదు. మీరు అసహ్యించుకునే అభిప్రాయాన్ని కూడా రక్షించడం.

– రాబ్ ష్నైడర్, అమెరికన్ నటుడు

రాలిపోతున్నారు



బీజింగ్‌లోని బాబోషాన్ శ్మశానంలో పొగలు వస్తూనే ఉన్నాయి. చైనా రాజధాని బీజింగ్‌లోని అన్ని శ్మశానాలూ 24 గంటల పాటు పని చేస్తున్నాయి. అయినా వాటికి శవాల నిర్వహణ సాధ్యం కావడం లేదు. దీన్ని పంచుకోవడంలో నాకేమైనా ఉద్దేశం ఉందా అని ఎవరో అడిగారు. నాకే ఉద్దేశమూ లేదు. ఎవరి ఎజెండానూ నేను మోయడం లేదు.

– జెన్నిఫర్ జెంగ్, చైనా అంశాల వ్యాఖ్యాత

తగని మాట



నేను మళ్లీ చెబుతున్నా, బిలావల్ భుట్టో జర్దారీ భాష దౌత్యపరమైనది కాదు. ఏ కొద్ది దౌత్య జ్ఞానం ఉన్న వ్యక్తి కూడా దాన్ని ప్రోత్సహించరు. ఆయనొక విదేశాంగ మంత్రి. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలిసివుండాలి. పాకిస్తాన్‌లో అత్యధికులు ఆయన్ని ప్రోత్సహిస్తున్నారు. అయినా అది దౌత్యపరమైన భాష అయితే కాదు. అంతే!

– వీంగాస్, పాకిస్తాన్ జర్నలిస్ట్

సమాంతర చరిత్ర



సోమనాథ్ దేవాలయాన్ని మహమ్మద్ గజినీ కొల్లగొట్టాడని అందరికీ తెలుసు. ఇండోనేసియా (సిరివిజయ)ను రాజేంద్ర చోళుడు కొల్లగొట్టాడని దాదాపుగా అందరికీ తెలుసు. కానీ కొద్దిమందికే ఆ రెండు ఘటనలూ ఒకే సంవత్సరంలో (1025) జరిగాయని తెలుసు.

– అమిత్ పాండీలియా, రచయిత

వెళ్లడమే యాతన



పెళ్లిళ్ల సీజన్ కథ: తయారవడానికి గంట. 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేదికకు వెళ్లడానికి మూడు గంటలు. అక్కడ ఉండేది అరగంట. అలసిపోయాను. కొత్త సంవత్సర తీర్మానం: దంపతులను తర్వాత కలిసి, మాట్లాడి, నా బహుమతి ఇచ్చిరావాలి.

– స్మితా దేశ్‌ముఖ్, సమాచార నిపుణురాలు

అర్థమయ్యేట్టు రాయకూడదా?



అకెడమిక్ రాతలు చదవడానికి ఇబ్బందిగా ఉండి, కష్టంగా నాకు అర్థమవుతాయి. భాషతో మాత్రమే కాదు, వాక్య నిర్మాణంతో కూడా నేను ఇబ్బందిపడతాను. ఎందుకిలా రాస్తారు? సరళంగా రాస్తే దాని ప్రాధాన్యం ఏమైనా తగ్గిపోతుందా?

– గజాలా వాహబ్, సంపాదకురాలు

అమర మిత్రులు!

దేశ స్వాతంత్య్రం కోసం అనేక మంది యువ కిశోరాలు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారు. వారిలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ ముఖ్యులు. వయసుకు మించిన పరిణతితో దేశం కోసం ఉరితాడును ముద్దాడి నూరేళ్ల ఖ్యాతిని ఆర్జించారు. బిస్మిల్ 1897 జూన్ 11వ తేదీన, అష్ఫాఖ్ 1900 అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో జన్మించారు. రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖ్‌ల కుటుంబ నేపథ్యాలు ఉత్తర దక్షిణ ధ్రువాల్లాంటివి. బిస్మిల్ సనాతన హిందువు, ఆర్యసమాజ సభ్యుడు. అష్ఫాఖ్ సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన ముస్లిం. భిన్న సామాజిక జీవన నేపథ్యాల నుండి వచ్చినా వీరు గొప్ప స్నేహితులయ్యారు. బిస్మిల్ మొదట్లో అష్ఫాఖ్‌ను ఒక పట్టాన నమ్మలేదు, కాని అచంచలమైన అష్ఫాఖ్ దేశ భక్తికి, అంకిత భావానికి బిస్మిల్ చలించి పోయాడు. ఇద్దరూ యుక్త వయసులోనే పదునైన కవిత్వం రాశారు. సామ్రాజ్యవాద భావ జాలాన్ని తుత్తునియలు చేశారు.



రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్

మాతృదేశ స్వాతంత్య్ర ఉద్యమ అవసరాల కోసం ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగస్టు 9వ తేదీన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ , చంద్ర శేఖర్ ఆజాద్ లాంటి మరికొందరు విప్లవకారులు కలిసి 'కకోరీ' గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో పోతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిష్ ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంత పనైతే, ఉద్యమకారులకు కొత్త ఉత్సాహాన్ని అందించి నట్లయింది. సెప్టెంబర్ 26న రాంప్రసాద్ బిస్మిల్‌ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ తప్పించుకున్నాడు. కొన్నాళ్ళ పాటు బనారస్‌లో అజ్ఞాత జీవితం గడిపి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీలో మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. చివరికి 1927 డిసెంబర్ 19వ తేదీన అష్ఫాఖ్, రాంప్రసాద్ బిస్మిల్‌లను ఉరితీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ ఈ ఇద్దరు ప్రాణ మిత్రులు మాతృదేశ విముక్తి కోసం ఉరి కంబాన్ని ఎక్కబోతున్నందుకు గర్వపడుతున్నామని ప్రకటించారు.

ఇద్దరినీ వేర్వేరు జైళ్ళలో ఒకేరోజు ఉరి తీశారు. భూప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ అష్ఫాఖ్, బిస్మిల్‌ల త్యాగం, స్నేహం సజీవంగా ఉంటాయి. హిందూ – ముస్లిం ఐక్యతను చాటుతూ... మతోన్మాదులకు సవాల్ విసురుతూనే ఉంటుంది!

– ఎం.డి. ఉస్మాన్ ఖాన్

(నేడు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లను ఉరితీసిన రోజు)

సాహిత్యకారుల్లో చాతుర్వర్ణాలు!

అభిప్రాయం



బి.ఆర్. బాపూజీ

ఇటీవల సాహిత్య సభల్లో – అది పుస్తకా విష్కరణ సభ గానీ, ఇంకోరకం సభ గానీ– ఒక ధోరణి అంటువ్యాధి లాగా తయారైంది. ఆ సభలకి సంబంధించిన దాదాపు అన్ని ఆహ్వాన పత్రాల్లోనూ ఇలా ఉంటుంది: "ముఖ్య అతిథి, గౌరవ అతిథి, విశిష్ట అతిథి, ఆత్మీయ అతిథి''– అని నాలుగు రకాల అతిథులూ, వారి పేర్లూ ఉంటాయి. ఇంతకీ, ఈ అతిథుల్లో ఎవరు ముందో, ఎవరు తర్వాతో, ఎవరు ఎక్కువ గొప్పో, ఎవరు తక్కువ గొప్పో తేల్చడం కష్టం. ఆ ఆహ్వాన పత్రంలో, ఏ వరసలో ఆ మాటలు రాశారో, బహుశా ఆ వరసలోనే వాళ్ళ అంతస్తు లేదా హోదా వుంటుందనుకోవాలేమో!

అతిథుల్లో ఈ నాలుగు రకాల్నీ చూస్తే, చాతుర్వర్ణ వ్యవస్థ అంటారే అది గుర్తొస్తుంది. ఈ హైరార్కీని (అంతస్తుల వారీ సంబంధాలను) 11వ శతాబ్దంలో, రాజాస్థాన కవులు పాటించారో లేదో తెలియదు. కానీ, ఈ 21వ శతాబ్దంలో, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారాల కాలంలో మాత్రం, ఆధునికులూ, ఉత్తరాధునికులూ, అభ్యుదయ వాదులూ, విప్లవ వాదులూ, దళిత వాదులూ, స్త్రీ–పురుష సమానత్వ వాదులూ... ఇలా అన్ని రకాల వారూ ఈ హైరార్కీని పాటిస్తున్నారు. నోరు తెరిస్తే, 'చాతుర్వర్ణ వ్యవస్థ', 'మనువాదం', 'బ్రాహ్మణీయ సంస్కృతి', 'ఫ్యూడల్ సంస్కృతి', 'పితృస్వామ్య సంస్కృతి' అని మైకులు బద్దలయ్యేలాగా నినాదాలిస్తారు. మళ్ళీ ఆ అసమాన సంస్కృతినే పాటిస్తారు. అటు సభా నిర్వాహకులకు గానీ, ఇటు అతిథులుగా ఆహ్వానం పొందిన సాహిత్యకారులకు గానీ, 'ఇదేమి పద్ధతి?' అనే ఆలోచనే రావడం లేదు.

ఈ మధ్య, ఇలాంటి ఆహ్వాన పత్రాలు మూడు వేరు వేరు సభలకి సంబంధించినవి, ఫోనులో నాకు అందాయి. వాటిని పంపిన వాళ్ళతో, 'చాతుర్వర్ణాల్లాగా, ఇన్ని రకాల అతిథులేమిటండీ?'– అంటే, ఒకరు 'నిజమే' అనీ; ఇంకొకరు 'ఈసారి ఇలా జరగకుండా చూసుకుంటాం' అనీ; మరొకరు, రాయడానికి బద్ధకం వేసి, ఎమోజీలు అంటారే, ఒక నవ్వు బొమ్మా, రెండు నమస్కారాల బొమ్మలూ జవాబుగా పంపారు.

కొందరు అతిథులు తమ పేరుకు ముందుగానీ, కిందగానీ, తమకు ఉన్న డిగ్రీల్నీ (డాక్టర్, ప్రొఫెసర్), ఇంతకు ముందు అనుభవించిన పదవుల్నీ (డైరెక్టర్, వైస్–ఛాన్సలర్), పొందిన అవార్డుల్నీ (అకాడెమీలో, పీఠాలో ఇచ్చిన వాటిని), ఇంకేమైనా అదనపు బిరుదులు వుంటే వాటినీ, ఆహ్వాన పత్రంలో రాయమంటారని విన్నాను. రైలు ఇంజను వెనక వరసగా రైలు పెట్టెల్లాగా ఆ విశేషణాల్ని పేర్చ మంటారన్నమాట!

చాతుర్వర్ణ విమర్శను, 'నిజమే' అని అంగీకరించినాయన, "ఇంతకీ, ఈ సభల్లో 'పంచములు' ఎవరంటారు?'' అని ప్రశ్న వేశాడు. "ఇంకెవరు? సభకి వచ్చి, ఈ గొప్ప అతిథులందరూ కూర్చున్న వేదికని ముట్టుకోడానికి వీల్లేనంత దూరంగా (అస్పృశ్యత), ప్రేక్షక స్థానాల్లో కూర్చుంటారే వారే పంచములు!'' అని జవాబిచ్చాను.



సాహిత్యసభల్లో పాటిస్తున్న ఈ చాతుర్వర్ణ వ్యవస్థ ఈ నాటిది కాదు. పాతికేళ్ళ కిందట, హైదరాబాదు యూనివర్సిటీలో, ఇతర విద్యార్థి సంఘాల వారి లాగే, ఒక దళిత విద్యార్థి సంఘం వారు, వాళ్ళ సభకి సంబంధించి ఒక ఆహ్వాన పత్రాన్ని నాకు ఇచ్చారు. ఆ పత్రంలో అన్ని అంతస్తుల అతిథుల పేర్లూ రాసి, ఆ పత్రాన్ని ఖరీదైన కవరులో పెట్టి ఇచ్చారు. "ఇదేమిటి బాబూ! సభకి వచ్చే వాళ్ళల్లో ఇన్ని తేడాలు ఎందుకు? 'వేదిక మీద వాళ్ళే ముఖ్యులు, వేదిక కింద ఉన్న వాళ్ళు ముఖ్యులు కారు'– అనా? 'వక్తలు' అని, ఆ సభలో మాట్లాడేవారి పేర్లు రాస్తే సరిపోతుంది గదా? మాట మాట్లాడితే 'బ్రాహ్మణీయ సంస్కృతి నశించాలి!' అంటారు. అసమానత్వాన్ని సూచించే పద్ధతిని మీరూ పాటిస్తే ఎలా? పైగా, ఇంత ఖరీదైన కవరు ఎందుకూ? ఆ డబ్బులేవో ఇతర వాటికి ఖర్చు చెయ్యవచ్చు గదా?'' అన్నాను. దానికి, ఆ ఉద్యమకారుడి జవాబు: "మీ కమ్యూనిస్టులు చెయ్యడం లేదా ఈ రకంగా? ఈ కవరంటారా, ఒకతను చందాగా ఇచ్చాడు'' అని.

దానికి నా జవాబు: "కమ్యూనిస్టులు ఎప్పుడో చెడిపోయారు. వాళ్ళు బూర్జువా పార్టీలకి తోకలుగా తయారయ్యారు. మరి మీరు 'బ్రాహ్మణీయ సంస్కృతి నశించాలి! మనువాదం నశించాలి!' అని భీకరంగా నినాదాలిస్తారే? ఈ విషయంలో, మీకూ మనువాదులకీ తేడా ఏమిటి?'' అంటే జవాబు లేదు. జవాబు చెప్పాలంటే వారికి కష్టం. ఎందుకంటే, వారు ఆరాధ్య దైవంగా భావించే అంబేడ్కర్ అధ్యక్షతన తయారైన రాజ్యాంగంలోనే, చాతుర్వర్ణాలను తలపించే నాలుగు రకాల 'బిరుదులు' ఇచ్చే ఏర్పాటు ఉంది. పౌరులందరూ సమానులే అని ఒక వైపు చెపుతూనే, కొందరు భారతరత్నలు, కొందరు పద్మ విభూషణులు, కొందరు పద్మభూషణులు, మరికొందరు పద్మశ్రీలు!


సాధారణ ఉద్యమకారులే కాదు, విప్లవవాదులు కూడా మనుషుల మధ్య ఉండే ఈ రకం అసమాన విభజనను (ఒక రకం వ్యక్తిపూజని) వ్యతిరేకించరు. ఎందుకంటే, ప్రపంచంలో ఎవ్వరూ చేయించుకోనన్ని వ్యక్తి పూజలు చేయించుకున్న 'మహా మహో పాధ్యాయులైన కామ్రేడ్స్ స్టాలిన్, మావో'ల్ని ఎవరైనా విమర్శిస్తే ఈ విప్లవవాదులు సహించలేరు.

సాహిత్య సభలలో, అతిథులందరూ వేదికను 'అలంకరించి', ఒకరు మాట్లాడుతుండగా, మిగతా వాళ్ళు ఇద్దరేసి చొప్పున చెవులు కొరుక్కుంటూ ఉంటారు. అసలు ఒకరు మాట్లా డుతూ ఉంటే, మిగతా వక్తలందరూ, ఆ టైములో శ్రోతలే. వాళ్ళూ ప్రేక్షకులున్న చోటే కూచుని శ్రద్ధగా వినాలి. తమ వంతు వచ్చినప్పుడు, వేదిక మీదకి వెళ్ళి మాట్లాడాలి. ఇది తర్క బద్ధమైన ప్రవర్తన. సమానత్వ భావన. దీనికి విరుద్ధంగా జరిగే సభలకి ఆత్మగౌరవం గల వారెవరైనా వెళ్ళగలరా?

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్

ఉనికి పాఠం

ఒక ఖడ్గ మృగం అడవిలో మేస్తోంది. ఒక ఈగ దాని కొమ్ముపై వాలింది. కొంచెంసేపటి తర్వాత 'నేను వెళ్లనా?' అని ఈగ అడిగింది. 'నువ్వెప్పుడు వచ్చావు? నేను గమనించలేదు. నువ్వు ఉంటే నాకేం, వెళితే నాకేం?' అన్నది ఖడ్గ మృగం. ఈ లోకంలో చాలామందీ అంతే! వస్తున్నారు. తమ శ్వాస విడిచి వెళ్లి పోతున్నారు. కోట్లాది జన సమూహాలు వస్తున్నాయి, వెళ్తున్నాయి. మన 'ఉనికి' ఎక్కడ?



జ్యోతిర్మయం

రాముడు ఉన్న కాలంలోనే రావణుడు ఉన్నాడు. రాముడు దేవుడు అయ్యాడు, రావణుడు రాక్షసుడిగా పిలవబడ్డాడు. మన ఉనికి ఎటువైపు? ఖడ్గ మృగం అనే ప్రపంచపు కొమ్ముపై నిలిచిన ఈగ ల్లాంటి వాళ్ళం. వచ్చినందువల్ల గొప్పా లేదు. పోతున్నారనే బాధా ఈ ప్రపంచానికి ఉండదు.

'అంతము లేని ఈ భువనమంత పురాతన పాంథశాల, విశ్రాంతి గృహంబు' అన్నారు కవి దువ్వూరి రామిరెడ్డి. మనం తాత్కాలికంగా నివసించే సత్రం, ప్రయాణికుల వసతి గృహం ఈ ప్రపంచం. మన పని వరకు వేచి ఉండి వెళ్ళిపోవడమే తప్ప శాశ్వతంగా ఇక్కడ ఉండం! మరి మన ఉనికిని ఎలా నిలబెట్టుకోవాలి? అదే మనం ఆలోచించాల్సిన విషయం.

సజ్జన సాంగత్యం, సత్కృతుల పఠనం, సత్కర్మలు ఆచరించడం ద్వారా కొంతమంది దగ్గరయినా, ఉన్నంత కాలంలో తన ఉనికి నిల బెట్టుకుంటాడు బుద్ధిమంతుడు. ఎరుక తెలిసి అరయువాడు ఉత్తముడు!

– శివలెంక ప్రసాదరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.10.14 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** చిత్త ఉ.6.34 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.12.30 నుండి 2.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.17 నుండి 1.03 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** రా.10.03 నుండి 11.40 వరకు; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం** 6.28; **సూర్యాస్తమయం** 5.25.

జోరుగా రబీ సాగు



- ఈ ఏడాది సాగు లక్ష్యం 58 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు 19.53 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 7.56 లక్షల ఎకరాల్లో శనగలు, 3.07 లక్షల ఎకరాల్లో మినుములు
- 3.07 లక్షల ఎకరాల్లో వరి, 1.65 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న
- రాష్ట్రంలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ సాగు జోరందుకుంటోంది. నిర్దేశించిన లక్ష్యంలో మూడోవంతు విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. మాండూస్ తుపాను ప్రభావం ఈ పంటలపై స్వల్పంగా చూపింది. రాయలసీమలోని మూడు జిల్లాల్లో కొంతమేర పంటలు దెబ్బతినగా, ఆ మేరకు ప్రభుత్వం ఇస్తున్న చేయూతతో రెండోసారి విత్తుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు.. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచారు.

అనంతపురంలో 70 శాతం సాగు

రబీ సాధారణ సాగు విస్తీర్ణం 56.29 లక్షల ఎకరాలు. 2020–21లో రికార్డు స్థాయిలో 62 లక్షల ఎకరాల్లో సాగవగా, 2021–22లో 56.27 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది 58లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతేడాది ఇదే సమయానికి 18 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది ఇప్పటివరకు 19.53 లక్షల ఎకరాల్లో సాగైంది. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 70 శాతం మేర రబీ పంటలు సాగవగా, వైఎస్సార్, కర్నూలు జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో 60 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. నంద్యాల, శ్రీసత్యసాయి, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో 50 శాతం మేర పంటలు సాగయ్యాయి. మిగిలిన జిల్లాల్లోనూ పనులు ఊపందుకున్నాయి.

ఈసారి వరి సాగు లక్ష్యం 20.77 లక్షల ఎకరాలు

రబీలో వరి సాధారణ విస్తీర్ణం 19.72 లక్షల ఎకరాలు. గత సీజన్‌లో 19.52 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది 20.77లక్షల ఎకరాల్లో సాగుచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు 3.07లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గతేడాది ఇదే సమయానికి 1.9 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇక బోర్ల కింద వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అపరాలు, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.

11.75 లక్షల ఎకరాల్లో అపరాల సాగు

ఇక ముతక ధాన్యాలు 8.02 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 2.52 లక్షల ఎకరాల్లో సాగైంది. వీటిలో 1.65 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 82 వేల ఎకరాల్లో జొన్నలు సాగయ్యాయి. అపరాల విషయానికొస్తే.. ఈ ఏడాది 23.65 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 11.75 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 10.85 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వీటిలో ప్రధానంగా 7.56 లక్షల ఎకరాల్లో శనగలు, 3.07 లక్షల ఎకరాల్లో మినుములు సాగయ్యాయి. అలాగే, నూనెగింజల సాగు లక్ష్యం 3.67లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.25 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వీటిలో ప్రధానంగా 1.05 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఇతర పంటల విషయానికొస్తే పొగాకు సాగు లక్ష్యం 1.75 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 87 వేల ఎకరాల్లో సాగైంది.

సమృద్ధిగా ఎరువుల నిల్వలు

రబీ సీజన్‌కు కేంద్రం 22.69 లక్షల టన్నుల ఎరువులు కేటాయించింది. ప్రారంభ నిల్వ 7.29 లక్షల టన్నులుండగా, గడిచిన 45 రోజుల్లో 7.82 లక్షల టన్నులను కేంద్రం సరఫరా చేసింది. డిసెంబర్ 15 నాటికి 7.94 లక్షల టన్నుల ఎరువుల విక్రయాలు జరిగాయి. డిసెంబర్ నెలకు 3.34 లక్షల టన్నులు అవసరం కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం 7.17లక్షల టన్నుల ఎరువుల నిల్వలున్నాయి. కేటాయింపు ప్రకారం డిసెంబర్ నెలకు మరో 3.95 లక్షల టన్నుల ఎరువులు రాష్ట్రానికి రావాల్సి ఉంది.

క్లుప్తంగా...

శ్రీవారికి 2.12 కిలోల బంగారు కంఠాభరణం

- కానుకగా సమర్పించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత ఆదివారం శ్రీదేవి సమేత బంగారు కంఠాభరణాన్ని కానుకగా సమర్పించారు. ఈ ఆభరణాన్ని 2 కిలోల 12 గ్రాముల 500 మిల్లీ గ్రాములతో తయారుచేశారు. వైవీ సుబ్బారెడ్డి దంపతులు తొలుత శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ డెప్యూటీ ఈవో రమేష్‌కు ఈ ఆభరణాన్ని అందించారు. విశ్వశాంతి కోసం తిరుమల ధర్మగిరి వేద విద్యాపీఠంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం విజయవంతంగా ముగిసిన సందర్భంగా స్వామివారికి కానుకను సమర్పించామని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

షిప్ యార్డులో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్



ఆర్ అండ్ డీ వర్క్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న షిప్ యార్డ్ డైరెక్టర్ కుంజుమాన్

సాక్షి, విశాఖపట్నం: నౌకా నిర్మాణ పరిశోధనల్లో సాంకేతికత బదలాయింపునకు తిరుపతి ఐఐటీతో హిందుస్తాన్ షిప్ యార్డ్(హెచ్‌ఎస్‌ఎల్) జతకట్టింది. ఇప్పటికే తిరుపతి ఐఐటీ సహకారంతో ఏర్పాటు చేసిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వర్క్ సెంటర్‌ను హెచ్‌ఎస్‌ఎల్ షిప్ బిల్డింగ్ డైరెక్టర్ కమాండర్ కుంజుమాన్ ప్రారంభించారు.

జాలర్ల వలకు భారీ తిమింగలం కళేబరం



యారాడ తీరంలో తిమింగలం కళేబరం

పెదగంట్యాడ: చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు భారీ తిమింగలం కళేబరం చిక్కింది. భారీగా చేపలు పడ్డాయని సంతోషంగా తీరానికి తీసుకొచ్చారు. తీరా వల తీసి చూసేసరికి తిమింగలం కళేబరం కనిపించింది. చేసేది లేక దానిని యారాడ తీరంలో వదిలేశారు. ఇది ఆదివారం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. భారీ తిమింగలం సుమారు 10 నుంచి 12 అడుగులు పొడవు, రెండు టన్నుల బరువు ఉండవచ్చునని బీచ్ లైఫ్‌గార్డులు కదిరి వెంకటేష్, లోవరాజు తెలిపారు.

సకల జీవరాశుల క్షేమం కోసమే మహాయాగం

- పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణం
- మహాపూర్ణాహుతితో ముగిసిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం



శ్రీనివాస విశ్వశాంతి మహాయాగంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: కరోనా మహమ్మారి పలు దేశాల్లో మళ్లీ వ్యాపిస్తున్నట్లు సంకేతాలు అందుతున్న నేపథ్యంలో ప్రపంచ మానవాళితోపాటు సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం నిర్వహించారని పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి ఉద్ఘాటించారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో వారం రోజులపాటు నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం ఆదివారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో 21మంది రుత్వికులు ఏడు హోమ గుండాలలో యాగం నిర్వహించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు పాల్గొని గోపూజ చేశారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ లోకకల్యాణం కోసం చేసే ఇలాంటి యాగాల వల్ల అద్భుతమైన ఫలితాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన కృష్ణశేషాచల దీక్షితులు, వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, ఐటీ జీఎం సందీప్, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు తొమ్మిది నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 64,107 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి భక్తులు కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. కాగా, ఆదివారం శ్రీవారిని కర్ణాటక సినీనటుడు శివరాజ్‌కుమార్ దర్శించుకున్నారు.

నీవు లేక నేను లేను..

- ఆత్మహత్య చేసుకున్న భర్త
- అప్పటికి కొద్ది నిమిషాల ముందు భార్య మృతి
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విషాదం



కుమారుడితో విజయకుమార్, తులసీలక్ష్మి (ఫైల్)

అమలాపురం టౌన్: భార్య మృతిని తట్టుకోలేని భర్త కొద్దిసేపటికే బలవన్మరణానికి పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలోని కొంకాపల్లిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ విషాద ఘటన కలకలం రేపింది. పట్టణ ఇన్‌చార్జి సీఐ వీరబాబు, స్థానికుల కథనం ప్రకారం.. కొంకాపల్లిలో భార్యాభర్తలు బోనం తులసీలక్ష్మి(45), శ్రీరామ విజయకుమార్(47) ఇంట్లోనే కొద్ది నిమిషాల తేడాలో మృతి చెందారు. ఓఎన్జీసీ సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న విజయకుమార్ ఇటీవల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. భార్య తులసీలక్ష్మికి మూడు నెలల కిందట మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగి, అనారోగ్యంతో అవస్థలు పడుతోంది. శనివారం రాత్రి ఇద్దరూ ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున తులసీలక్ష్మి బెడ్‌రూమ్‌లో మంచంపై విగతజీవిగా ఉంది. ఆమె మరణాన్ని భర్త విజయకుమార్ తట్టుకోలేకపోయాడు. అప్పటికే ఆర్థిక సమస్యలతో మానసిక ఒత్తిడికి గురవుతున్న అతనికి భార్య మృతి మరింత కుంగదీసింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై తన ఇంటి రెండో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరి కుమారుడు కృష్ణ విజయవాడలో ఇంటర్ చదువుతున్నాడు. తల్లిదండ్రుల మరణవార్త తెలియడంతో అతడు విజయవాడ నుంచి హుటాహుటిన వచ్చి.. అమ్మానాన్నల మృతదేహాలపై పడి ఏడ్వడం అందరినీ కలచివేసింది. తులసీలక్ష్మి తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

టీడీపీ వర్గీయుల మూకుమ్మడి దాడి

- ఐదుగురు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు
- గతంలో ఉన్న భూవివాదమే కారణం..



దాడిలో గాయపడిన మల్లా కోటయ్య, మంగమ్మ

యడ్లపాడు: మాచర్ల మారణహోమం ఘటన మరువకముందే.. టీడీపీ వర్గీయులు మరో దారుణానికి ఒడిగట్టారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులపై రాళ్లు, గొడ్డళ్లు, వేటకొడవళ్లతో ఒక్కసారిగా దాడి చేయడంతో ఐదుగురికి తీవ్రగాయాలై ఆస్పత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సొలస ఎస్టీ (చెంచుల)కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు మల్లా నారాయణ కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. అదే సమయంలో పది కుటుంబాలకు చెందిన టీడీపీ వర్గీయులు గతం నుంచీ అపరిష్కృతంగా ఉన్న ఓ భూ వివాదాన్ని ప్రస్తావిస్తూ వారిని దూషిస్తూ ఆయుధాలతో ఒక్కసారిగా దాడికి దిగారు. దాడిలో నారాయణ రెండోకుమారుడు కోటయ్య, అతని భార్య మంగమ్మకు తలలు పగిలాయి. పెద్ద కుమారుడు ఏడుకొండలు, భార్య కోటమ్మ, మేనల్లుడు ఆవుల గోపయ్యల శరీరంలోని వివిధ భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న యడ్లపాడు, నాదెండ్ల ఎస్‌ఐలు పైడి రాంబాబు, భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. కాగా గతంలో ఉన్న భూవివాదానికి సంబంధించి శనివారం వినుకొండ తహసీల్దార్ కోర్టుకు రెండు వర్గాల వారు హాజరయ్యారు. అక్కడ ఇరువర్గాల మహిళలు దూషించుకున్నారు. పోలీసులు గొడవలు వద్దంటూ సర్ది చెప్పి పంపించేశారు. దీన్ని మనసులో పెట్టుకుని వైఎస్సార్‌సీపీకి చెందిన నారాయణ కుటుంబంపై ఆదివారం టీడీపీ వర్గీయులు విచక్షణారహితంగా దాడికి దిగారు. ఈ ఘర్షణలో రెండు వర్గాల వారిపై కేసులు నమోదు చేసి, కాలనీలో పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ పైడి రాంబాబు తెలిపారు. అలాగే గతంలో ఉన్న భూవివాదం కారణంగా జరిగిన ఘర్షణలకు సంబంధించి రెండు వర్గాలపై పోలీసులు ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేశారు.

ఢిల్లీ యాత్రతో ఏం సాధించారు?

- 812వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: అమరావతి పాదయాత్రల పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ఢిల్లీ వెళ్లిన కులవాదులు సాధించిందేమిటో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 812వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలు వికేంద్రీకరణకు స్వాగతం పలుకుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తుంటే కులవాదులు మాత్రం చంద్రబాబు అవినీతిని కాపాడేందుకు పాకులాడుతుండడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానాభివృద్ధి చేసి పేదరికాన్ని పోగొట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. కులం, మతం ముసుగులో బాబు అండ్ కో మాత్రం బహుజనుల ఆర్థిక ఎదుగుదలపై దెబ్బకొట్టి తామే సర్వోన్నతంగా వ్యవహరించాలనే దుర్మార్గపు వైఖరితో తప్పుడు కేసులు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేడు రాబోయే విద్యాసంవత్సరం నుంచి సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి పేద వారికి అందని ద్రాక్షగా ఉన్న చదువును చేరువ చేసేందుకు కృషి చేయడం హర్షణీయమన్నారు. నాయకులు మాదిగాని గుర్నాథం, జోషి, పులిదాసు, ఈపూరి ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కన్నబిడ్డ హత్య

- బిడ్డ మృతదేహాన్ని కంకర రాళ్ల కింద కప్పేసిన తండ్రి



నిందితులను విచారణ చేస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: మద్యం మత్తులో కన్నబిడ్డను చంపేసుకున్నారు ఆ కసాయి తల్లిదండ్రులు. ఈ ఘటన స్థానిక మయూరీ కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆదివారం వివరాలు వెల్లడించారు. స్థానిక మయూరి కూడలి వద్ద భిక్షాటన చేస్తూ ఐదేళ్లుగా సహజీవనం సాగిస్తున్న గాయత్రీదాస్, అలోక్ దాస్‌కు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద పాపకు రెండేళ్లు, చిన్నపాపకు నెలన్నర రోజులు. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని భార్యాభర్తలు గొడవపడేవారు. ఎప్పటిలాగే శనివారం అర్ధరాత్రి తరువాత మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఆ తగాదాలోనే తల్లి చేతిలో ఉన్న చిన్న పాపను లాగడంతో గట్టిగా దెబ్బలు తగిలాయి. ఆదివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ప్రభుత్వాస్పత్రికి పాపను తీసుకువెళ్లగా.. అక్కడ వైద్యులు పాప మృతి చెందిందని చెప్పారు. దీంతో పాప మృతదేహాన్ని రైల్వేస్టేషన్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కంకరపిక్క, క్రషర్ బుగ్గిలో రెండు అడుగుల లోతు గొయ్యి తీసి కప్పేశాడు. అనంతరం మయూరీ కూడలి వద్ద బిడ్డను నువ్వే చంపేశావంటే నువ్వే చంపేశావని ట్రాఫిక్ కానిస్టేబుల్ వద్ద వాదులాడుకున్నారు. వెంటనే ఆయన వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. రంగంలోకి దిగిన వన్‌టౌన్ సీఐ వెంకటరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంజరంలో పండు‘గొప్ప’

- 4 పంజరాల్లో 1.85 టన్నుల దిగుబడి
- కిలో రూ.460 చొప్పున విక్రయం



కృష్ణాజిల్లా లక్ష్మీపురం వద్ద ఉప్పుటేరులో సీఎంఎఫ్‌ఆర్‌ఐ సహకారంతో ఏర్పాటు చేసిన కేజ్‌లో పట్టుబడిన పండుగొప్ప చేపలు

సాక్షి, అమరావతి: తీరం వెంబడి విస్తరిస్తున్న పంజరం చేపల సాగు (కేజ్ కల్చర్) సిరుల పంట పండిస్తోంది. కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన కేంద్రం (సీఎంఎఫ్‌ఆర్‌ఐ) సాంకేతిక చేయూత అందించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద సీడ్‌ను కూడా ఉచితంగా అందిస్తోంది. సీఎంఎఫ్‌ఆర్‌ఐ సహకారంతో కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం వద్ద ఉప్పుటేరులో కేజ్ కల్చర్ చేపట్టిన యానాదులకు సిరుల పంట పండింది.

1.85 టన్నుల పండుగప్ప దిగుబడి

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద గత ఏడాది డిసెంబర్‌లో 585 మీటర్లు పరిమాణం గల 4 పంజరాల్లో 80 నుంచి 100 గ్రాముల బరువు గల పండుగప్ప చేప పిల్లలను వదిలారు. ఏడాది కాలంలో ఇవి కేజీన్నర నుంచి 2 కేజీల వరకు బరువు పెరిగాయి. 4 పంజరాల్లో బుధవారం పట్టుబడి పట్టగా 1.85 టన్నుల దిగుబడి వచ్చింది. కిలో రూ.460 చొప్పున విక్రయించారు. మరో 700 గ్రాముల సైజులో మరో 400 కేజీల వరకు పట్టుబడి చేయాల్సి ఉంది. వేటకు వెళ్లే ఈ కుటుంబాలు చిన్నపాటి చేపలను తీసుకొచ్చి పంజరాల్లోని పండుగప్పలకు మేతగా ఉపయోగించేవారు. పైసా పెట్టుబడి లేకుండా ఒక్కో పంజరం నుంచి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆర్జించారు.

భూమిలేని పేదలకు వరం

భూమిలేని పేదలకు ఇది ఎంతో లాభదాయకమని సీఎంఎఫ్‌ఆర్‌ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్ అన్నారు. సీఎంఎఫ్‌ఆర్‌ఐ ఇచ్చిన చేయూత వల్ల తమ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాయని ఎస్టీ మత్స్యకారుడు నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు.

రేపు ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ

- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య వెల్లడి

తిరుపతి అర్బన్: ఏపీపీటీడీ(ఆర్టీసీ) వైఎస్సార్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభను ఈ నెల 20వ తేదీన తిరుపతిలోని తనపల్లి రోడ్డులో ఉన్న పీఎల్‌ఆర్ గార్డెన్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ మహాసభలో కృతజ్ఞతలు తెలియజేస్తామని, పలు తీర్మానాలు చేస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్మికులు ఎప్పటికీ సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటారని తెలిపారు. రాష్ట్ర మహాసభలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు కె.అర్జున్, సీవీ మురళీధర్, నరసింహులు, ఎల్‌వీ రమణారావు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తేనే నిధులు

- అధ్యాపకులుగా 50 శాతం మంది వృత్తి, పరిశ్రమ నిపుణులు ఉండాలి
- సమర్థవంతమైన బోధన కోసం మౌలిక సదుపాయాలు పెంచాలి
- క్యాంపస్‌ల ఆడిట్ ఉండాల్సిందే
- అన్ని విద్యా సంస్థలకు యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: సంస్థాగత అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి.. తదనుగుణంగా కార్యక్రమాలు అమలు చేసే సంస్థలకు మాత్రమే ఇకపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిధులు అందించనుంది. నూతన విద్యా విధానం–2020 ప్రకారం.. యూజీసీ ఈ మేరకు అన్ని ఉన్నత విద్యా సంస్థలకు నూతన ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఐడీపీ) ప్రణాళికలు రూపొందించడంలో అనుసరించాల్సిన అంశాలను ముసాయిదాలో వివరించింది. అధ్యాపకులుగా నిపుణుల నియామకం, వారి కోసం ఫాస్ట్ ట్రాకింగ్ ప్రమోషన్ సిస్టమ్, క్యాంపస్‌ల ఆడిట్‌లు, సమర్థవంతమైన బోధన, అభ్యాసం కోసం భౌతిక, మౌలిక సదుపాయాలను పెంచడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. యూజీసీ ఆధ్వర్యంలోని ఇంటర్ యూనివర్సిటీ యాక్సిలరేటర్ సెంటర్ డైరెక్టర్ అవినాష్ చంద్ర పాండే అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ ఈ మార్గదర్శకాలను రూపొందించింది. యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ (ఏఐసీటీఈ), హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్‌లు కూడా ఐడీపీలను అనుసరించే నిధులు విడుదల చేయనున్నాయి. ఆయా ఉన్నత విద్యా సంస్థలు తయారుచేసిన ఐడీపీలు, వాటి అమలులో సాధించిన పురోగతి, పారదర్శక ప్రమాణాల ఆధారంగా ఉన్నత విద్యకు నిధులు వస్తాయని యూజీసీ పేర్కొంది. ప్రస్తుతానికి.. యూజీసీ ఉన్నత విద్యా సంస్థలకు నిధులు సమకూరుస్తుండగా ఇకపై హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్ నిధులను అందించనుంది.

అధ్యాపకుల్లో 50 శాతం పరిశ్రమల నిపుణులు..

ప్రొఫెషనల్ కాలేజీల్లో వివిధ విభాగాల్లో థియరీ, ప్రాక్టికల్ మధ్య సమతుల్యతను కొనసాగించడానికి మొత్తం అధ్యాపకుల్లో 50 శాతం మంది వృత్తి నిపుణులు లేదా పారిశ్రామిక నిపుణులుండాలని యూజీసీ పేర్కొంది. సంస్థాగతంగా పరిశోధన, బోధన కార్యక్రమాలు అత్యున్నతంగా కొనసాగేందుకు బోధన సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలు ఎప్పటికప్పుడు అందించాలని సూచించింది. ఫ్యాకల్టీ కోసం ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. సిబ్బంది పదవీకాలం, పదోన్నతి ఇంక్రిమెంట్ల కోసం అధ్యాపకుల పనితీరును సరిగ్గా అంచనా వేయడానికి ఉన్నత విద్యా సంస్థలు ‘పీర్ స్టూడెంట్ రివ్యూలు’తో సహా బహుళ ప్రమాణాల వ్యవస్థని రూపొందించాలని సూచించింది. అంతేకాకుండా ప్రతి ఉన్నత విద్యా సంస్థ యూజీసీ నిర్దేశించిన ఫ్యాకల్టీ, విద్యార్థి నిష్పత్తిని తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. ప్రతి సంస్థ.. విద్య, మౌలిక వసతులను మెరుగుపరచడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని వెల్లడించింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు విద్యార్థుల అభీష్టానికనుగుణంగా ఆన్‌లైన్ లెర్నింగ్, బ్లెండెడ్ లెర్నింగ్ కోసం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. అలాగే సామర్థ్యం గల విద్యార్థులను గుర్తించి క్రీడలు, కళల్లో ప్రోత్సహించాలని సూచించింది.

భద్రతకు గట్టి భరోసా

- మరింత పటిష్టంగా డయల్ 100 వ్యవస్థ
- కాల్ సెంటర్ పరిధిలోకి మరిన్ని అత్యవసర సేవలు
- కాలర్ లోకేషన్‌ను గుర్తించి వేగంగా చర్యలు

సాక్షి, అమరావతి: ఆపదలో ఆపన్న హస్తం అందించే ‘డయల్ 100’ వ్యవస్థను పోలీసు శాఖ మరింత బలోపేతం చేసి ప్రజల భద్రతకు గట్టి భరోసానిస్తోంది. అత్యవసర సేవలు అందించే ఈ వ్యవస్థను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి మెరుగ్గా తీర్చిదిద్దింది. అందుకోసం డయల్ 100, డయల్ 112 వ్యవస్థను సమ్మిళితం చేస్తోంది. రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి మరిన్ని అత్యవసర సేవలను డయల్ 100 పరిధిలోకి తెచ్చేలా కసరత్తు చేస్తోంది.

20 జిల్లాల్లో ఇప్పటికే ఏకీకృత వ్యవస్థ

అత్యవసర సర్వీసుల కోసం కేంద్ర ప్రభుత్వం డయల్ 112 వ్యవస్థను తెచ్చింది. చాలా రాష్ట్రాలు చాలా ఏళ్లుగా సొంతంగా నిర్వహిస్తున్న అత్యవసర సేవల వ్యవస్థలను దాదాపుగా తొలగించాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అత్యవసర సేవలు మరింత సమర్థంగా అందించేందుకు ఈ రెండు వ్యవస్థలను అందుబాటులో ఉంచింది. అయితే డయల్ 100, డయల్ 112 కోసం రెండు వేర్వేరు కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు కాకుండా ఏకీకృత వ్యవస్థను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఈ రెండు వ్యవస్థలను సమ్మిళితం చేశారు. వైఎస్సార్, అన్నమయ్య, పల్నాడు, బాపట్ల, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వీటిని ఇంకా అనుసంధానించాల్సి ఉంది.

సత్ఫలితాలనిస్తున్న సమ్మిళితం

డయల్ 100, డయల్ 112ను అనుసంధానించడం సత్ఫలితాలనిస్తోంది. డయల్ 112 కాల్ సెంటర్‌కు 2020లో 7.55 లక్షల కాల్స్ రాగా వాటిలో చర్యలు తీసుకోదగ్గవి 6,162 ఉన్నాయి. వీటిపై పోలీసులు దర్యాప్తు జరిపి 196 కేసుల్లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఇక 2021లో 9.67 లక్షల కాల్స్ రాగా చర్యలు తీసుకోదగ్గవి 10,292 ఉన్నాయి. వాటి ఆధారంగా 242 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. డయల్ 100కి సగటున రోజుకు ఐదు వేల కాల్స్ వచ్చాయి. 2022లో డయల్ 100, డయల్ 112 సమ్మిళిత ప్రక్రియ ప్రారంభమయ్యాక అత్యవసర సేవలు గణనీయంగా మెరుగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఏకంగా 17.82 లక్షల కాల్స్ రాగా వాటిలో చర్యలు తీసుకోదగ్గ కాల్స్ 85,143 ఉన్నాయి. వీటిని బట్టి ఇప్పటివరకు 2,518 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం విశేషం. ప్రజల అత్యవసర కాల్స్‌పై పోలీసు శాఖ సత్వరం స్పందిస్తూ వేగంగా చర్యలు తీసుకుంటోందనడానికి ఈ గణాంకాలే తార్కాణం.

లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థ..

డయల్ 100లో కొత్తగా లొకేషన్ ట్రాకింగ్ ఫీచర్‌ను పోలీసు శాఖ ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు ఎవరైనా అత్యవసర సర్వీసుకు కాల్ చేస్తే తాము ఎక్కడ ఉన్నారో చెప్పాల్సి వస్తోంది. గుర్తు తెలియని ప్రదేశాల్లో ఆపదలో చిక్కుకున్న వారికి ఇది సమస్యాత్మకంగా మారింది. పూర్తి వివరాలు వెల్లడించేందుకు తగినంత సమయం లేని సందర్భాల్లో పోలీసులు అక్కడకు చేరుకోవడం సవాల్‌గా పరిణమించింది. దీనికి పరిష్కారంగా కాలర్ లొకేషన్ ఆటోమేటిక్‌గా డయల్ 100 కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తెలిసేలా సమాచార వ్యవస్థను ఆధునీకరించారు. దీంతో డయల్ 100కు కాల్ వచ్చిన కచ్చితమైన ప్రదేశానికి పోలీసులు సత్వరం చేరుకుని తగిన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది.

డయల్ 100 పరిధిలోకి మరిన్ని సేవలు

డయల్ 100 వ్యవస్థను దశలవారీగా విస్తరించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. కేవలం పోలీసు సేవలే కాకుండా మరిన్ని సేవలను ఈ పరిధిలోకి తెస్తున్నారు. డయల్ 100కు కాల్ చేసి అగ్నిమాపక సేవలు, అంబులెన్స్ లాంటి వైద్య సేవలు, రాష్ట్ర విపత్తు స్పందన బలగాలు (ఎస్‌డీఆర్‌ఎఫ్) మొదలైన సేవలను కూడా పొందే సౌలభ్యాన్ని త్వరలో కల్పించనున్నారు. దశలవారీగా దాదాపు 20 సేవలను డయల్ 100 పరిధిలోకి తేనుంది.

మిసెస్ వరల్డ్ సర్గమ్ కౌశల్

21 ఏళ్ల తర్వాత భారత్‌కు కిరీటం



న్యూఢిల్లీ: ముంబైకి చెందిన సర్గమ్ కౌశల్ మిసెస్ వరల్డ్ 2022 కిరీటం దక్కించుకున్నారు. శనివారం అమెరికాలోని వెస్ట్‌గేట్ లాస్‌వెగాస్ రిసార్ట్ అండ్ క్యాసినోలో జరిగిన పోటీల్లో 63 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం తలపడ్డారు. సర్గమ్ విజేతగా నిలవగా మొదటి రన్నరప్‌గా మిసెస్ పోలినేసియా, రెండో రన్నరప్‌గా మిసెస్ కెనడా నిలిచారు. 2001లో నటి, మోడల్ అదితి గోవిత్రికర్ మిసెస్ వరల్డ్ గెలుచుకోగా, 21 ఏళ్ల తర్వాత తిరిగి భారత్‌కు ఆ గౌరవం దక్కింది. సర్గమ్ కౌశల్ జమ్మూకశ్మీర్‌కు చెందిన వారు. మిసెస్ వరల్డ్ పోటీలను 1984 నుంచి నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా...

టన్నెల్‌లో ఇంధన ట్యాంకర్ పేలి... 19 మంది సజీవ దహనం

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో టన్నెల్ మార్గంలో ఇంధన ట్యాంకర్ పేలి చెలరేగిన మంటల్లో 19మంది సజీవ దహన మయ్యారు. 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. దేశ ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే కీలకమైన సలాంగ్ సొరంగమార్గంలో శనివారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. 1960లలో సోవియట్ బలగాలు ఈ సొరంగాన్ని నిర్మించాయి. పేలుడు ధాటికి సొరంగం కొంతభాగం కూలి శిథిలాల కింద కొందరు చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య పెరిగేలా ఉంది.

ప్రభుత్వంపై విమర్శలు.. ఇరాన్‌లో ప్రముఖ నటి అరెస్ట్

కైరో: ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలపై



అసత్యాలను ప్రచారం చేశారనే ఆరోపణలపై ప్రముఖ నటి తరానెహ్ అలీదూస్తి (38) శనివారం అరెస్టయ్యారు. నిరసనలకు మద్దతు ప్రకటించిన పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే అరెస్టవడం తెలిసిందే. ఆందోళనల్లో పాలుపంచుకున్నారంటూ గత రెండు నెలల్లో ఇద్దరిని ఉరి తీశారు. ఈ చర్యలను తరానెహ్ సోషల్ మీడియాలో తీవ్రంగా ఖండించారు. గతంలోనూ ఆమె ప్రభుత్వ వైఖరిని నిరసించారు. ఆస్కార్ గెలుచుకున్న 'ది సేల్స్‌మ్యాన్'తో పాటు ది బ్యూటిఫుల్ సిటీ, ఎబవుట్ ఎల్లీ వంటి హాలీవుడ్ సినిమాల్లో తరానెహ్ నటించారు.

బిహార్‌లో ప్రారంభానికి ముందే కూలిన వంతెన



బెగుసరాయ్: బిహార్‌లో రూ.13 కోట్లు వెచ్చించి నిర్మించిన వంతెన ప్రారంభం కూడా కాకుండానే కూలిపోయింది. బెగుసరాయ్ జిల్లాలో బుధిగండక్ నదిపై 2017లో 206 మీటర్ల పొడవైన ఓ బ్రిడ్జిని నిర్మించారు. అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. అప్పుడప్పుడు ట్రాక్టర్లు, భారీ వాహనాలు వంతెన మీదుగా వెళ్తున్నాయి. వంతెన 2, 3 పిల్లర్ల మధ్య భాగంలో పగుళ్ల బారి ఆదివారం కూలి పోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

శాస్త్రీయ ప్రచురణల్లో మూడో స్థానంలో భారత్

న్యూఢిల్లీ: శాస్త్రీయ ప్రచురణల్లో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానానికి ఎగబాకిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ఆదివారం జరిగిన మంత్రిత్వ శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010లో ప్రపంచంలో ఏడో స్థానం ఉన్న భారత్..2020 నాటికి మూడో స్థానానికి చేరుకున్నట్లు అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్ తెలిపిందన్నారు. 2010లో భారత్‌లో 60,555 సిద్ధాంత పత్రాలు ప్రచురితం కాగా 2020లో వీటి సంఖ్య సుమారు 1.50 లక్షలకు పెరిగిందన్నారు. సైన్స్, ఇంజినీరింగ్ పీహెచ్‌డీల సంఖ్యలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని మంత్రి చెప్పారు. ఇండియా పేటెంట్ ఆఫీస్(ఐపీవో) 2018–19 సంవత్సరంలో భారతీయ శాస్త్రవేత్తలకు 2,500 పేటెంట్లు మంజూరు చేయగా 2020–21 నాటికి ఇవి 5,629కు పెరిగినట్లు వెల్లడించారు.

అపూర్వ విజయమది


గ్రహ శకల ప్రయోగం 'డార్ట్'పై నాసా • అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి

భూమిపైకి దూసుకొచ్చే ప్రమాదమున్న గ్రహశకలాలను అంతరిక్షంలోనే ఢీకొట్టి దారి మళ్లించడం ద్వారా మనకు ముప్పు తప్పించే లక్ష్యంతో సెప్టెంబర్‌లో నాసా చేపట్టిన చరిత్రాత్మక డార్ట్ (డబుల్ ఆస్టిరాయిడ్ రీడైరెక్షన్) ప్రయోగం దిగ్విజయం కావడం తెలిసిందే. ఇందులో భాగంగా భూమికి ఏకంగా 108 కోట్ల కిలోమీటర్ల దూరంలో డిడిమోస్ అనే పెద్ద గ్రహశకలం చుట్టూ పరిభ్రమిస్తున్న డైమోర్ఫస్ అనే బుల్లి శకలాన్ని 570 కిలోల బరువున్న డార్ట్ ఉపగ్రహం గంటకు ఏకంగా 22,500 కిలోమీటర్ల వేగంతో ఢీకొంది. ఆ ప్రయోగ ఫలితాలపై పలు కోణాల్లో అధ్యయనం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో కీలక విషయాలు తాజాగా వెలుగు చూశాయి. ప్రయోగం ద్వారా డైమోర్ఫస్ కక్ష్యను మార్చడం సైంటిస్టుల ప్రధాన లక్ష్యం. అది వారు ఆశించిన దానికంటే చాలా ఎక్కువగా నెరవేరిందని తాజాగా తేలింది. డిడిమోస్ చుట్టూ దాని పరిభ్రమణ కాలం ఏకంగా 32 నిమిషాల మేరకు తగ్గిందని వెల్లడైంది. ''అందుకే డార్ట్ ప్రయోగం మామూలు విజయం కాదు. ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువ ఫలితమిచ్చింది'' అని నాసా సైంటిస్టులు సంబరంగా చెబుతున్నారు. అంతేకాదు, డార్ట్ ఢీకొన్నప్పుడు దాని ఊహాతీత వేగపు ధాటికి డైమోర్ఫస్ నుంచి కనీసం 10 లక్షల కిలోల బరువైన ఉపరితల పదార్థాలు ముక్కచెక్కలుగా అంతరిక్షంలో దూసుకెళ్లాయట. అంతరిక్షంలో ఇలా ఒక వస్తువు ఢీకొనే వేగం వల్ల రెండో వస్తువుపై పడే ఒత్తిడిని ద్రవ్యవేగపు మార్పిడిగా పేర్కొంటారు. ''డార్ట్ ప్రయోగం వల్ల జరిగిన ద్రవ్యవేగపు మార్పిడిని 'బెటా'గా పిలుస్తాం. అర టన్ను బరువున్న ఏ వస్తువైనా గ్రహశకలం ఆకర్షణ శక్తికి లోబడి దానికేసి దూసుకెళ్తే జరిగే దానికంటే డార్ట్ ప్రయోగం వల్ల 3.6 రెట్లు ఎక్కువగా ద్రవ్యవేగపు మార్పిడి జరిగింది. డార్ట్ ప్రయాణించిన గంటకు 22,500 కిలోమీటర్ల వేగమే ఇందుకు కారణం'' అని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్‌కు చెందిన డార్ట్ మిషన్ సైంటిస్టు డాక్టర్ ఆండీ చెంగ్ వివరించారు. ''ఈ ద్రవ్యవేగపు మార్పిడి ఎంత ఎక్కువగా ఉంటే గ్రహశకలాన్ని



అంతగా దారి మళ్లించడం వీలవుతుంది. భూమిని నిజంగానే గ్రహశకలాల బారినుంచి కాపాడాల్సిన పరిస్థితి తలెత్తినప్పుడు ఇది చాలా కీలకంగా మారగలదు. డార్ట్ ప్రయోగం ద్వారా మనకు అందుబాటులోకి వచ్చిన అతి కీలక సమాచారమిది'' అని ఆయన చెప్పారు. ''అందుకే డార్ట్ ప్రయోగాన్ని ఊహకు కూడా అందనంతటి గొప్ప విజయంగా చెప్పాలి. దీనివల్ల గ్రహ శకలాల ముప్పును తప్పించేంత సామర్థ్యం మనకు ఇప్పటికిప్పుడే సమకూరిందని చెప్పడం నా ఉద్దేశం కాదు. కానీ ఆ దిశగా మనం వేసిన అతి పెద్ద ముందడుగుగా మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు'' అని నాసా డార్ట్ ప్రోగ్రాంలో కీలకంగా పని చేసిన సైంటిస్టు డాక్టర్ టామ్ స్టాట్లర్ చెప్పారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా దీనిపై స్పందించారు. 2022లో నాసా సాధించిన మూడు ఘన విజయాల్లో డార్ట్ ప్రయోగం ఒకటంటూ ప్రశంసించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



భూమిని గ్రహశకలాలు ఢీకొట్టే ప్రమాదం ఏ మేరకుంది...

గ్రహశకలం పరిమాణం	ఎప్పుడు ఢీకొట్టొచ్చు	నష్టం
25 మీటర్లు	100 ఏళ్లకోసారి	ఆకాశంలో పేలుళ్లు, చిన్నపాటి నష్టాలు
140 మీటర్లు	20,000 ఏళ్లకోసారి	భూమిపై 1–2 కి.మీ. లోతైన భారీ గొయ్యి, భారీ ప్రాణ, ఆస్తి నష్టం
కిలోమీటర్	5 లక్షల ఏళ్లకోసారి	ఏకంగా 10 కి.మీ. లోతైన గొయ్యి, ప్రపంచవ్యాప్త వినాశనం
10 కిలోమీటర్లు	10 నుంచి 20 కోట్ల ఏళ్లకోసారి	100 కి.మీ. లోతైన గొయ్యి, భూమి, సమస్త ప్రాణికోటి వినాశనం



ఈశాన్య కౌన్సిల్ స్వర్ణోత్సవాల్లో మోదీ

ఈశాన్యం అభివృద్ధికి ఆకాశమే హద్దు

ప్రతిబంధకాలన్నింటికీ రెడ్‌కార్డ్
- 'విభజన' ఆటలు సాగనివ్వడం లేదు
- ఈశాన్య కౌన్సిల్ స్వర్ణోత్సవాల్లో మోదీ
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

షిల్లాంగ్/అగర్తల: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో ఎదురవుతున్న అడ్డంకులన్నింటినీ ఎనిమిదేళ్లలో తొలగించామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన ఆదివారం మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని నార్త్‌ఈస్ట్ కౌన్సిల్ (ఎన్‌ఈసీ) గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ''ఎనిమిదేళ్లలో ఈశాన్యం నుంచి విమాన సేవలు మెరుగవడంతో ఇతర ప్రాంతాలతో అనుసంధానం పెరిగింది. విమానాశ్రయాలు 9 నుంచి 16కు, విమానాల సంఖ్య 900 నుంచి 1,900కు పెరిగాయి. రైల్వే మ్యాప్‌లో ఈశాన్య రాష్ట్రాలు కూడా చేరాయన్నారు. జాతీయ రహదారులు 50 శాతం పెరిగిందన్నారు. జలమార్గాలను విస్తరించే పనులు జరుగుతున్నాయి'' అన్నారు.

ఈశాన్యమే కేంద్రస్థానం

ఆగ్నేయాసియాకు ఈశాన్య రాష్ట్రాలే మన ముఖద్వారమని మోదీ పేర్కొన్నారు. మొత్తం ఆగ్నేయాసియా అభివృద్ధికి ఈశాన్యం కేంద్రస్థానంగా మారగలదని చెప్పారు. ఆ దిశగా ఇండియన్–మయన్మార్, థాయ్‌లాండ్ ప్రధాన రహదారి, అగర్తలా–అఖురా రైల్వే ప్రాజెక్టు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈశాన్యంలో ఎన్నో శాంతి ఒప్పందాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఫలితంగా తీవ్రవాద సంఘటనలు తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం 1971లో పార్లమెంట్ చట్టం ద్వారా నార్త్‌ఈస్ట్ కౌన్సిల్ ఏర్పాటయ్యింది. 1972 నవంబర్ 7 నుంచి అమల్లోకి వచ్చింది.

త్రిపుర బహుముఖ అభివృద్ధే లక్ష్యం

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవిశ్రాంతంగా కష్టపడి పని చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన ఆదివారం త్రిపుర రాజధాని అగర్తలలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించిన 2 లక్షలకుపైగా నూతన గృహాలను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. అనంతరం స్వామి వివేకానంద మైదానంలో బహిరంగ సభలో ప్రసంగించారు. త్రిపుర బహుముఖ అభివృద్ధే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రోజు 2 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు ఇచ్చామని, మెజారిటీ లబ్ధిదారులు మహిళలేనని చెప్పారు. గత ఐదేళ్లుగా పరిశుభ్రత అనేది ఒక ప్రజాఉద్యమంగా మారిందని, త్రిపుర అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా అవతరించిందని ప్రశంసించారు. త్రిపురలో అనుసంధానం, మౌలిక ప్రాజెక్టుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మోదీ పేర్కొన్నారు. ''త్రిపుర గతంలో ఘర్షణలకు మారుపేరుగా ఉండేది. 2018లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి, అనుసంధానానికి, శుభ్రతకు పర్యాయపదంగా మారింది'' అన్నారు. ఈశాన్య భారత్‌ను, బంగ్లాదేశ్‌ను అనుసంధానించే 15 కిలోమీటర్ల అగర్తలా–అఖౌరా రైల్వేప్రాజెక్టు వచ్చే ఏడాది పూర్తవుతుందన్నారు.

ఆ రాష్ట్రాలు.. అష్టలక్ష్ములు

ఈశాన్య ప్రాంతాల ప్రగతికి ప్రతిబంధకంగా మారిన అవినీతి, వివక్ష, హింస, ఓటు బ్యాంకు రాజకీయాలకు రెడ్‌కార్డ్ చూపించామని మోదీ అన్నారు. ''నార్త్‌ఈస్ట్‌ను విభజించేందుకు గతంలో ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. మేమొచ్చాక అలాంటి ఆటలు సాగనివ్వడం లేదు'' అన్నారు. ఆదివారం ఉదయం షిల్లాంగ్‌లో ఆయన కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. గత 50 ఏళ్లలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిలో ఎన్‌ఈసీ పోషించిన పాత్రను వివరిస్తూ రచించిన 'గోల్డెన్ ఫూట్‌ప్రింట్స్' అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈశాన్యం అభివృద్ధి విషయంలో ఎన్‌ఈసీ అందించిన సేవలను మరువలేమని ప్రధాని మోదీ ప్రశంసించారు. నార్త్‌ఈస్ట్‌లోని ఎనిమిది రాష్ట్రాలను అష్టలక్ష్ములుగా అభివర్ణించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎనిమిది పునాది స్తంభాలపై ప్రభుత్వం పనిచేయాలని ఉద్బోధించారు. అవి.. శాంతి, అధికారం, పర్యాటకం, 5జీ అనుసంధానం, సంస్కృతి, ప్రకృతి వ్యవసాయం, క్రీడలు పనిచేయగల శక్తి అని వివరించారు.

పోప్‌గా ఎన్నికవగానే... రాజీనామా లేఖ రాసిచ్చా


ఆరోగ్యం సహకరించకపోతే పనికొస్తుందని చెప్పా: పోప్ ఫ్రాన్సిస్



రోమ్: అనారోగ్య కారణాలతో విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఎదురైతే ఏం చేయాలన్న ఆలోచన తనకు ఎప్పుడో వచ్చిందని పోప్ ఫ్రాన్సిస్ తెలిపారు. ''అందుకే పోప్‌గా ఎన్నికైన వెంటనే త్యాగపత్రం (రాజీనామా లేఖ) రాశా. దాన్ని కార్డినల్ టార్సిసియో బెర్టోనే చేతికిచ్చా. నేను విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఎదురైతే పనికొస్తుందని చెప్పా'' అని చెప్పారు. ఆయన తాజాగా ఓ వార్తా పత్రికతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు తదితరాల వల్ల పోప్ విధులు నిర్వర్తించలేకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించగా ఈ మేరకు వెల్లడించారు. అలాంటప్పుడు ఏం చేయాలో స్పష్టంగా చెప్పే నిబంధన ఉందని బదులిచ్చారు. రహస్యం బయట పెట్టాను గనుక ఎవరైనా బెర్టోనే దగ్గరికెళ్లి పోప్ రాజీనామా లేఖ చూపించమని అడగవచ్చంటూ చమత్కరించారు. శనివారం 86వ ఏట అడుగు పెట్టిన పోప్ ఫ్రాన్సిస్ కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండటం తెలిసిందే. ఆయనకు 2021లో పేగు శస్త్రచికిత్స జరిగింది. మోకాలి నొప్పి తీవ్రంగా బాధించడంతో కొద్ది నెలలు వీల్‌చైర్‌కు పరిమితమయ్యారు. ఇప్పుడు చేతికర్ర సాయంతో నడుస్తున్నారు. మోకాలి నొప్పి బాధ్యతల నిర్వహణకు అడ్డంకిగా మారిందన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. మనం తలతో పని చేస్తాం తప్ప మోకాలితో కాదంటూ ఛలోక్తి విసిరారు.

వృద్ధాప్య కారణాలతో గతంలో పోప్ బెనెడిక్ట్ రాజీనామా

ఫ్రాన్సిస్‌కు ముందు పోప్‌గా ఉన్న బెనెడిక్ట్–16 రాజీనామా చేయడం తెలిసిందే. వృద్ధాప్యం వల్ల బాధ్యతలను సరిగా నిర్వర్తించలేకపోతున్నానంటూ ఆయన 2013లో రాజీనామా చేసి తప్పుకున్నారు. గత 600 ఏళ్లలో ఇలా బాధ్యతల నుంచి తప్పుకున్న తొలి పోప్‌గా రికార్డు సృష్టించారు. అనంతరం ఫ్రాన్సిస్ పోప్‌గా ఎన్నికయ్యారు.



మోరల్ పోలీసింగ్ వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: పోలీసు అధికారులు మోరల్ పోలీసింగ్ చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాధితుల నుంచి వస్తు తదితర రూపేణా ప్రతిఫలాలు ఆశించడం, డిమాండ్ చేయడం తగదంటూ హితవు పలికింది. ఓ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జె.కె.మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. సంతోష్ కుమార్ అనే సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగిస్తూ క్షమశిక్షణ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. అతన్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. సంతోష్ 2001 అక్టోబర్ 26న అర్ధరాత్రి వడోదరలో నైట్ డ్యూటీ సందర్భంగా నిశ్చితార్థమైన ఓ జంట రోడ్డుపై వెళ్తుండగా ఆపి అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలొచ్చాయి. తనకు కాబోయే భార్యతో కాసేపు గడుపుతానంటూ వెకిలిగా ప్రవర్తించాడని బాధితుడు మర్నాడు ఫిర్యాదు చేశాడు. అది నిజమని విచారణలో తేలడంతో అతన్ని డిస్మిస్ చేశారు. అతడు హైకోర్టులో సవాలు చేయగా, విధుల్లోకి తీసుకోవడంతో పాటు డిస్మిస్ కాలానికి 50 శాతం వేతనమివ్వాలని 2014లో కోర్టు తీర్పు వెలువరించింది. దీన్ని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ''దోషి తీవ్ర నేరానికి పాల్పడ్డాడు. ఇంతా చేస్తే అతను లా అండ్ ఆర్డర్ పోలీస్ కాదు. వాళ్లయినా సరే, ఇలా మోరల్ పోలీసింగ్‌కు దిగకూడదు. భౌతిక తదితర ప్రతిఫలాలు డిమాండ్ చేయకూడదు'' అని స్పష్టం చేసింది.

భార్యను 50 ముక్కలుగా నరికాడు



మృతురాలు, ఆమె శరీర భాగాలు, హంతకుడు

సాహెబ్‌గంజ్: సహజీవనం చేస్తున్న యువతిని 35 ముక్కలుగా నరికిన ఢిల్లీ ఘటన వంటిదే జార్ఖండ్‌లో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఓ దుర్మార్గుడు రెండో భార్యను చంపి 50కి పైగా ముక్కలుగా నరికాడు! ఈ ఘోరంలో కుటుంబసభ్యులూ అతనికి సహకరించారు! సాహెబ్‌గంజ్ జిల్లా బొండాపహర్‌కు చెందిన రుబికా పహాడిన్ (22) అనే యువతి దిల్దార్ అన్సారీ(28)కి రెండో భార్య. శుక్రవారం రాత్రి వారు గొడవ పడ్డారు. కోపంలో ఆమెను చంపిన అన్సారీ, మృతదేహాన్ని 50కి పైగా ముక్కలుగా నరికి వేర్వేరు చోట్ల పడేశాడు. భార్య కనిపించడం లేదంటూ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చాడు. శనివారం గ్రామంలో ఓ పాడుబడ్డ ఇంట్లో మనిషి శరీర భాగాలను కుక్కలు లాక్కెళుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో అన్సారీ నేరం అంగీకరించాడు. ఇప్పటిదాకా 18 వరకు శరీర భాగాలను స్వాధీనం చేసుకున్నారు.

విధుల్లోకి ఐఎన్ఎస్ మర్ముగావ్



ఐఎన్ఎస్ మర్ముగావ్‌ను జాతికి అంకితం చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ (ఇన్‌సెట్లో)


ముంబై: దేశీయ స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక 'ఐఎన్ఎస్ మర్ముగావ్' ఆదివారం భారత నౌకాదళంలోకి లాంఛనంగా అడుగుపెట్టింది. ఈ కార్యక్రమానికి ముంబై తీరం వేదికగా మారింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. యుద్ధ నౌకల నిర్మాణం, అభివృద్ధిలో భారత దేశ నైపుణ్యానికి ఐఎన్ఎస్ మర్ముగావ్ ఒక తార్కాణమని పేర్కొన్నారు. భారత్‌ను నౌకా నిర్మాణాల హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశీయంగా నిర్మించిన అత్యంత శక్తివంతమైన యుద్ధనౌకల్లో ఐఎన్ఎస్ మర్ముగావ్ కూడా ఒకటని వివరించారు. ప్రపంచంలో అధునాతన సాంకేతిక యుద్ధనౌకల్లో ఒకటని తెలిపారు. నౌక నిర్మాణానికి 75 శాతానికిపైగా దేశీయ ముడిసరుకులే వాడినట్లు గుర్తుచేశారు. దీనితో మన నావికాదళం శక్తి సామర్థ్యాలు మరింత మెరుగవుతాయని, దేశ రక్షణ ప్రయోజనాలు పెరుగుతాయని చెప్పారు. మన దేశ ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను తీరుస్తుందని, అంతేకాకుండా మన ఇరుగు పొరుగు మిత్రదేశాలకు సైతం ఉపయోగపడుతుందని అన్నారు. 'ఐఎన్ఎస్ మర్ముగావ్' నిర్మాణం కోసం శ్రమించిన భారత నావికాదళం, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎల్)పై రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, డిజైనర్లు, సైంటిస్టుల కృషి వల్లే యుద్ధనౌక నావికాదళంలో చేరిందని కొనియాడారు. ఇది మన దేశానికి గర్వకారణమన్నారు.

యుద్ధనౌక విశేషాలివీ..

- ఐఎన్ఎస్ మర్ముగావ్ యుద్ధనౌక పొడవు 163 మీటర్లు. వెడల్పు 17 మీటర్లు. బరువు 7,400 టన్నులు. గరిష్ట వేగం గంటకు 55 కిలో మీటర్లు.
- ఉపరితలం నుంచి ఉపరితలానికి, ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే క్షిపణులను మోసుకెళ్లగలదు.
- 2021 డిసెంబర్ 19న జలప్రవేశం చేసింది.
- నౌకలో అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లు ఉంటాయి.
- లక్ష్యాన్ని కచ్చితంగా గుర్తించే ఆధునిక నిఘా రాడార్ అమర్చారు.
- అణు, జీవ, రసాయన యుద్ధ పరిస్థితుల్లోనూ సమర్థంగా పోరాడగలదు.
- నౌకకు గోవాలోని చారిత్రక రేవు నగరం మర్ముగావ్ పేరు పెట్టారు.
- 'ప్రాజెక్టు15బీ'లో భాగంగా నిర్మిస్తున్న 4 'విశాఖపట్నం' క్లాస్ డిస్ట్రాయర్స్‌లో ఇది రెండోది.
- ఐఎన్ఎస్‌మర్ముగావ్‌ను భారత నావికాదళంలో అంతర్భాగమైన వార్‌షిప్ డిజైన్ బ్యూరో డిజైన్ చేసింది. ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది.

దురాక్రమణదారు చైనా నుంచి దిగుమతులా?

కేంద్రంపై కేజ్రీవాల్ విమర్శలు



న్యూఢిల్లీ: భారత్‌పై దురాక్రమణలకు పాల్పడుతున్న చైనా నుంచి దిగుమతులకు కేంద్రం ఎందుకు అనుమతిస్తోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రశ్నించారు. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికుల గౌరవాన్ని ప్రభుత్వం కాపాడాలన్నారు. ధైర్యంగా చైనా దిగుమతులను నిలిపివేసి మత సత్తా చాటాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. చైనా ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చౌకగా దొరికేవే అయినా చైనా వస్తువులను మానేసి, ఖరీదైనా దేశీయంగా తయారైన వాటినే కొనాలని కోరారు.

ఎద్దు నుంచి పాలు పితికాం

గుజరాత్ ఎన్నికల్లో ఐదు సీట్లు గెలుచుకోవడంపై కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'ఆవు నుంచి పాలు ఎవరైనా పితుకుతారు. కానీ, గుజరాత్‌లో మేం ఎద్దు నుంచి పాలు పితికాం. అతికష్టమ్మీద 5 సీట్లు గెలుచుకున్నాం' అని అన్నారు.

మా దగ్గర అణుబాంబుంది

భారత్‌కు పాక్ మంత్రి హెచ్చరిక



ఇస్లామాబాద్: ప్రధాని నరేంద్ర మోదీపై పాకిస్తాన్ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వివాదం సద్దుమణగక ముందే, మరో మంత్రి షాజియా మారి రెచ్చిపోయారు. తమ దగ్గర అణు బాంబున్న విషయం మరిచిపోవద్దంటూ ఆదివారం భారత్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ''అవసరమైనప్పుడు దీటుగా బదులిస్తాం. అణు పాటవాన్ని వాడతాం'' అన్నారు. భారత ప్రధాని దేశంలో విద్వేష వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు.

జోడో యాత్రలో పాల్గొంటా: కమల్

చెన్నై: రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఈ నెల 24న తాను పాల్గొనబోతున్నట్లు ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ చెప్పారు. యాత్రలో పాల్గొనాలంటూ రాహుల్ తనను ఆహ్వానించారని చెప్పారు. ఆదివారం పార్టీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో కమల్ మాట్లాడారు. భారత్ జోడో యాత్రలో కమల్‌తో పాటు కార్యకర్తలు కూడా పాల్గొంటారని మక్కల్ నీది మయ్యం అధికార ప్రతినిధి మురళి అప్పాస్ వెల్లడించారు.



పార్టీ భేటీలో మాట్లాడుతున్న కమల్



ఇల్లే కదా స్వర్గసీమ..!

నీడ లేని వారికి గూడు కల్పించాలనే మహోన్నత లక్ష్యం నెరవేరుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన మహాయజ్ఞం సఫలమవుతోంది. - 8లో



అ'లా' కలిశారు

రెండు దశాబ్దాల క్రితం న్యాయవాద విద్యలో పట్టభద్రులైన వారంతా ఇన్నాళ్లకు మళ్లీ ఒకచోట కలిశారు. - 8లో



వెలమల సంక్షేమానికి కృషి

కొప్పలవెలమ సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని కొప్పల వెలమ రాష్ట్ర కార్పొరేషన్ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

సీఎం జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం గంటస్తంభం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలు నిర్వహిద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డిసెంబర్ 21న ఆయన జన్మదినోత్సవం కాగా ఆ రోజుతో పాటు 19, 20 తేదీల్లో కూడా వివిధ కార్యక్రమాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు మమేకం కావాలని కోరారు. 19న గ్రామ, మండల కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని, ఇందులో మహిళలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని తెలిపారు. 20న మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనపై గ్రామ, మండల కేంద్రాల్లో చర్చావేదికలు ఏర్పాటు చేయాలని సూచించారు. 21న నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసే రక్తదాన శిబిరాల్లో ప్రతీ నాయకుడు, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్తులో అత్యవసర పరిస్థితులో రక్తదానం చేయడానికి సుముఖంగా ఉన్నవారితో 'టేక్ ది ప్లెజ్ సేవ్ ఏ లైవ్' అనే నినాదంతో 'వైఎస్సార్‌సీపీబ్లడ్‌డొనేషన్.కామ్'లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

రామస్వామిని దర్శించుకున్న ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్



కమిషనర్ నాగరాజు కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామిని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ నాగరాజు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణ కుంభంతో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో పూజలు చేపట్టారు. అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కామన్వెల్త్ విజేతకు ఘన సన్మానం



బొండపల్లిలో క్రీడాకారుడు అనిల్‌ను ఊరేగింపుగా స్వగ్రామం తీసుకువెళ్తున్న అభిమానులు

బొండపల్లి: న్యూజిలాండ్‌లో గత నెల 24 నుంచి ఈ నెల 4 వరకు నిర్వహించిన అంతర్జాతీయ కామన్వెల్త్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలు సాధించిన మండలంలోని చామలవలస గ్రామానికి చెందిన బోదంకి అనిల్‌కుమార్‌కు ఆదివారం స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆత్మీయ సత్కారం చేశారు. మండల కేంద్రమైన బొండపల్లి నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేక వాహనంలో గ్రామానికి తీసుకువెళ్లిన అభిమానులు అన్ని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వగ్రామం చామలవలసకు చేరుకోగా అక్కడ కూడా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అనంతరం ఘనంగా సన్మానించారు. కామన్వెల్త్ పోటీల్లో 83 కేజీల విభాగంలో మన దేశం తరఫున 15 మంది క్రీడాకారులు పాల్గొనగా అనిల్ కుమార్ నాలుగు స్వర్ణ పతకాలను సాధించి అందరి అభినందనలు అందుకున్నాడు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ చల్ల చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం అనిల్‌కుమార్ భవిష్యత్‌లో మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎస్.కోటేశ్వర్రావు, ఏపీ పవర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకరరావు, శిక్షకులు శ్రీనివాసరావు, బోదంకి అప్పలనాయుడు, బోధంకి గౌరినాయుడుతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలకు మరింతగా ఉపాధి

- మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్‌డీఏ సన్నాహాలు
- జిల్లా వ్యాప్తంగా పది ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు
- శిక్షణ అనంతరం మిషన్ల కొనుగోలుకు రుణాలు
- జనవరిలో అందుబాటులోకి రానున్న శిక్షణ కేంద్రాలు

మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి అనంతరం మిషన్లు కొనుగోలుకు రుణాలు మంజూరు చేసి తద్వారా స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్వయంశక్తి సంఘాల్లోని మహిళలకు 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో పది శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.



స్వయం సహాయక సంఘాల మహిళలు

నెల్లిమర్ల:

మహిళల స్వయం ఉపాధికి ఎన్నో విధాలుగా సహకారం అందిస్తున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేస్తోంది. డీఆర్‌డీఏ - వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టులో శిక్షణ అందించడానికి సన్నాహాలు ప్రారంభించింది. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలకు శిక్షణ అందించడానికి జిల్లా వ్యాప్తంగా పది ప్రాంతాల్లో కేంద్రాలను సంబంధిత అధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కో కేంద్రంలో 60 మంది చొప్పున శిక్షణ అందించనున్నారు. 90 రోజుల పాటు శిక్షణ అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తరువాత మిషన్ల కొనుగోలుకు స్త్రీనిధి రుణాలు, పీఎంజీఈపీ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తారు. అంతేగాకుండా ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తారు. వచ్చే నెలలోనే శిక్షణ కేంద్రాల ప్రారంభానికి సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు. శిక్షణ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ అనే కంపెనీ సీఎస్ఆర్ కింద సహకారం అందిస్తోంది. వివరాల్లోకి వెళ్తే..



90 రోజుల పాటు శిక్షణ

జిల్లాలోని 27 మండలాల్లో 4.5 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారు. వారిలో సుమారు 3 లక్షల మంది 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారున్నారు. నిరుద్యోగులుగా ఉన్న వారికి స్వయం ఉపాధిని కల్పించడానికి ప్రభుత్వం కుట్టులో శిక్షణ అందించడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. డీఆర్‌డీఏ- వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పది ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు ప్రకటించారు. జిల్లా కేంద్రమైన విజయనగరంతో పాటు నెల్లిమర్ల, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి, రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల్లో కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. 90 రోజుల పాటు ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లపై శిక్షణ అందించనున్నారు. ఒక్కో కేంద్రంలో 30 మిషన్లు చొప్పున అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆయా మండల కేంద్రాలతో పాటు టీటీడీసీలో అందుబాటులో ఉన్న మిషన్లను శిక్షణకు వినియోగించనున్నారు. శిక్షణ పొందగోరే అభ్యర్థులు పదో తరగతి పాస్/ఫెయిల్ అయ్యుండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను ఆయా మండలాలకు చెందిన వైకేపీ ఏపీఎంలకు అందజేయాలి.

ఉచిత శిక్షణ.. రుణాలు మంజూరు

మహిళలకు కుట్టు శిక్షణను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ అనే సంస్థ సీఎస్ఆర్ కింద సహకారం అందిస్తోంది. కొంత భాగం ఎంపీ నిధులు కూడా వినియోగించనున్నారు. శిక్షణ కాలంలో 90 రోజుల పాటు ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తుంది. శిక్షణ దిగ్విజయంగా ముగించుకునే మహిళలకు మిషన్ల కొనుగోలుకు ప్రభుత్వమే రుణాలు మంజూరు చేస్తుంది. స్త్రీనిధి రుణాలతో పాటు పీఎంజీఈపీ ద్వారా సబ్సిడీ రుణాలను అందజేస్తుంది. ఆసక్తితో పాటు విద్యార్హతలు కలిగిన మహిళలకు వివిధ సంస్థల్లో డీఆర్‌డీఏ అధికారులు ఉద్యోగం కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పది ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను వచ్చే నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులైన వేలాది మంది మహిళలకు ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధి లభించనుంది.

నిరుద్యోగ మహిళలు వినియోగించుకోవాలి



జిల్లా వ్యాప్తంగా వచ్చే నెలలో ప్రారంభించే కుట్టు శిక్షణను నిరుద్యోగ మహిళలు వినియోగించుకోవాలి. హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ అనే సంస్థ సీఎస్ఆర్ కింద అందించే సహకారంతో శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. ఈ మేరకు కలెక్టర్‌తో సదరు సంస్థ ఎంఓయూ కుదుర్చుకుంది. ఒక్కో కేంద్రంలో 30 మంది చొప్పున 90 రోజుల పాటు రెండు బ్యాచ్‌లకు శిక్షణ అందిస్తాం. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు కొనుగోలు చేసుకోవడానికి అభ్యర్థులకు రుణాలు అందిస్తాం. ఆసక్తి కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తాం.

– ఎ.కళ్యాణ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

రాజ్యాధికార సాధనే బీసీల లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్
- బీసీలకు సహాయకారిగా ఉంటా : జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం పూల్‌బాగ్: స్వాతంత్ర్య భారతదేశంలో 75 ఏళ్లుగా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని, ఆ పరిస్థితి మారాలని, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా బీసీలంతా ఏకతాటిపైకి రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పూల్‌బాగ్‌లోని జిల్లా అటవీ శాఖ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన బీసీల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అధ్యక్షుడు గదుల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభా సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో బీసీ మహిళలకు 55 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఉద్యమాలు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల మెడలు వంచైనా వాటి సాధన దిశగా కృషి చేస్తున్నామన్నారు. చట్ట సభల్లోని కీలకమైన పదవుల్లో బీసీలకు రిజర్వేషన్ల ప్రకారం సముచిత స్థానం ఇవ్వకపోతే, ఆయా రాజకీయ పార్టీలకు తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎలగాల నూకాలమ్మ మాట్లాడుతూ బీసీ కులాల జనగణన చేపట్టాలని కేంద్రంను పదే పదే కోరుతున్నామన్నారు. తద్వారా బీసీ జనాభా దామాషా పద్ధతిలో చట్ట సభల్లోనూ, ఆర్థిక సంక్షేమ ఫలాలను అందుకోవడంలోను బీసీలను న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు గదుల వెంకట్రావు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే ఆలోచన ఉంటే, బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఆయన గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) మాట్లాడుతూ, బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండాలని వారికి అంతా సహకరించాలన్నారు. ఎవరెవరు ఏఏ రాజకీయ పార్టీల్లో ఉన్నా, ఉన్నత స్థాయిలో ఉన్నా, బీసీల్లో అట్టడుగు స్థానాల్లో ఉన్న వారిని గుర్తించి, వారిని ఉన్నత స్థానాలోకి తీసుకు రావడానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వాలు చక్కగా పరిపాలించినప్పటికీ, బీసీల హక్కుల కోసం అంతా ఏకతాటిపైకి వచ్చి సమస్యల సాధన దిశగా కృషి చేయాలన్నారు. జిల్లాలో బీసీలకు ఏ ఇబ్బంది వచ్చినా, తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని చిన్న శ్రీను స్పష్టం చేశారు. నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతి, మండల అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు దంపతులను ఘనంగా ఉచిత రీతిన దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు చోడి ఆదినారాయణ, మజ్జి అప్పారావు, వైస్ ప్రెసిడెంట్లు రామేశ్వరపు రామారావు, దుర్గారావు, కిల్లంపల్లి ఆచారి, వర్కింగ్ సెక్రటరీ ఎస్ఎస్ రెడ్డి కార్యక్రమం నిర్వహణకు కృషి చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నేతలు, తూర్పు కాపు సంఘం ప్రతినిధి రొంగలి రామారావు పాల్గొన్నారు.

మృదంగంలో వరల్డ్ రికార్డు



మండపాక నాగలక్ష్మి

విజయనగరం టౌన్: ప్రముఖ మృదంగ విద్వాంసురాలు డాక్టర్ మండపాక నాగలక్ష్మికి మృదంగంలో వరల్డ్ రికార్డు లభించింది. అంతర్జాతీయ కర్ణాటక సంగీత నృత్య సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం రాత్రి అయిగిరి నందిని పేరుతో అమ్మవారి 21 శ్లోకాలను ప్రపంచ వ్యాప్తంగా ఒకేసారి సంగీత, నృత్య కళారూపాలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో నాగలక్ష్మి మృదంగంలో సహకరించారు.

పెద్దపులి అలజడి

- నిన్న పులిగుమ్మి.. నేడు ఇప్పలవలసలో..
- ఆవుపై దాడి చేసిన వైనం
- నిర్ధారించిన అటవీ శాఖాధికారులు



ఇప్పలవలసలో పులి దాడిలో మృతి చెందిన ఆవు

మెరకముడిదాం: పెద్దపులి సంచారంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. రెండు రోజుల కిందట పులిగుమ్మి గ్రామంలో అలజడి సృష్టించిన పెద్దపులి శనివారం అర్ధరాత్రి ఇప్పలవలసలో గుడివాడ సత్యనారాయణకు చెందిన ఆవుపై దాడి చేసింది. ఈ దాడిలో ఆవు మృతి చెందింది. సత్యనారాయణ ఎప్పటిలాగానే తన ఆవును పశువుల శాలలో శనివారం సాయంత్రం కట్టాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో పెద్దపులి ఆవుపై దాడి చేసి తలను, మొండేన్ని వేరుచేసి మరీ చంపేసింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారి టైగర్ ట్రాకర్ అమర్‌నాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పాదముద్రలు పులివేనని, ఆవుపై దాడి చేసింది పులేనని నిర్ధారించారు. ఈ దాడిలో ఇప్పలవలసతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంత ప్రజలు ఉదయం ఎనిమిది గంటలలోపు, సాయంత్రం ఐదు గంటల తరువాత ఇళ్ల నుంచి ఒంటరిగా బయటకు రావొద్దని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా పులిగుమ్మి గ్రామంలో శనివారం మధ్యాహ్నం మూడు ఆవులపై దాడి చేసిన పులి అదే రోజు అర్ధరాత్రి సమయంలో మృతి చెందిన ఆవు కళేబరాన్ని తోడ్కొని వెళ్లేందుకు వచ్చినట్టు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది సీసీ టీవీ పుటేజీల్లో రికార్డు అయిందని అటవీ శాఖాధికారులు తెలిపారు.

యువతతోనే మార్పు సాధ్యం

- జీఎంఆర్ ఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథి మల్లికార్జునరావు

రాజాం:

సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి యువత కృషి చేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణమూర్తి అన్నారు. రాజాంలోని జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా సమాజంలో సుస్థిర అభివృద్ధికి జీఎంఆర్ గ్రూపు తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంతో కృషి చేస్తుందన్నారు. యువత తమ వ్యక్తిగత ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గాంధీజీ చెప్పినట్టు యువత ఏ మార్పు కావాలని కోరుకుంటున్నారో ఆ మార్పు దిశగా పయనించాలన్నారు. నాగరిక సమాజాన్ని స్థాపించడం, మంచి పౌరుడిగా ఉండడం, మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడం చేయాలని సూచించారు. ఆకాంక్ష అనేది ఏ వ్యక్తినైనా అత్యంత ముఖ్యమైన ఇంధనంగా మార్చుతుందని, తక్కువగా మాట్లాడి కష్టపడి పని చేయడం నేర్చుకోవాలన్నారు. ప్రస్తుతం రెండు భారతదేశాలు ఉన్నాయని, పట్టణ పారిశ్రామిక భారతదేశం ఒకటైతే.. నిస్సహాయక గ్రామీణ భారతదేశం మరొకటని పేర్కొన్నారు. ఎలాంటి పిరికితనానికి బలి కాకుండా ఉంటే మంచి సమాజాన్ని చుట్టూ స్థాపించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నారాయణమూర్తికి జీఎంఆర్ వీఎఫ్ అశ్విని లోహాని ఫౌండేషన్ కార్యకలాపాలపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. జీఎంఆర్ గ్రూపు చైర్మన్ జీఎం రావు మాట్లాడుతూ భారతదేశపు ప్రముఖ పారిశ్రామికవేత్తలలో ఒకరైన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులైన నారాయణమూర్తి ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. జీఎంఆర్ ఐటీ విద్యార్థులు విజయవంతమైన ఎంట్రప్రెన్యూర్లుగా మారాలని ఆకాంక్షిస్తున్నామని వెల్లడించారు. జీఎంఆర్‌లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను బలంగా నమ్ముతున్నామని అన్నారు. నారాయణమూర్తి పంచుకున్న ఆలోచనలు యువత విజయానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. అంతకు ముందు జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్, జీఎంఆర్ వరలక్ష్మి, కేర్ హాస్పిటల్, నాగావళి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ వృత్తి శిక్షణ కేంద్రాన్ని నారాయణమూర్తి సందర్శించారు.

విద్యార్థులకు అభినందన

ఈ సందర్భంగా కళాశాలల్లో చదువుతూ విద్య, సేవా రంగాల్లో రాణిస్తున్న పలువురు విద్యార్థులను నారాయణమూర్తి చేతుల మీదుగా సత్కరించారు. జీఎంఆర్‌లో చదవడంతో పాటు సేవలు అందిస్తున్న డాక్టరేట్‌లకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాలకు చెందిన ఆకాష్ అనే విద్యార్థి ఈ సందర్భంగా జీఎంఆర్‌కు, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తికి తన చేతితో వేసిన డ్రాయింగ్ చిత్రాలను బహుకరించాడు. జీఎంఆర్ తన కుటుంబీకులతో నారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. జీఎంఆర్ సంస్థల్లోని ఉద్యోగులు, విద్యార్థులతో కలసి ఫొటో కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్, జీఎంఆర్ ఐటీ డైరెక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, విజయనగరం డీఆర్‌ఓ గణపతిరావు, జీఎంఆర్‌వీఎఫ్ బోర్డు మెంబర్లు, ఐటీ కళాశాల అధ్యాపకులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగాల జోష్

వైద్య రంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య విభాగంలో పోస్టులను భర్తీ చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దడం ద్వారా రోగులకు విస్తృతమైన సేవలు అందిస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అధిక సంఖ్యలో నియామకాలు
- మూడున్నరేళ్లలో 1354 పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం
- 179 మంది వైద్యుల నియామకం
- 268 స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



రోగికి సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్సు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలే పూర్తిగా మార్చేసింది. కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దారు. రోగులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య శాఖలో అధిక సంఖ్యలో నియామకాలు చేపట్టారు. దీంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాల రావడంతో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. మరోవైపు నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది.

అన్ని పోస్టులు భర్తీ

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా సిబ్బంది కొరతను తీర్చేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అటెండర్ దగ్గర నుంచి స్పెషలిస్టు వైద్యులు వరకు అన్ని పోస్టులు భర్తీ చేశారు. వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు, కౌన్సిలర్లు, జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేటర్లు, ఎఫ్ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలు, పోస్టుమార్టం అసిస్టెంట్స్, థియేటర్ అసిస్టెంట్స్ తదితర క్యాడర్లకు సంబంధించి 1354 పోస్టులను భర్తీ చేశారు.

పోస్టు పేరు	భర్తీ చేసిన పోస్టుల సంఖ్య
స్పెషలిస్టు వైద్యులు	43
వైద్యులు	136
స్టాఫ్‌నర్సులు	268
ఏఎన్ఎం	591
పారామెడికల్ సిబ్బంది	151
డేటా ఎంట్రీ ఆపరేటర్లు	33
క్లాస్–4 ఉద్యోగాలు	122
ఇతర క్యాడర్ ఉద్యోగాలు	10

గతంలో సిబ్బంది కొరతతో సేవలు అంతంత మాత్రమే

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. వైద్య రంగానికి సంబంధించి పోస్టులు ఏవీ భర్తీ చేయలేదు. ఫలితంగా వైద్య సేవలు అరకొరగా అందేవి. ఉన్న సిబ్బందిపై అధిక ఒత్తిడి పడడం వల్ల తీవ్ర ఇబ్బంది పడేవారు. అత్యవసర సేవలకు కేజీహెచ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి.

అధికంగా నియామకాలు చేపట్టాం

గత మూడేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో వివిధ క్యాడర్లకు సంబంధించి అధిక సంఖ్యలో పోస్టులు భర్తీ చేశాం. అన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని నియమించాం. సిబ్బంది నియమించడం వల్ల మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

– డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జైభీమ్‌కు వెండి పతకం



వెండిపతకం సాధించిన సీఐ జైభీమ్

బొబ్బిలి: ఎస్‌ఈబీ బొబ్బిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్ జైభీమ్ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వెండిపతకం సాధించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన పోటీల్లో జైభీమ్ 5కేఎం రేస్ వాకింగ్‌లో 40ప్లస్ విభాగం రెండో స్థానంలో నిలిచారు. దీంతో ఫిబ్రవరిలో వెస్ట్ బెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు సీఐ జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది, స్థానికులు ఆయనను అభినందించారు.

అండర్ -19 వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్ 19 క్రీడాపోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం ఉత్సాహ భరితంగా సాగింది. అండర్ 19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలకు వందమంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 35 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను అండర్ 19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వి.ఎల్.కృష్ణ, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టి. భగవాన్ దాస్‌లు పర్యవేక్షించారు.

శాప్‌యోగా లీగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యోగా లీగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు ఎంపిక ఆదివారం పూర్తయింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

- 23 నుంచి ఎలమంచిలిలో రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలు బాలికలు జట్ల నిర్వాహకులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా వాలీబాల్ స్టేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణంరాజు, టి భగవాన్ దాస్‌ల పర్యవేక్షణలో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25 వ తేదీ వరకు ఎలమంచిలిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,490-00
బంగారం(22సి. 10గ్రా.)	49,950-00
వెండి (కిలో)	73,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

ఇల్లే కదా స్వర్గసీమ..!



ఈ చిత్రంలో కనబడుతున్న ఇల్లు పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన యు.పార్వతిది. గతంలో ఆమె కుటుంబం అద్దె ఇంట్లో జీవనం సాగించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమెకు ఇంటి స్థలం మంజూరు కాగా నిర్మాణం పూర్తిచేసుకుని ఇటీవల గృహప్రవేశం కూడా చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమ సొంతింటి కలను సాకారం చేశారని, అద్దె ఇంటి ఇబ్బందులు తప్పాయని ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.



సాలూరు నియోజకవర్గంలో గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇల్లు

- పేదవాడి ఏళ్ల నాటి సొంతింటి కల సాకారం
- చురుగ్గా సాగుతున్న ఇంటి నిర్మాణాలు
- తొలిదశలో 7189 గృహప్రవేశాలకు సిద్ధం
- గృహనిర్మాణాల్లో పార్వతీపురం మన్యం జిల్లాకు మూడో స్థానం

పార్వతీపురం టౌన్:

నీడ లేని వారికి గూడు కల్పించాలనే మహోన్నత లక్ష్యం నెరవేరుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మహాయజ్ఞం సఫలమవుతోంది. సొంతిల్లు ప్రతి ఒక్క పేదవాడి కల. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు సీఎం జగన్ గృహయోగం కల్పించారు. స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ప్రోత్సహిస్తున్నారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా గృహ నిర్మాణాల పురోగతిలో రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ఆనందోత్సాహాలతో గృహప్రవేశాలు చేసుకుంటున్నారు. అద్దె ఇంటి కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 309 జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం 24,740 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. లబ్ధిదారులకు నాణ్యమైన ఇళ్లు నిర్మించే బాధ్యతను చేపట్టింది. అందులో భాగంగా ఆయా లేఅవుట్లలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించింది. దశలవారీగా గృహ నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు అందించేందుకు శరవేగంగా కార్యాచరణ అమలు చేస్తోంది. తొలిదశలో భాగంగా ఈ నెలాఖరులోగా 7,189 ఇళ్లను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది. రెండవ దశలో 100 శాతం నిర్మాణాలు పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేసింది. కొత్తఏడాదిలో ఏ నెలలో పూర్తయిన ఇళ్లకు ఆ నెలలోనే గృహప్రవేశం చేయించాలని సంకల్పించింది.

జిల్లాలో నిర్మాణాలు ఇలా..	
మండలాలు	15
లేఅవుట్లు	309
లబ్ధిదారులు	24,740 మంది
పీఎం గ్రామీణ్ లబ్ధిదారులు	6010మంది
పూర్తి చేసిన ఇళ్లు	7189

పక్కాగా మౌలిక వసతులు

జగనన్న లేఅవుట్లను పక్కాగా వసతులతో తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి సరఫరాకు పూర్తి ఏర్పాట్లు చేపట్టారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.4.42 కోట్లు, విద్యుత్ లైన్లకు రూ. 25.86 లక్షలు, నీటి సరఫరాకు రూ.5.50 కోట్లు మంజూరు చేశారు. ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు శ్రీకారం చుట్టారు. కాలనీలకు పకడ్బందీగా విద్యుద్దీకరణ చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన సౌకర్యాలను గ్రామీణ ప్రాంత లేఅవుట్లలో సైతం కల్పిస్తున్నారు. అందంగా, ఆహ్లాదకరంగా తయారైన లేఅవుట్లను వీక్షించేందుకు లబ్ధిదారులు తరలివస్తున్నారు. త్వరలోనే సొంతింటికి వెళ్లబోతున్నామనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శివరాంపురంలో గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇల్లు

గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇళ్లు	
మండలం	ఇళ్ల సంఖ్య
పార్వతీపురం	1186
పాచిపెంట	491
సాలూరు	592
సీతానగరం	1147
పాలకొండ అర్బన్	536
మక్కువ	533
కొమరాడ	482
పార్వతీపురం అర్బన్	620
బలిజిపేట	848
సాలూరు అర్బన్	754

వందశాతం పూర్తి చేయడమే లక్ష్యం



జిల్లావ్యాప్తంగా 100 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. జగనన్న లేఅవుట్లలో అద్భుతమైన వసతులు కల్పిస్తున్నాం. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులకు సంబంధించి మార్ట్‌లు ఏర్పాటు చేశాం. పేదలందరూ సంతోషంగా జీవనం సాగించేలా నాణ్యమైన ఇళ్లు అందిస్తాం.

-పి.రఘురాం, జిల్లా గృహనిర్మాణాధికారి (హౌసింగ్ పీడీ), పార్వతీపుం మన్యం

లారీ ఢీకొని ఎద్దు మృతి

బాడంగి: గోగునారతో బాడంగి వైపు వస్తున్న ఎడ్లబండిని అదేదిశగా వస్తున్న లారీ వెనుకనుంచి ఢీకొట్టడంతో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదం జరిగి ఎద్దుమృతిచెందింది. ఈ సంఘటనపై గ్రామస్తులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటిపల్లికి చెందిన రైతు రొంగలి శ్రీనివాసరావు గోగునారను ఎడ్లబండిపై వేసుకుని డొంకినవలసలో అమ్మడానికి వస్తుండగా రామచంద్రాపురం దాటిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారు జామున వెనుకనుంచి వచ్చిన లారీ ఎలాంటి హారన్ కొట్టకుండా స్పీడ్‌గా వచ్చిఢీకొట్టడంతో ఎడ్లబండి బోల్తా కొట్టగా ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. రెండోఎద్దుచావుబతుకుల మధ్య ఉంది. .రైతుశ్రీనివాసరావుకు మోకాళ్లపై గాయాలవ్వగా స్థానిక సీహెచ్‌సీకి తరలించగా చికిత్సచేసి పంపించారు. మెరుగైన వైద్యం కోసం స్కాన్‌చేసుకోమని బొబ్బిలి తరలించారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందగా ఎస్సై జయంతితో పాటు సిబ్బంది ప్రమాదస్థలానికి వెళ్లి పరిస్థితిని తెలుకుకున్నారు.లారీ డ్రైవర్ తప్పించుకుపోవడంతో ఆచూకీగురించి పోలీసులు ఆరాతీస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఆర్‌సీఎం చర్చి వద్ద గల సీసీకెమెరా ఫుటేజిని ఎస్సై పరిశీలించారు. దట్టమైన పొగమంచు కురవడంతో వాహన వివరాలు స్పష్టంగా తెలియరాలేదని కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



రామచంద్రాపురం వద్ద రోడ్డుపైన మృతిచెందిన ఎద్దు

సేవాగుణం పదిమందికి తెలియాలి

- ఇండియా రైడ్ పేరుతో తెలంగాణ వాసి సైకిల్ యాత్ర

కొత్తవలస: సేవా గుణాన్ని పది మందికి తెయజజేయాలనే ఉద్దేశంతో ఇండియా రైడ్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా కొక్కలగూడూరుకు చెందిన బొగిరి సాగర్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన సైకిల్ యాత్ర ఆదివారం కొత్తవలస చేరుకుంది. ఈ సందర్భంగా సాక్షి ప్రతినిధితో యాత్ర విశేషాలను పంచుకున్నాడు. సాగర్ ఒక సాధారణ ఫొటోగ్రాఫర్. ఈవెంట్లకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి అతని ఆలోచనలను మార్చేసింది. తన ఊరితో పాటు ఎంతో మందిని ఆ మహమ్మారి పొట్టన పెట్టుకుంది. ఎవ్వరూ కనీసం సాయం చేయలేకపోయారు. అలాంటి క్లిష్ట సమయాల్లో సినీనటులు సోనూసూద్, మహేషబాబు లాంటి వారు చేసిన సేవ ఆయన మనసును విశేషంగా హత్తుకుంది. దీంతో వారిని కలవాలనే ఆలోచనతోనే ఈసైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపాడు.



కొత్తవలసలో సాగుతున్న సాగర్ ఇండియా రైడ్ సైకిల్ యాత్ర

హిందీ పరీక్షల ఫీజుకు గడువు పెంపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహిస్తున్న పరిచయ్. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, భాష ప్రవేశిక పరీక్షల ఫీజును ఈనెల 31వ తేదీవరకూ చెల్లించేందుకు అవకాశం ఉందని రాజాం పట్టణానికి చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశారద, ప్రవీణ వరకూ గల పరీక్షలకు ఈనెల 25వ తేదీవరకూ గడువును పెంచినట్లు వెల్లడించారు. మిగిలిన వివరాల నిమిత్తం ఫోన్ నంబర్ 99499 17365లో విద్యార్థులు సంప్రదించాలని కోరారు.

అంతర్ వర్సిటీ కబడ్డీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు



ఎం.మానస



జి.వినీల

రాజాం సిటీ: అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇటీవల ఏలూరులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన కళాశాలకు చెందిన ఎం.మానస, జి.వినీల ఈ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి చెన్నై ఏఎంఈటీ యూనివర్సిటీలో జరగనున్నాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ ఆఫీసర్ జి.శశికుమార్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన మున్నా కుమార్ రాయ్



మున్నా కుమార్ రాయ్ (ఫైల్)

గుర్ల: మండలంలోని నక్కలపేట, ఆనందపురం రహదారి వద్ద ఆదివారం బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో బీహార్‌కు చెందిన మున్నా కుమార్ రాయ్ (27) అక్కడికక్కడే మృతిచెందాడు. మున్నా కుమార్ రాయ్ విజయనగరంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. నక్కలపేటలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి విజయనగరం నుంచి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు

కొత్తవలస: అరకు-విశాఖ రోడ్డులో శ్రీనివాస కల్యాణ మంటపం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో విశాఖపట్నం పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన ఎస్.తరుణ్(19) తీవ్రంగా గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. తరుణ్ ద్విచక్ర వాహనంపై పెందుర్తి నుంచి కొత్తవలస వస్తుండగా మితిమీరిన వేగం కారణంగా వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో తరుణ్ ముక్కులోంచి అధిక రక్తం కారడం, కాలు విరిగి అపస్మార స్థితిలో ఉండగా నైట్ రౌండ్స్ నిర్వహిస్తున్న ఏఎస్సై రహమాన్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో విశాఖపట్నం తరలించారు. క్షతగాత్రుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు తరుణ్ మృతిపై శవ పంచనామా నిర్వహించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అరకు-విశాఖ రోడ్డులో బైక్ అదుపు తప్పి పడిపోయిన తరుణ్

భవన నిర్మాణ పనుల్లో జారి పడి యువకుడు..

కొత్తవలస రూరల్: మండలంలోని చింతలదిమ్మ సమీపంలో గల గొల్లపేట గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా రామచంద్రాపురం గ్రామానికి చెందిన కోరుబిల్లి జగన్ (23) జారిపడి ఆదివారం మృతి చెందాడు.ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం గ్రామానికి చెందిన జగన్ ఎప్పటిలాగానే ఉపాధి నిమిత్తం గొల్లపేట గ్రామంలో నిర్మిస్తున్న భవనం సెంట్రింగ్ పనులకు వెళ్లాడు.అక్కడ పనులు చేస్తుండగా జారి పక్కనే గల ప్రహరీపై పడడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటూ రోదించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అ'లా' కలిశారు



ఎన్‌బీఎం లా కాలేజీ పూర్వ విద్యార్థులు

విజయనగరం: రెండు దశాబ్దాల క్రితం న్యాయవాద విద్యలో పట్టభద్రులైన వారంతా ఇన్నాళ్లకు మళ్లీ ఒకచోట కలిశారు. ఆనాటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విశాఖ నగరంలోని ఎన్‌బీఎం లా కాలేజీలో ఎల్ఎల్‌బీ చదివిన 2002 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం విశాఖలోని ఓ హోటల్లో కలిశారు. హైకోర్టు, జిల్లా కోర్టుల్లో న్యాయవాదులు, ప్రభుత్వ న్యాయవాదులుగా, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు వారిలో ఉన్నారు. కార్యక్రమంలో తొలుత వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పూర్వ విద్యార్థులైన రవికుమార్, కిషన్, విజయ్, కృష్ణమూర్తి ఆత్మలకు శాంతి కలగాలని నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్ నుంచి ఉన్నతస్థాయికి చేరుకున్న వారిని ఘనంగా సన్మానించారు. యలమంచిలి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.జ్యోతిసుధ, విశాఖ జిల్లా కోర్టు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ సూరంపూడి శ్రీనివాస్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (కస్టమ్స్) వైఎస్ శ్రీనివాస్, విశాఖ వినియోగదారుల న్యాయస్థానం-2 సబ్ జడ్జి కరక రమణబాబును ఘనంగా సన్మానించారు. నిర్వాహక కమిటీ సభ్యులు మెహబూబ్ ఖాన్, కేఎస్ శాస్త్రి, ఎం.గోవింద్, బీసీహెచ్ గుప్తా, ఎస్.మనోహర్, యు.శ్రీనివాస్, సౌజన్య, బీవీ రమణతో పాటు విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన న్యాయవాద విద్య పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొప్పల వెలమల సంక్షేమానికి కృషిచేస్తా

- కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాయుడుబాబు

పార్వతీపురం: కొప్పులవెలమ సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని కొప్పుల వెలమ రాష్ట్ర కార్పొరేషన్ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం జిల్లా కేంద్రంలో కొప్పులవెలమ సంక్షేమ సంఘం అధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొప్పుల వెలమ సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సభ్యులను కోరారు. వన భోజనాల కార్యక్రమానికి గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం, మక్కువ, సీతానగరం, కురుపాం, సాలూరు తదితర మండలాలనుంచి పార్టీలకు అతీతంగా సుమారు 5వేలమంది హాజరయ్యారు. సంఘ పట్టణ అధ్యక్షుడు చెల్లారపు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మాజీ ఎంఎల్‌సీలు ద్వారపురెడ్డి జగదీష్, గాదె శ్రీనివాసులు నాయుడు, వ్యవసాయ కమిటీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, సంఘం నాయుకులు, సభ్యులు చుక్క భాస్కరరావు, బీఎస్‌బీ రావు, పెంట తిరుపతిరావు, బొంగు చిట్టిరాజు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, స్థానిక వైద్యులు వై.వివేక్, నాని, శ్రావణ్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి.



కొప్పులవెలమ సంక్షేమ సంఘం వనభోజనాల కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు

అన్నిస్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రానున్న సాధారణ ఎన్నికలలో అన్నిస్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఏపీ రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పరిసరాలలో నిర్వహించిన కొప్పుల వెలమ వనభోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందులో భాగంగా మండలంలోని నర్సిపురం గ్రామంలో వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా నాయకులు కాపారపు శివున్నాయుడు నివాసంవద్ద ఎమ్మెల్యే అలజంగి జోగారావు గౌరవ ఆయనను పూర్వకంగా కలిశారు.



నెక్కలనాయుడుబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఈ సందర్భంగా నాయుడుబాబును ఎమ్మెల్యే అలజంగి జోగారావు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, ఆరోగ్యం తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలుంటే తక్షణం పరిష్కరించే దిశగా కృషిచేయాలని సూచించారు. గ్రామాలలో, పట్టణాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ప్రజలకు వివరించాలని చెప్పారు. రాష్ట్ర రాజకీయ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మళ్లీ రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేయాల్సిన ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వధర్మ స్థూపం ఆవిష్కరణ



సర్వధర్మ స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, తదితరులు

విజయనగరం టౌన్: నగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన సర్వధర్మ స్థూపాన్ని సత్యసాయి సేవా సమితుల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు దంపతులు ఆదివారం ఆవిష్కరించారు. అంతకుముందు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ చొక్కాపు దామోదరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.పాపినాయుడు, రాష్ట్ర సేవాదళ్ ప్రతినిధి వి.సుబ్బారావు, జాయింట్ యూత్ రాష్ట్ర కోఆర్డినేటర్ వి.కల్యాణి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఎం.సత్యనారాయణ, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా రాణించాలి

- యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గొలగాన రమేష్‌యాదవ్



మాట్లాడుతున్న యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రమేష్‌యాదవ్

పూసపాటిరేగ: యాదవలు రాజకీయంగా రాణించాలని భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గొలగాన రమేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని కుమిలిలో యాదవ మహాసభ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఉత్తరాంధ్రలో యాదవలు అభివృద్ధి చెందాలంటే బీసీ డీ నుంచి బీసీ బీలోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్రలో సుమారు 18 లక్షల మంది యాదవలున్నా ఒక్క ఎమ్మెల్యే లేకపోవడం శోచనీయమన్నారు. యాదవలు అన్ని రంగాల్లో బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నమ్మి అప్పలరాజుయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాయిత వెంకటరమణ యాదవ్, కిలాడి అప్పలరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని అడ్డూరివానిపాలెంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టంగా భావించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం మన అదృష్టమని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. గత ప్రభుత్వంలో అరకొరగా పథకాలు ఉండేవని, అవి కూడా అర్హత ఉన్న వారికి మంజూరయ్యేవి కావని, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారికి, టీడీపీ సానుభూతిపరులకే అందేవని గుర్తు చేశారు. నేడు అర్హులందరికీ వలంటీర్లు తలుపుతట్టి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, నాయకులు పి.చెల్లయ్య, గొరపల్లి రవి, ఆదిరెడ్డి నాయుడు, అదవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న అనంతం

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి రిక్షాకాలనీ యువతకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం తన తనయుడు విహార్‌తో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వాలీబాల్ కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా అనంతం మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి...

- స్త్రీనిధి రుణాల మంజూరులో నెల్లిమర్ల మండలం టాప్
- లక్ష్యం రూ. 7 కోట్లు కాగా ఇప్పటివరకు అందజేసింది రూ. 8 కోట్లు
- శతశాతం రికవరీతో అభివృద్ధి పథంలో వైఎస్సార్ క్రాంతిపథం

నెల్లిమర్ల: మహిళలకు ఆర్థిక చేయూతనందించి, వారిని అన్ని విధాలుగా అభివృద్ధిపథంలో నడిపించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నెల్లిమర్ల మండలంలోని వైఎస్సార్ క్రాంతిపథం దూసుకుపోతోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఉద్దేశించిన స్త్రీనిధి రుణాలను ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి సంబంధిత అధికారులు మంజూరు చేశారు. కేవలం రుణాల మంజూరులోనే గాకుండా రికవరీ విషయంలో శతశాతం లక్ష్యాలను సాధిస్తున్నారు. తద్వారా మండలంలోని మహిళా సంఘాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారు. సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం చెందేలా చర్యలు చేపడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

నెల్లిమర్ల మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1381 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఆయా సంఘాల్లో మొత్తం 15,981 మంది మహిళా సభ్యులున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.7 కోట్ల రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అయితే వైఎస్సార్ క్రాంతిపథం అధికారులు లక్ష్యానికి మించి రుణాలను మంజూరు చేశారు. 384 సంఘాలకు చెందిన 1920 మంది సభ్యులకు రూ. 8 కోట్లు ఇప్పటికే మంజూరు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా మూడున్నర నెలల సమయం మిగిలి ఉండడంతో అవసరమైన మహిళలకు ఇంకా రుణాలు మంజూరు చేస్తామని సంబంధిత వైకేపీ అధికారులు చెబుతున్నారు. కేవలం రుణాల మంజూరు విషయంలోనే గాకుండా రికవరీ విషయంలో కూడా ముందంజలో ఉన్నారు. ప్రస్తుతం 99.65 శాతం రికవరీ సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ఇదిలా ఉంటే స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళల్లో చాలామంది చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించుకుని, ప్రతి నెలా ఎంతో కొంత ఆదాయం పొందుతున్నారు. మరి కొంతమంది మహిళలు తమ ఆర్థికావసరాలు తీర్చుకుంటున్నారు. తద్వారా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు.



వైకేపీ కార్యాలయం

జిరాక్స్ మిషన్‌తో ఉపాధి..

ఈ ఫోటోలోని మహిళ పేరు యల్లంశెట్టి విజయదుర్గ. మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన ఈమెకు స్త్రీనిధి ద్వారా రూ. 75వేల రుణం మంజూరైంది. ఆ మొత్తంతో జిరాక్స్ మిషన్ కొనుగోలు చేసి, గ్రామంలోనే వ్యాపారం ప్రారంభించారు. ప్రతి నెలా రూ. 5 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.



కుట్టు మిషన్‌తో స్వయం ఉపాధి

ఈ ఫోటోలోని మహిళ పేరు బడిగంటి నాగమణి. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన ఈమెకు రూ.50 వేల రుణం మంజూరైంది. ఆ మొత్తంతో కుట్టుమిషన్ కొనుగోలు చేసుకున్నారు. తన ఇంటి వద్దనే కుట్టు పని చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారు.



లక్ష్యానికి మించి రుణాలు



మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే అధికంగా స్త్రీనిధి రుణాలు మంజూరు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 7 కోట్లు లక్ష్యం కాగా 8 కోట్ల రూపాయల వరకు అందించాం. తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. అవసరమైన మహిళలకు ఇంకా రుణాలు మంజూరు చేస్తాం. మహిళలు అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-ఎల్. సత్యనారాయణ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతిపథం, నెల్లిమర్ల

అవనాపు, మద్దిల సేవలు ఆదర్శనీయం



తైక్వాండో విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన నాయకులు అవనాపు సూర్యనారాయణ, మద్దిల ఆదినారాయణ అందించిన సేవలు అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. సూర్యనారాయణ, ఆదినారాయణ జ్ఞాపకార్థం స్థానిక సాధనా యువజన సంఘం ఆధ్వర్యంలో జరజాపుపేటలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే 18వ కరాటే బెల్ట్ గ్రేడింగ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని, కింగ్ ఆఫ్ కరాటే చాంపియన్ డోజో నూతన శాఖను ఎమ్మెల్సీ ప్రారంభించారు. కోచ్ ఉమా ప్రసాదరావు 300 మంది తైక్వాండో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్సీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి అవనాపు, మద్దిల చేసిన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మద్దిల ఆదినారాయణ గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించారని కొనియాడారు. వారి పేరు మీద కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎస్.రామారావు, సాధనా యువజన సంఘ అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వాసు, కౌన్సిలర్ ఎ.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, మోహనరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ అటానమస్ కళాశాలలో రామానుజం జయంతి



విజేతలతో నిర్వాహకులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలో శ్రీనివాస రామానుజం 135వ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యభట్ట మ్యాథ్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.దుర్గాప్రసాద్ పట్నాయక్ అధ్యక్షతన పలు కార్యక్రమాలు చేపట్టారు. తొలుత రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత పాఠ్యాంశాలపై విద్యార్థులకు సదస్సు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు క్లబ్ తరుపున జ్ఞాపికలు, మెడల్స్, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, నిత్యజీవితంలో గణితం ఆవశ్యకత కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల మ్యాథ్స్ విభాగాధిపతి సూరిబాబు, ఎంఆర్ పీజీ కళాశాల మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీరామమూర్తి, గణిత అధ్యాపకుడు ఉమాశంకర్, క్లబ్ అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, సెక్రటరీ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకెళ్లాలి..

- జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎజ్జు మురళీకృష్ణ

విజయనగరం టౌన్: తెలగ కులస్తులందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి చెందగలమని జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎజ్జు మురళీకృష్ణ అన్నారు. పట్టణ శివారు ఆర్‌కే గార్డెన్స్‌లో తెలగ కులస్తుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలగ సంఘానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలగాలను బీసీల్లో చేర్చేందుకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. తమ స్వగ్రామమైన చీపురుపల్లిలో వచ్చే ఏడాది నుంచి విద్యార్థులకు తన తండ్రి సత్యనారాయణ పేరుమీద స్కాలర్‌షిప్పులు అందజేస్తానని చెప్పారు. అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 2 కోట్ల విలువైన స్థలం అందజేసిన దాత కోలా రామకృష్ణ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. స్థానిక కార్పొరేటర్లు అల్లు చాణక్య, గాదెం మురళి, సంఘ ప్రతినిధులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కోలా రామకృష్ణ, బొల్లు రవీంద్ర, మాత బుజ్జి, తీగల హరనాథ్, పుప్పాల లక్ష్మణరావు, ఆకిరి ప్రసాదరావు, రాజాం నుంచి నాంది సూర్యప్రకాష్, కోటి, మిర్యాల గోవిందరావు, ముంగం నారాయణరావు, పోలా వెంకటరావు, శివప్రసాద్ ప్రసంగించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ పెద్దలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంఘ ప్రతినిధులు, కులస్తులు పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎజ్జు మురళీ కృష్ణ

26న ధర్నా

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, ఉపాధ్యక్షుడు పి.దుర్గారావు పిలుపునిచ్చారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన విషయాలపై చర్చించారు.

దళారులను నమ్మొద్దు..

విజయనగరం లీగల్: ఇటీవల న్యాయశాఖలో భారీ ఎత్తున ఖాళీలు భర్తీ చేసేందుకు హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఉద్యోగాల కోసం అభ్యర్థులెవ్వరూ దళారులను ఆశ్రయించవద్దని జిల్లా న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొంతమంది దళారులు ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దళారులను నమ్మి ఎవ్వరూ మోసపోవద్దని సూచించారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

- ఎంపీపీ కల్యాణి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు దళారులను ఆశ్రయించవద్దని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని లంకలపల్లిపాలెం పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు పండించిన ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సాధారణ రకం క్వింటాకు రూ.2040, ఏ గ్రేడ్ రకానికి 2060 రూపాయలను మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం అమ్మిన 21 రోజులలో రైతు బ్యాంక్ ఖాతాకు నగదు జమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, సర్పంచ్ రౌతు వెంకటరత్నం, పీఏసీఎస్ అధ్యక్షుడు పసుపులేటి మహేష్, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్ధనరావు, రౌతు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిదలో గల వేంకటేశ్వర ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన తూర్పు ముఖద్వారాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని సూచించారు. నమ్ముకున్న దైవం పట్ల విశ్వాశాన్ని పెంపొందించుకోవాలన్నారు. హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో దాత పెనుమత్స నరసింహరాజు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

- ఎంపీ బెల్లానకు గరివిడి మండల నాయకుల వినతి



ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేస్తున్న గరివిడి మండల ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని ఆర్‌ఓబీ కింద రైల్వేట్రాక్‌పై నుంచి రాకపోకలు లేకుండా ఇటీవల రోడ్డును మూసి వేశారని, సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్‌ను గరివిడి మండల వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఎంపీ బెల్లానను చీపురుపల్లిలోని ఆయన నివాసంలో గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్‌ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపితో పాటు నాయకులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా గరివిడి పట్టణం ఉందని, ఆర్‌ఓబీ కింద ఉన్న రైల్వేట్రాక్ మీదుగా ఇదివరకు స్థానికులు రాకపోకలు సాగించేందుకు అనువుగా రోడ్డు ఉండేదని, ఇటీవల ఈ రహదారిని రైల్వే అధికారులు మూసివేశారని, దీంతో రాకపోలు సాగించేందుకు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీకి వివరించారు. ఆర్‌ఓబీ మీద నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఫుట్‌ఓవర్‌బ్రిడ్జీ నిర్మాణం చేపడితే ప్రజల సమస్య తీరుతుందని చెప్పారు. అలాగే ఆర్‌ఓబీ సమీపంలో ఈ రైల్వే ట్రాక్‌కు ఆనుకుని రైల్వేకు సంబంధించిన సుమారు 10 ఎకరాలు ఉందని, ఈ స్థలంలోకి గరివిడి రైల్వేస్టేషన్‌ను తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ సమస్యలను రైల్వే డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఎంపీటీసీ యడ్ల సూర్యారావు, నాయకులు వలిరెడ్డి లక్ష్మణ నీలాద్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శృంగవరపుకోట: వారంతా 38 ఏళ్ల క్రితం వేపాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 38 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం పేరిట శృంగవరపుకోట మండలంలో కాపుసోంపురం గ్రామంలో ఆదివారం కలుసు కున్నారు. దశాబ్దాల తర్వాత కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకిరించుకుని, పరస్పరం యోగక్షేమాలు, కుటుంబ సభ్యుల గురించి తెలుసుకున్నారు. తమతో చదువుకున్న వారిలో చనిపోయిన మిత్రులకు నివాళి అర్పించారు. తర్వాత నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. ఆర్థికంగా వెనుకబడిన తమ మిత్రుల్లో కొందరికి ఆర్థిక చేయూత ఇవ్వాలని, ఇక నుంచి ప్రతీ ఏటా ఒక రోజు తప్పక కలుసుకోవాలని తీర్మానించారు.

అధికారుల నిర్లక్ష్యంతో అందని వైద్య సేవలు

- నగరపంచాయతీ పరిధి 8 సచివాలయాల్లో హెల్త్ కార్యదర్శులు లేని వైనం
- నియామకాలు చేపట్టాలని కలెక్టర్‌కు విన్నవించిన కమిషనర్

నెల్లిమర్ల:

నగర పంచాయతీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో హెల్త్ కార్యదర్శులు లేకపోవడంతో పట్టణ వాసులకు సక్రమంగా వైద్యారోగ్య సేవలు అందడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కడి 8 వార్డు సచివాలయాల్లోనూ ఆరోగ్య కార్యదర్శుల నియామకా లు జరగలేదు. కొన్నాళ్ల పాటు ఇన్‌చార్జ్‌లను నియమించి నప్పటికీ తాజాగా చేపట్టిన బదిలీల ప్రక్రియ లో అందరూ ఇతర సచివాలయాలకు వెళ్లిపోయా రు. దీంతో మూడు నెలలుగా పట్టణంలోని 8 వార్డు సచివాలయాల్లోనూ ఆరోగ్య కార్యదర్శులు లేని పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..

నెల్లిమర్ల నగర పంచాయతీలోని 20 వార్డుల్లో 31 వేల మంది ప్రజలుండగా.. వీరికి సేవలందించేందుకు ఎనిమిది వార్డు సచివాలయాలున్నాయి. సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు సక్రమంగానే అందుతున్నప్పటికీ అధికారుల తప్పిదంతో వైద్య, ఆరోగ్య సేవలు అందించడానికి ఆరోగ్య కార్యదర్శులు మాత్రం అందుబాటులో లేరు. ఆరోగ్య కార్యదర్శుల పోస్టులు మొదట్నుంచీ లేకపోవడంతో పట్టణవాసులకు సక్రమంగా సేవలందడం లేదు. పరిస్థితిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి దృష్టికి నగర పంచాయతీ అధికారులు గతంలోనే తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల నుంచి డిప్యుటేషన్‌పై ఆరోగ్య కార్యదర్శులను ఇక్కడి సచివాలయాల్లో నియమించేలా చర్యలు చేపట్టారు. వారంతా ఈ ఏడాది సెప్టెంబర్ వరకు వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించారు. అయితే సెప్టెంబర్‌లో నిర్వహించిన బదిలీల ప్రక్రియలో వీరంతా వేర్వేరు సచివాలయాలకు వెళ్లిపోయారు. దీంతో గత మూడు నెలలుగా ఇక్కడి 8 వార్డు సచివాలయాల్లో ఆరోగ్య కార్యదర్శులు అందుబాటులో లేరు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నగర పంచాయతీ కమిషనర్ వివరించారు. వార్డు సచివాలయాలకు రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఇదే విషయమై నెల్లిమర్ల నగరపంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సాక్షితో మాట్లాడుతూ, పట్టణ పరిధిలోని 8 వార్డు సచివాలయాల్లో ఆరోగ్య కార్యదర్శులు లేని మాట వాస్తవమేనన్నారు. పోస్టులు మంజూరు చేయాలని తాజాగా కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.



నగర పంచాయతీ కార్యాలయం

సీఎం పుట్టిన రోజున మెగా వైద్య, రక్తదాన శిబిరాలు

- నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- మహిళలకు ఆటలు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు
- విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు



చీపురుపల్లి: వైద్య, రక్తదాన శిబిరాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చీపురుపల్లి: ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలో మూడురోజుల పాటు వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 19న సోమవారం మండల స్థాయిలో మహిళలకు ఆటల పోటీ లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు విలువైన బహుమతులు అందజేయ నున్నట్లు స్పష్టం చేశారు. అలాగే సీఎం జగన్ మూడున్నరేళ్ల సంక్షేమ పరిపాలనపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 8, 9 10 తరగతుల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించన్నునట్లు చెప్పారు. ఈ నెల 20న వివిధ ప్రభు త్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటడం, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 21న మండల పరిషత్ కార్యాల యం ఆవరణలో మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే కేక్ కటింగ్ ఉంటుందన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పం చ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, ఇప్పిలి గోవింద, కొణిశ కృష్ణంనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, పనస అప్పారావు, అధికార్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

21 గజపతినగరంలో రక్తదాన శిబిరం

బొండపల్లి: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకని ఈనెల 21న నియోజకవర్గకేంద్రం గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలు సేవా కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్న ట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలా ల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల కన్వీనర్ లు, ఏఎంసీ, పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు హాజరు కావాలని కోరారు.

ఉభయ రాష్ట్రాల మధ్య మరో హైవే

- కల్వకుర్తి నుంచి జమ్మలమడుగు నాలుగు లేన్ల రహదారి
- 255 కి.మీ.. రూ.4,706 కోట్లు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానిస్తూ మరో జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి నుంచి మన రాష్ట్రంలోని వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు 255 కి.మీ. మేర నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆమోదించింది. రూ.4,706 కోట్ల అంచనా వ్యయంతో ఈ రహదారి నిర్మించనున్నారు. రహదారిలో అంతర్భాగంగా ఇప్పటికే కృష్ణా నదిపై వంతెన నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ల ప్రక్రియ చేపట్టింది. కాగా, రెండు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నాలుగు లేన్ల రహదారి నిర్మాణ ప్రక్రియ కూడా తాజాగా చేపట్టింది.

రహదారి నిర్మాణం ఇలా...

తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే 255 కి.మీ. రహదారి(ఎన్‌హెచ్167కె)ని ఏడు ప్యాకేజీల కింద నిర్మిస్తారు. అందులో తెలంగాణలో 91 కి.మీ. రహదారిని రూ.2,406 కోట్లతో నిర్మించేందుకు డీపీఆర్‌ను రూపొందించారు. మొదటి ప్యాకేజీ కింద రూ.886.69 కోట్లు, రెండో ప్యాకేజీ కింద రూ.1,082.40 కోట్లు, మూడో ప్యాకేజీ కింద రూ.436.91కోట్లతో పనులు చేపట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ల ప్రక్రియ చేపట్టనుంది. ఇక ఏపీలో 164 కి.మీ. మేర రూ.2,300 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణానికి ప్రణాళికను రూపొందించారు. మొత్తం నాలుగు ప్యాకేజీల కింద నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు ఈ రహదారిని నిర్మిస్తారు. అందులో మొదటి ప్యాకేజి కింద 62.57 కి.మీ. మేర రహదారి నిర్మాణానికి రూ.785 కోట్లతో పనులకు డీపీఆర్‌ను తాజాగా ఖరారు చేశారు. మిగిలిన మూడు ప్యాకేజీల కింద పనులను రూ.1,515 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ డీపీఆర్‌ను రూపొందిస్తోంది. నాలుగు ప్యాకేజీల డీపీఆర్‌లు ఖరారు అయ్యాక 2023 ఫిబ్రవరి మొదటి వారంలో టెండర్ల ప్రక్రియ చేపట్టి ఏడాదిన్నరలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది.

జిమ్నాస్టిక్స్‌లో ఏపీకి స్వర్ణం

- కబడ్డీ, ఆర్చరీలోనూ ప్రతిభ చాటిన ఆంధ్రా మన్యం బిడ్డలు
- సందడిగా సాగుతున్న ఏకలవ్య ఆదర్శ గురుకులాల జాతీయ క్రీడలు


గుజరాత్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల మధ్య జరిగిన హాకీ మ్యాచ్

సాక్షి, అమరావతి: ఏకలవ్య ఆదర్శ గురుకులాల విద్యార్థుల మూడవ జాతీయ క్రీడా పోటీల్లో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్లు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. విజయవాడలోని లయోలా కాలేజీ, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణాల్లో ఆదివారం పలు ఈవెంట్లలో పోటీలు జరిగాయి. జిమ్నాస్టిక్స్ అండర్–14 (బాలుర ఈవెంట్ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్) విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన వి.లక్ష్మణ్‌రెడ్డి (ఆంధ్రప్రదేశ్) స్వర్ణపతకం సాధించారు. కె.క్రోనాల్ (మహారాష్ట్ర) రజతం, బి.ఆదిత్య (మధ్యప్రదేశ్) కాంస్య పతకాలు పొందారు. జిమ్నాస్టిక్స్ అండర్–14 (బాలికల ఈవెంట్ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్) విభాగంలో బి.అమూల్య (తెలంగాణ) స్వర్ణం సాధించగా.. కె.తేజస్వి (ఆంధ్రప్రదేశ్) రజతం, ఎం.జ్యోతిక కాంస్యం గెలుచుకున్నారు. జిమ్నాస్టిక్స్ అండర్–19 (బాలుర ఈవెంట్ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్)లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జె.చిరంజీవి, బాలికల విభాగంలో పి.సావిత్రి రజత పతకాలు సాధించారు. బి.రాజు (మధ్యప్రదేశ్) స్వర్ణం, డి.దేవ్ (మధ్యప్రదేశ్) కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో ఎ.వైష్ణవి (తెలంగాణ) స్వర్ణం, అంకిత (మహారాష్ట్ర) కాంస్య పతకాన్ని సాధించారు.

కబడ్డీలో సత్తా చాటిన తెలంగాణ

కబడ్డీ బాలుర విభాగంలో తెలంగాణ, కబడ్డీ పూల్–బి రెండో మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ విజయం సాధించాయి. బాలికల విభాగం పూల్–బీ కబడ్డీ పోటీల మొదటి మ్యాచ్‌లో తెలంగాణ, రాజస్థాన్ జట్లు విజయం సాధించాయి. బాలుర (అండర్–19) పూల్‌లో తెలంగాణ, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. బాలికల (అండర్–19) పూల్‌లో తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్లు విజయం సాధించాయి.

ఆర్చరీలో చెలరేగిన మన్నెం వీరులు

ఆర్చరీ 20 మీటర్ల కేటగిరీ అండర్–14 (బాలుర)లో 297 పాయింట్లతో రాజస్థాన్‌కు చెందిన ఆయూష్ చర్పోటా మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 291 పాయింట్లతో రెండో స్థానంలో జార్ఖండ్‌కు చెందిన ఆజాద్ కుశల్ బాస్కే, 289 పాయింట్లతో మూడవ స్థానంలో రాజస్థాన్‌కు చెందిన హిమ్మత్ ఖాదియా నిలిచారు. 20 మీటర్ల కేటగిరీ అండర్–14 (బాలికల)లో 288 పాయింట్లతో అగ్రస్థానంలో ఉత్తరాఖండ్‌కు చెందిన వైష్ణవి జోషి, 253 పాయింట్లతో రెండవ స్థానంలో తెలంగాణకు చెందిన సనప మమత, 242 పాయింట్లతో మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బసాయ్ ప్రీతి నిలిచారు. 30 మీటర్ల కేటగిరీ అండర్ –14 (బాలుర)లో 299 పాయింట్లతో జార్ఖండ్‌కు చెందిన ఆజాద్ కుశల్ బాస్కే వీర విజృంభణ చేసి మొదటి స్థానంలో నిలిచాడు. 298 పాయింట్ల స్వల్ప తేడాతో రెండో స్థానంలో రాజస్థాన్‌కు చెందిన హిమ్మత్ ఖాదియా, 265 పాయింట్లతో మూడవ స్థానంలో రాజస్థాన్‌కు చెందిన రంజిత్ నిలిచారు. 30 మీటర్ల కేటగిరీలో అండర్ –14 (బాలికల)లో 232 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బసాయ్ ప్రీతి మొదటి స్థానం కైవసం చేసుకుంది. 226 పాయింట్లతో ఉత్తరాఖండ్‌కు చెందిన వైష్ణవి జోషి, 216 పాయింట్లతో తెలంగాణకు చెందిన సనప మమత రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఆర్చరీ గ్రూప్ (4) అండర్–14(బాలుర)లో 1,669 పాయింట్లతో రాజస్థాన్‌కు చెందిన హిమ్మత్ ఖాదియా, అయూష్ చర్పోట, రంజిత్, సునీల్ బృందం మొదటి స్థానంలో నిలిచింది. 1,399 పాయింట్లతో జార్ఖండ్, 1,383 పాయింట్లతో ఛత్తీస్‌గఢ్ బృందాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఆర్చరీ గ్రూప్ (4) అండర్–14 విభాగం (బాలికల)లో 1,166 పాయింట్లతో తెలంగాణ సనప మమత, మందరకల నవ్యశ్రీ, కుంజ భవ్యశ్రీ, పొట్ట ప్రవల్లిక బృందం మొదటి స్థానంలో నిలిచింది. 1,056 పాయింట్లతో ఉత్తరాఖండ్, 999 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ బృందాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

• తెలంగాణ

విదేశీ కొలువు.. బహు సులువు

పెరిగిన లైసెన్స్‌డ్ రిక్రూటింగ్ ఏజెన్సీలు

- వలస కార్మికులకు వీసా, ఇమ్మిగ్రేషన్‌కు వెసులుబాటు
- తగ్గనున్న నకిలీ ఏజెంట్ల మోసాలు

మోర్తాడ్(బాల్కొండ): కరోనా కల్లోలం నుంచి తేరుకున్న తర్వాత భారత్ నుంచి విదేశాలకు వలసలు పెరిగాయి. ఇందుకు అనుగుణంగా లైసెన్స్‌డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. విదేశాంగ శాఖ వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం 2020కి ముందు తెలంగాణలో రిక్రూటింగ్ ఏజెన్సీల సంఖ్య 33 ఉండగా.. ఇప్పుడు 140కి చేరింది. ఇందులో 101 ప్రధాన కార్యాలయాలు కాగా మరో 39 వాటి శాఖలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో 11 ఏజెన్సీలుండగా ఇప్పుడు 25 ప్రధాన కార్యాలయాలు, వాటికి అనుబంధంగా 30 శాఖలు ఏర్పాటయ్యాయి. లైసెన్స్‌డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల సంఖ్య పెరగడం వల్ల విదేశాలకు చట్టబద్ధంగా వెళ్లడానికి అవకాశం కలుగుతుంది. నకిలీ ఏజెంట్ల వల్ల మోసపోకుండా ఉండటానికి అవకాశం ఉంటుంది.

లైసెన్స్‌ల జారీలో సడలింపులతో..

గతంలో రిక్రూటింగ్ ఏజెన్సీ లైసెన్స్ పొందాలంటే రూ.50 లక్షల బ్యాంక్ గ్యారంటీని సమర్పించాల్సి వచ్చేది. ఇలా పొందిన లైసెన్స్‌తో ఇమ్మిగ్రేషన్ చట్టాలకు లోబడి వెయ్యి మందిని విదేశాలకు పంపించడానికి అవకాశం ఉండేది. లైసెన్స్ జారీ విధానంలో విదేశాంగ శాఖ సడలింపులు ఇవ్వడంతో రిక్రూటింగ్ ఏజెన్సీల విస్తరణకు అవకాశం ఏర్పడింది. ఇప్పుడు లైసెన్స్ పొందాలంటే రూ.8 లక్షల బ్యాంకు గ్యారెంటీ సమర్పిస్తే సరిపోతుంది. వంద మందిని విదేశాలకు పంపించడానికి అవకాశం ఉంటుంది. విదేశాలకు పంపించే వారి సంఖ్యను పెంచుకోవాలంటే బ్యాంక్ గ్యారంటీని పెంచుకోవలసి ఉంటుంది.

300కు మించి నకిలీ ఏజెంట్లు

విదేశాంగ శాఖ లైసెన్స్‌డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల వివరాలతో పాటు నకిలీ ఏజెంట్లు, ఏజెన్సీల పేర్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాలలో 300కు మించి నకిలీ ఏజెంట్లు ఉన్నారు. మోసపోయినవారి ఫిర్యాదుల ఆధారంగా నకిలీ ఏజెంట్ల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో తాము మోసపోయినట్లు కొంతమంది ఫిర్యాదు చేయగా.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించకుండానే విదేశాంగ శాఖ లైసెన్స్ పొందిన ఏజెన్సీలను కూడా నకిలీ ఏజెంట్ల జాబితాలో కలిపేసి వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. లైసెన్స్‌డ్ ఏజెన్సీల ద్వారా గల్ఫ్ ఇతర దేశాలకు వెళ్లిన వారు ఒప్పందం ప్రకారం పని, వేతనం ఉన్నా.. బద్ధకంతో ఇంటిదారి పట్టి తప్పుడు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. అలాంటి వారు ఇచ్చిన ఫిర్యాదులలో వాస్తవాలను గుర్తించకపోవడంతో కొన్ని లైసెన్స్‌డ్ ఏజెన్సీలను నకిలీ ఏజెన్సీల జాబితాలో నమోదు చేయడం వల్ల విదేశాంగ శాఖకు చెడ్డ పేరు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇమిగ్రేషన్ చట్టాలను పక్కాగా అమలు చేస్తే నకిలీ ఏజెంట్లు, ఏజెన్సీల ఆటకట్టించడానికి అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

• తెలంగాణ

రెండుగా చీలిన టీ కాంగ్రెస్!

- పీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి 'తిరుగుబాటు' సీనియర్ల డుమ్మా
- మరోవైపు పార్టీ పదవులకు రేవంత్ అనుచరుల రాజీనామా
- ఈ అంశాలపై ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీలో గరంగరం

సాక్షి, హైదరాబాద్: అంతర్గత విభేదాలతో తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రెండుగా చీలింది. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన కీలకమైన టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి పార్టీ సీనియర్ నేతలు హాజరుకాలేదు. మరోవైపు తమపై సీనియర్లు చేసిన ఆరోపణలు బాధించాయంటూ రేవంత్ అనుచరులు 12 మంది పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సీతక్క(ఎమ్మెల్యే), వేం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సీహెచ్ విజయరమణారావు, దొమ్మాటి సాంబయ్య, వజ్రేష్ యాదవ్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, చారగొండ వెంకటేశ్, పటేల్ రమేశ్‌రెడ్డి, సత్తుపల్లి మల్లేశ్, చిలుక మధుసూదన్‌రెడ్డి, శశికళ యాదవరెడ్డి ఉన్నారు. ఈ మేరకు వారు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌కు లేఖ రాశారు. అందులో సీనియర్ల వ్యవహారశైలిని తప్పుపట్టారు. శనివారం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నివాసంలో సమావేశమైన ఎంపీ ఉత్తమ్, భట్టి, దామోదర రాజనర్సింహ, మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డి, ఇతర సీనియర్ నేతలు.. వలస నేతల వల్ల అసలైన కాంగ్రెస్ నాయకులకు అవకాశం లేకుండా పోతోందని వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. దీనికి ప్రతిగా రేవంత్ అనుచరులు రాజీనామా అస్త్రం సంధించారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ రెండు అంశాలు వేడి సృష్టించాయి. ఈ సమావేశంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్, సీఎల్పీ మాజీ చీఫ్ జానారెడ్డి, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, పొన్నం ప్రభాకర్, బలరాంనాయక్, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్లు శనివారం మీడియా ముందు చేసిన ఆరోపణలు, దానికి ప్రతిగా 12 మంది నేతల రాజీనామా అంశంపై చర్చించాలని పలువురు నేతలు పట్టుబట్టినట్టు తెలిసింది. అయితే వారిని రేవంత్‌రెడ్డి వారించి.. భారత్‌జోడో యాత్ర, ఆ తర్వాత జరగాల్సిన 'హాత్‌సే హాత్ జోడో యాత్ర' గురించి మాత్రమే చర్చించాలని సర్దిచెప్పారు.

రేవంత్ పాదయాత్రకు గ్రీన్‌సిగ్నల్

చాలా మంది సీనియర్లు గైర్హాజరైన ఈ భేటీలో ఏఐసీసీ ఆదేశాల మేరకు అంటూ.. జనవరి 26 నుంచి చేపట్టే 'మార్పు కోసం యాత్ర'కు సమావేశం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ యాత్ర చేపట్టనున్నారు. భారత్‌జోడో యాత్రను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా పార్టీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు నేతలు వెల్లడించారు.

22 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

ఎన్టీఆర్ స్టేడియంలో 320 స్టాళ్లతో ఏర్పాటు చేయనున్న నిర్వాహకులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని వివిధ రకాల సాహిత్యాన్ని ఏటా ఒక్కచోటకు తెచ్చే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన మరోసారి పుస్తకప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి జనవరి ఒకటి వరకు 35వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎన్టీఆర్ స్టేడియంలో జరగనుంది. కోవిడ్ దృష్ట్యా సందర్శకుల ఆదరణ పెద్దగా ఉండదన్న ఉద్దేశంతో నిర్వాహకులు గతేడాది 260 స్టాళ్లనే ఏర్పాటు చేసినప్పటికీ పుస్తకప్రియులు భారీగా తరలిరావడంతో ప్రదర్శన విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఈసారి 320 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్ తెలిపారు.

లారీ ఢీకొని తుక్కు వ్యాపారి దుర్మరణం


ప్రమాద స్థలంలో గాయాలతో సత్యం

పరవాడ(పెందుర్తి): పరవాడ–లంకెలపాలెం రహదారిలో లంకెలపాలెం ఫ్లై ఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా రాజాం మండలం అంబాడ వెంకటాపురానికి చెందిన పల్లి సత్యం (52) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లి సత్యం అగనంపూడిలో నివాసం ఉంటూ తుక్కు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై ఫార్మాసిటీకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. లంకెలపాలెం వంతెనపై సత్యం ప్రయాణిస్తుండగా ద్విచక్ర వాహనాన్ని వెనకనే వస్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఆయనకు భార్య దయమంతి, కుమారులు సాయి, దినేష్ ఉన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య కుమారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించినట్లు పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

ఆటో, బైక్ ఢీకొని నలుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటరమణ

పార్వతీపురం: ఒడిశాలోని రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన యడ్ల వెంకటరమణ కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వస్తుండగా ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగి నలుగురు గాయపడ్డారు. వివరిలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి వారు పార్వతీపురం వస్తుండగా అదే రహదారిలో కొమరాడ నుంచి కూనేరు వెళ్తున్న ఆటో, కొమరాడ గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలో వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వెంకటరమణ, భార్య కవిత, కుమారుడు హర్షవర్ధన్‌తో పాటు 16 నెలల కుమార్తె చైతన్య చెల్లాచెదురుగా పడిపోవడంతో నలుగు రికి పలుచోట్ల తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి బాధితులను తరలించి చికిత్స అందించారు.

సాక్షి స్పెల్ బీకి విశేష స్పందన


పరీక్షలు రాస్తున్న కేటగిరి–4 విద్యార్థులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): సాక్షి మేథ్స్‌బీకి, స్పెల్‌బీకి విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఆదివారం ఎస్‌ఏడీ రామకృష్ణ పాఠశాలలో ప్రధాన ప్రయోజకులు డ్యూక్స్ వాఫీ, సహ ప్రయోజకులు రాజమహేంద్రవరానికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ సూల్ సౌజన్యంతో సాక్షి స్పెల్‌బీ, సాక్షి మేథ్స్‌బీ పరీక్షలు జరిగాయి. మేథ్స్‌బీ పరీక్షలకు 227 మంది హాజరయ్యారు. నాలుగు కేటగిరీల్లో కేటగిరి–1లో 26 మంది, కేటగిరి–2లో 37 మంది, కేటగిరి–3లో 100 మంది, కేటగిరి–3లో 64 మంది పోటీ పడ్డారు. అనంతనం జరిగిన స్పెల్‌బీ పరీక్షలకు 230 మంది హాజరు కాగా.. మొదటి కేటగిరిలో 16 మంది, రెండో కేటగిరిలో 39 మంది, మూడో కేటగిరిలో 103 మంది, నాలుగో కేటగిరిలో 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 17 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడి ఏర్పాట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భాషపై పట్టు వస్తుంది..



సాక్షి స్పెల్ బీ పరీక్షలు రాయడం వల్ల భాషపై పట్టు వస్తుంది. దీంతో మక్కువగా కూడా పెరుగుతోంది. భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఇది దోహద పడుతుంది. తుదివరకు వెళ్తానని నమ్మకంతో ఉన్నా.

– డి.మోక్షిత్, 4వ తరగతి, గాజువాక

సులువైన పద్ధతులు నేర్చుకున్నా..



మేథ్స్‌బీకి ప్రిపరేషన్ వల్ల సులువైన పద్ధతులు నేర్చుకోగలుగుతున్నా. మేథ్స్‌బీతో పాటు స్పెల్‌బీ కూడా రాస్తున్నాను. కొత్త విషయాలు, పద్ధతులు నేర్చుకునే అవకాశం కలిగింది.

– కె.గౌతం కిషోర్, 6వ తరగతి, రవీంద్ర భారతి స్కూల్, సుజాతానగర్

పదాలు పలకడం తెలిసింది



స్పెల్‌బీ పరీక్షల వల్ల ఇంగ్లిష్ పదాలు పలకడంతో పాటు వాటి అర్థాలు తెలుసుకోగలిగాను. దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. భాష మీద పట్టు సాధించగలుగుతున్నాం. ఇది చాలా బాగుంది.

– ఈహెచ్.లిసిత్, 6వ తరగతి, రామకృష్ణ పాఠశాల, ఎస్‌ఏడీ

సాక్షికి కృతజ్ఞతలు



సాక్షి స్పెల్‌బీ పరీక్షల ద్వారా ఇంగ్లిష్‌లో కొత్త పదాలు, వాటి అర్థాలు తెలిశాయి. అంతే కాకుండా వాటిని ఏవిధంగా పలకాలో తెలిసింది. ఈ పరీక్షల కారణంగా కొత్త పదాల కోసం నిత్యం వెతుకుతున్నాం. ఈ పరీక్షలు నిర్వహించిన సాక్షికి కృతజతలు.

– వైఎస్‌జీ ప్రణీత, 8వ తరగతి, కేకేఆర్ గౌతం పాఠశాల

ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు


ప్రవచనాలు చెబుతున్న వేణురామానుజదాసు

ఎచ్చెర్ల క్యాంపస్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంలో తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతున్నాయి. జనవరి 14వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయి. రోజూ రాత్రి ఏడు నుంచి 8.30 గంటలు వరకు ప్రవచనాలు చెబుతున్నారు. భక్తులు పాల్గొని ధనుర్మాస పవిత్రత, ప్రాధాన్యత తెలుసుకుంటున్నారు. టీటీడీ నియమించిన ప్రవచకులు పి.వేణురామానుజదాసు ఫరీదుపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో, లక్ష్మీడిపేట సీతారామస్వామి ఆలయంలో ఎం.కూర్మరామానుజదాసు, పెయ్యిలవానిపేట రామంద్రస్వామి ఆలయంలో పి.కృష్ణారావు రామానుజదాసు ప్రవచనాలు చెబుతున్నారు.

యోగా పోటీలకు విశేష స్పందన




రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు (ఇన్‌సెట్లో) యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పార్వతీపురం టౌన్:

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు యోగా కో ఆర్డినేటర్ మోహన్ గంటాయత్, కె.జనార్దన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని జట్టు ఆశ్రమంలో నిర్వహించిన జిల్లా యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 40 మంది విద్యార్థుల్లో 24 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. 8–12 సంవత్సరాలు, 12–14 సంవత్సరాల వయస్సు గల వారు తిరుపతిలో, 14–17 సంవత్సరాలు, 17–21 సంవత్సరాల వయస్సు గల వారు కాకినాడలో ఈ నెల 25న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన రేవతి, గౌతమి, దేవి, సౌజన్యలను జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ అభినందించారు.

ఉత్కంఠ భరితంగా జేపీఎల్ క్రికెట్ పోటీలు


జేపీఎల్ క్రికెట్ పోటీల్లో సాధించిన జట్టుకు అభినందనలు తెలుపుతున్న నిర్వాహకులు అవనాపు విక్రమ్

విజయనగరం: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన దంపతుల ఆధ్వర్యంలో అయోధ్య మైదానంలో జేపీఎల్ క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. జగనన్న ప్రీమియర్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో సోమవారం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే రెండు, మూడు రౌండ్లలో అత్యధిక పరుగులతో అత్యధిక వికెట్ల తేడాతో గెలుపొంది అత్యధిక రన్‌రేట్ కలిగిన పూల్ బాగ్ పైరేట్స్, పవర్‌థండర్స్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో గెలుపొందిన జట్లతో ఈ రెండు జట్లు పోటీపడి గెలుపొందిన జట్లు ఫైనల్స్‌కు చేరనున్నాయి. ఫైనల్స్ మంగళవారం అతిరథ మహారథుల సమక్షంలో జరగనున్నాయి. గెలుపొందిన జట్టుకు రూ.50వేల బహుమతితో పాటు ట్రోఫీని అందజేస్తారు. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్ పోటీల్లో పవర్ థండర్స్, అంబేద్కర్ లెవెన్స్, టీసీ స్మాషర్స్ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ కు అర్హత సాధించాయి.

• క్రిస్మస్ కాంతులు



క్రిస్మస్ పండగ వచ్చేస్తోంది... విజయనగరం జిల్లా కేంద్రంలోని పలు చర్చిలు క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. పలు ఆకారాల్లో స్టార్స్ చర్చిల ముందు వేలాడుతూ చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

క్లుప్తంగా...

మాచర్లలో టీడీపీ 'ఇదేం ఖర్మ'పై... పోలీసులకు సమాచారం లేదు

- సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ
- గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ




దాడుల దృశ్యాల వీడియోను విలేకర్లకు చూపుతున్న డీఐజీ త్రివిక్రమవర్మ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పల్నాడు జిల్లా మాచర్లలోని 16వ వార్డులో ఈ నెల 16వ తేదీన టీడీపీ చేపట్టిన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమం గురించి పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ చెప్పారు. గుంటూరులోని డీఐజీ కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మాచర్ల 16వ వార్డు అత్యంత సున్నితమైన ఏరియా. అక్కడ పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉంది. సభలు, సమావేశాలు, కార్యక్రమాలు నిర్వర్తించే క్రమంలో పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలి. అలా ఇస్తే విధిగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. 16వ తేదీ సాయంత్రం 5.30 సమయంలో రెండు గ్రూప్‌ల మధ్య చోటు చేసుకున్న గొడవను విజిబుల్ ఎస్ఐ గుర్తించి, ఆందోళనకారులను చెదరగొట్టారు. పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈలోగా రాళ్ల దాడి జరిగింది. ఒక వర్గం నుంచి చల్లా మోహన్, మరోవర్గం నుంచి అంకమ్మ ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేశాం. రెండు వీడియోలలో దాడి దృశ్యాలను ఆధారంగా చేసుకుని సెక్షన్ 307 కింద కేసులు నమోదు చేశాం. చట్టాన్ని ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవు. ఈ ఘటనపై సీసీటీవీ ఫుటేజీ దృశ్యాల ఆధారంగా మరింత లోతుగా విచారణ చేస్తాం' అని డీఐజీ తెలిపారు.

పల్నాడు జిల్లా ఎస్పీని తొలగించాలి

చంద్రబాబు డిమాండ్



సాక్షి, అమరావతి/నగరంపాలెం(గుంటూరువెస్ట్): మాచర్లలో హింస, పోలీసు ఉన్నతాధికారుల స్పందనపై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాచర్ల ఘటనలో బాధితులనే నిందితులుగా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని అక్కడి నుంచి తొలగించాలని చంద్రబాబు డిమాండ్‌చేశారు. పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి స్థానంలో ఆయన కార్యాలయంలో పనిచేస్తున్న ఏ హోంగార్డును కూర్చోబెట్టినా సమర్థంగా పని చేసేవారని పేర్కొన్నారు. కాగా గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మను టీడీపీ నేతలు ఆదివారం కలిసి మాచర్లలో టీడీపీపై దాడిచేసిన వైఎస్సార్‌సీపీ వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, దేవినేని ఉమా, ఆలపాటి రాజేంద్రప్రసాద్, కొల్లు రవీంద్ర తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యంలేదన్నారు.

చంద్రబాబూ.. మీ ఆటలు సాగనివ్వం

గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీకి బీసీలు వెన్నెముకగా నిలుస్తున్నారనే అక్కసుతోనే చంద్రబాబు ఆ పార్టీ శ్రేణులతో మాచర్లలో బీసీలపై దాడులు చేయించారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి మండిపడ్డారు. పచ్చటి పల్నాడులో ఫ్యాక్షన్ కక్షలను మళ్లీ రేపి, విధ్వంసం సృష్టించడం ద్వారా రాజకీయంగా చలి కాచుకోవాలన్న బాబు ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని, లేదంటే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పథకాలు అమలు చేస్తూ.. సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెబుతూ.. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంట అన్ని వర్గాల ప్రజలు నడుస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో వార్డు స్థాయి నుంచి కేబినెట్ వరకూ బీసీలకు సింహభాగం పదవులను సీఎం ఇచ్చారని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో వడ్డెర సామాజిక వర్గానికి అత్యధిక పదవులు, రూ.4,700 కోట్లతో మాచర్ల, గురజాల నియోజకవర్గాల అభివృద్ధి, పల్నాడు జిల్లా, వైద్య కళాశాల, కొత్తగా మూడు హైవేల నిర్మాణం.. తదితర కారణాల వల్ల ఈ ప్రాంతాల బీసీలతో పాటు ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి జేజేలు పలుకుతున్నారన్నారు. దీంతో ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీని రాజకీయంగా ఎదుర్కోలేమనే నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు.. కుట్రలకు తెర తీశారని మండిపడ్డారు.

'అసైన్డ్' ప్లాట్లు అమ్ముతాం!

అమరావతిలో పచ్చ గ్యాంగ్ నయా దందా

- పరిరక్షణ సమితి నేతలదే కీలక పాత్ర
- టీడీపీ హయాంలో యథేచ్ఛగా అసైన్డ్ భూముల అక్రమాలు
- సీఐడీ దర్యాప్తుతో బండారం బట్టబయలవుతుందని బెంబేలు
- దొడ్డిదారిన ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకునే ఎత్తుగడ

సాక్షి, అమరావతి: 'ప్లాట్లు అమ్ముతాం బాబూ.. అమరావతిలో ప్లాట్లు అమ్ముతాం.. కొంత తక్కువ ధరకే ఇస్తాం.. మంచి అవకాశం.. త్వరగా వచ్చి కొనుగోలు చేయండి.' ఇదీ అమరావతి పరిరక్షణ సమితిలో కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు నేతల తాజా నినాదం. ఇందులో విశేషం ఏముందీ అంటారా.. అక్కడే ఉంది అసలు గుట్టు. అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వం సమీకరించిన భూముల్లో వారికి సంబంధించిన భూమి ఒక్క సెంటు కూడా లేదు. కానీ ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చినట్టుగా కనికట్టు చేసి ప్లాట్లు పొందారు. ఈ బండారం సీఐడీ దర్యాప్తుతో బట్టబయలు అవుతుండటంతో గుట్టు చప్పుడు కాకుండా ఆ ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకునే యత్నాల్లో నిమగ్నమయ్యారు. అమరావతిలో మరో కొత్త భూదందాకు తెరతీశారు.

ఇదీ ఉద్యమ నేత తీరు..

ఆయన అమరావతి పరిరక్షణ సమితి ఉద్యమనేత.



టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు కనుసన్నల్లో అమరావతి ఉద్యమాన్ని నడుపుతున్నారు. అమరావతిలో ఆయనకున్న 20 ప్లాట్లను ఒక్కొక్కటిగా అమ్మకానికి పెడుతున్నారు. ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతుల జాబితాలో ఆయన పేరే లేదు. కానీ అసైన్డ్ రైతుల పేరిట అక్రమంగా ఆయనకు గత ప్రభుత్వం 20 ప్లాట్లు కేటాయించింది. రిజిస్టర్ సేల్ డీడ్ కింద వాటిని ఆయన పేరిట రిజిస్టర్ చేశారు. అవన్నీ తుళ్లూరు మండలం మందడం పరిధిలోనివే కావడం గమనార్హం. సర్వే నంబర్లు 199, 133, 131, 242, 236, 321, 308, 307, 268, 295, 408, 296, 413, 465తో ఉన్న ఆ ప్లాట్లను ఆయన విక్రయించేందుకు యత్నిస్తుండటం అమరావతిలో చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూములన్నీ పలువురి రైతుల పేరిట ఉన్నాయి. కానీ సీఆర్‌డీయే రికార్డుల్లో మాత్రం అమరావతి పరిరక్షణ సమితి నేత పేరిట నమోదు కావడం గమనార్హం. ఆ భూముల కొనుగోలుకు ఆసక్తి కనబరిచిన కొందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించడంతో అసలు విషయం వెలుగుచూసింది. వెంకటపాలెంలో సర్వే నంబరు 295/10, 296/5, మందడంలో సర్వే నంబరు 454/3సీ, కురగల్లులో సర్వే నంబరు 500/1లో ఉన్న ప్లాట్లు కూడా విక్రయించేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం.

964 ఎకరాల అసైన్డ్ భూములు కొల్లగొట్టారు

అమరావతి పరిధిలోని 29 గ్రామాలతో కూడిన కోర్ క్యాపిటల్ ప్రాంతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో టీడీపీ పెద్దలు అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. సీఐడీ దర్యాప్తులో ఈ బండారం మొత్తం బయటపడింది. అమరావతిలో 2014 వరకు అసైన్డ్ భూములు ఎవరి పేరుతో ఉన్నాయి? 2016లో భూ సమీకరణ కింద అసైన్డ్ భూములిచ్చినట్లు సీఆర్‌డీఏ రికార్డుల్లో పేర్కొన్న పేర్లు ఏమిటన్నది పరిశీలించినప్పుడు టీడీపీ భూ బాగోతం గుట్టు రట్టయింది. రెవెన్యూ రికార్డుల్లో అసైన్డ్ భూముల హక్కుదారుల జాబితాలో ఉన్న రైతుల పేర్లకు, సీఆర్‌డీఏకు భూములిచ్చిన వారుగా పేర్కొన్న జాబితాలోని పేర్లకు ఎక్కడా పొంతనే లేదు. బడుగు, బలహీన వర్గాల రైతుల స్థానంలో టీడీపీ పెద్దల బినామీలు, సన్నిహితుల పేర్లు కనిపించాయి. ఇలా 29 గ్రామాల పరిధిలో 964.88 ఎకరాలకు సంబంధించి భూ హక్కుదారుల పేర్లను గల్లంతు చేశారు. వాటిలో బడుగు, బలహీన వర్గాలకు కేటాయించిన అసైన్డ్ భూములు 636.75 ఎకరాలున్నాయి. వాటిలో అత్యధిక భాగం టీడీపీ పెద్దలు తమ బినామీల పేరిట కొల్లగొట్టారు. అనంతరం ఆ భూములను ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చినట్టుగా చూపించి ప్లాట్లు తీసుకున్నారు. బినామీలుగా ఉన్నందుకు కొందరు అనుయాయులకు కూడా కొన్ని ప్లాట్లు కేటాయించారు. వారిలో టీడీపీ మంత్రుల వ్యక్తిగత సహాయకులు, అమరావతి ప్రాంతంలో ఆ పార్టీ కార్యకర్తలు మొదలైన వారు ఉన్నారు. ప్రస్తుతం వారే అక్రమంగా పొందిన అసైన్డ్ ప్లాట్లను విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ఆ ప్లాట్లను ఎలా విక్రయిస్తారన్నది తాడేపల్లి, మంగళగిరిలో హాట్ టాపిక్‌గా మారింది.

సీఐడీ దర్యాప్తుతో బెంబేలు

అమరావతి అక్రమాలపై సీఐడీ దర్యాప్తుతో అసైన్డ్ దొంగలు కలవరపడుతున్నారు. మొత్తం వ్యవహారం నిగ్గు తేలితే తాము అక్రమంగా పొందిన ప్లాట్ల కేటాయింపును రద్దు చేస్తారని వారు ఆందోళన చెందుతున్నారు. దాంతో ఆ ప్లాట్లను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా టీడీపీ నిర్వహిస్తున్న అమరావతి పరిరక్షణ సమితి ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నవారే తమ ప్లాట్లను విక్రయించేందుకు యత్నిస్తుండటం గమనార్హం. భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారు మాత్రమే పాదయాత్రలో పాల్గొనాలని న్యాయస్థానం చెప్పింది. దాంతో బోగస్ అమరావతి రైతు ఉద్యమ నేతలకు ఝలక్ ఇచ్చినట్లయింది. గుర్తింపు కార్డులు లేకపోవడంతో పాదయాత్ర నిలిపివేశారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయన్నది స్పష్టత లేదు. దాంతో తాము అక్రమంగా పొందిన ప్లాట్లను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేసి సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నారు. భూమి చూపించకుండానే కేవలం సేల్ డీడ్ పత్రాలను చూపించి ప్లాట్ల విక్రయాల దందాకు తెరతీశారు. తుళ్లూరు, మందడం, ఉద్దండరాయునిపాలెం, కురగల్లు, పెనుమాక, నవులూరు తదితర గ్రామాల్లో అక్రమంగా పొందిన అసైన్డ్ ప్లాట్లను విక్రయించేందుకు లావాదేవీలు జోరందుకున్నాయి.

వెన్నుపోటుదారుడు చంద్రబాబు

ప్రముఖ కవి, దళిత ఉద్యమ నేత కత్తి పద్మారావు



మాట్లాడుతున్న కత్తి పద్మారావు

యద్దనపూడి: 'అంబేడ్కర్ అంటే ఒక వ్యక్తి కాదు.. శక్తి. ఆయన నీతి, నిజాయితీ ముందు ఎలాంటి దురలవాట్లు లేనివారు మాత్రమే నిలబడగలుగుతున్నారు. అందుకే చంద్రబాబు లాంటి వెన్నుపోటుదారుడు, కులాన్ని నమ్ముకున్నవాడు మాత్రం అంబేడ్కర్ విగ్రహానికి దండ వేస్తూ కళ్లు తిరిగి పడిపోయారు' అని ప్రముఖ కవి, దళిత ఉద్యమ నాయకుడు కత్తి పద్మారావు ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో బత్తుల కల్యాణరాజు సోదరులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కత్తి పద్మారావు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రావి రామనాథంబాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక, సాధికారత కోసం జీవితాంతం పరితపించిన మహనీయుడు అంబేడ్కర్ అని కత్తి పద్మారావు కొనియాడారు. తొలుత కత్తి పద్మారావు రచించిన 'అంబేడ్కర్ జీవిత చరిత్ర' అనే పుస్తకాన్ని మంత్రి మేరుగ ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

మాచర్ల అల్లర్లకు చంద్రబాబే కారణం

- రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకోవడం దారుణం
- తప్పు చేయకపోతే టీడీపీ నేతలు ఎందుకు పరారయ్యారు?
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- ప్రతిపక్షం వల్లే మాచర్లలో అల్లర్లు : ఎంపీ లావు
- బాధితులను పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

నరసరావుపేట: మాచర్ల అల్లర్లకు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడే కారణమని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.నరసరావుపేటలోని జీబీఆర్ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పిన్నెల్లి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం వేర్వేరుగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పిన్నెల్లి మీడియాతో మాట్లాడుతూ.. బీసీలంటే టీడీపీకి అక్కసు ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబు కొంత కాలంగా వ్యక్తిగత విమర్శలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొడుతుండటం దారుణం అన్నారు. ఇందులో భాగంగా నెలవారి మామూళ్లతో బ్రహ్మారెడ్డి అనే వ్యక్తిని నియమించారన్నారు. ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని నిలదీసిన స్థానికులను కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడి చేయడమేమిటని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారన్నారు. ఇందుకు బదులుగా వారు కర్రలు, బండరాళ్లతో దాడి చేసి, ముగ్గురు బీసీలను చంపే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయంలో పచ్చ మీడియా దుష్ప్రచారం దారుణం అని మండిపడ్డారు. వారు తప్పు చేయకపోతే గొడవ జరిగిన గంటలోనే మాచర్ల వదిలి ఎందుకు పరారయ్యారని ప్రశ్నించారు. యరపతినేని శ్రీనివాసరావు బండారం మొత్తం అందరికీ తెలుసని, అందుకే ప్రజలు మూడుసార్లు ఓడించారని.. ప్రజాభిమానంతో తాను ఐదుసార్లు గెలిచానన్నారు. యరపతినేని ఉడుత ఊపులకు ఇక్కడ భయపడేవారెవరూ లేరని స్పష్టం చేశారు. బాబు పంపించిన పేటీఎం (జూలకంటి బ్రహ్మారెడ్డి) వ్యక్తిని చూసి తాము భయపడే ప్రసక్తే లేదని, ఆయన 2009లోనే తమపై ఓడిపోయాడనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.



టీడీపీ నేతల దాడిలో గాయపడి, చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఓర్వలేకే గొడవల సృష్టి : ఎంపీ లావు

రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో పరిపాలన సాగుతుంటే, ఓర్వలేకే ప్రతిపక్షం గొడవలు సృష్టిస్తోందని ఎంపీ లావు కృష్ణదేవరాయలు అన్నారు. మాచర్లలో గత 15 ఏళ్లుగా గొడవలు లేవని చెప్పారు. రెచ్చగొట్టే రాజకీయాలు వల్ల కార్యకర్తలు, వారి కుటుంబాలు, సామాన్య ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఎక్కడా, ఎప్పుడూ రెచ్చగొట్టే రాజకీయాలు చేయలేదని తెలిపారు. మాచర్లలో ప్రస్తుతం ప్రశాంతత నెలకొందని, ఇకపై ఇలాంటి ఘటనలను ఉపేక్షించవద్దని అధికారులకు సూచించామన్నారు. మీడియా కూడా రెచ్చగొట్టే ప్రచారం చేయకూడదని విజ్ఞప్తి చేశారు.

రీ సర్వేలో కీలకంగా సర్వేయర్ల సైన్యం

వారి వల్లే విజయవంతంగా ముందుకు సాగుతున్న భూముల సర్వే

- సర్వేకి అక్కరకు వచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ
- సచివాలయాల్లో 11,600 మందిని నియమించిన ప్రభుత్వం
- పట్టణాల్లో ప్లానింగ్ సెక్రటరీలతో కలిపి 14,900 మంది సైన్యం
- సర్వేయర్లకు 50కి పైగా అంశాల్లో శిక్షణ
- సంప్రదాయ పద్ధతులకు ఆధునికతను జోడించి సిలబస్
- సులభంగా ఆకళింపు చేసుకొని సర్వేలో నిమగ్నమైన సర్వేయర్లు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన భూముల రీ సర్వేలో గ్రామ సర్వేయర్లు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ప్రభుత్వం చురుకైన యువకులకు అన్ని రకాల శిక్షణ ఇప్పించి, వారి ద్వారా ప్రాజెక్టును పకడ్బందీగా ముందుకు తీసుకెళ్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 17,460 రెవెన్యూ గ్రామాలు, 47,861 ఆవాసాలు, 110 పట్టణ, నగరాభివృద్ధి సంస్థల పరిధిలోని 1.26 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులను రీ సర్వే చేసి యజమానులకు హక్కు పత్రాలు ఇస్తున్నారు. దీనివల్ల లక్షల్లో పేరుకుపోయిన భూ వివాదాలు పరిష్కారమవుతాయి. అస్తవ్యస్తంగా ఉన్న భూమి రికార్డుల స్వచ్ఛీకరణ జరిగి డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వస్తాయి. తొలి విడతగా 2 వేల గ్రామాల్లో రీసర్వే పూర్తయి 8 లక్షల మంది రైతులకు భూ హక్కు పత్రాలు ఇచ్చారు. మిగతా ప్రాంతాల్లో కూడా రీసర్వే విజయవంతంగా జరుగుతోంది.

గ్రామ సర్వేయర్లతో కొత్త తరం

సమగ్ర రీ సర్వే కోసం వేలాది మంది సర్వేయర్లు అవసరం. ఈ కార్యక్రమం మొదలు పెట్టే నాటికి మండల సర్వేయర్లు మాత్రమే ఉండేవాళ్లు. అదీ కొన్ని మండలాల్లోనే ఉన్నారు. చాలా మండలాల్లో సర్వేయర్లు లేక ఇబ్బంది కలిగేది. ఆ సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ సమగ్ర సర్వేకి అక్కరకు వచ్చింది. సచివాలయాల్లో 11,600 మందికిపైగా సర్వేయర్లు నియమితులయ్యారు. పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు 3,300 మందిని ప్రభుత్వం నియమించింది. మొత్తంగా ఈ 14,900 మందిని సమగ్ర సర్వేలో ప్రభుత్వం వినియోగిస్తోంది. వీరందరికీ శిక్షణ ఇచ్చింది ప్రతి రెవెన్యూ డివిజన్ నుంచి ఇద్దరు మండల సర్వేయర్లు, ముగ్గురు గ్రామ సర్వేయర్లను బృందాలుగా ఏర్పాటు చేసి మొత్తం 275 బృందాలకు తొలి దశలో శిక్షణ ఇచ్చింది. వారిద్వారా వివిధ డివిజన్లలోని సర్వేయర్లు, ఇతర ఉద్యోగులకు శిక్షణ ఇప్పించింది. వారిలో 70 శాతం మంది సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు కావడంతో సర్వే అంశాలను తేలిగ్గా ఆకళింపు చేసుకున్నారు. ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా కరోనా సమయంలోనూ ఏడాదిన్నరలో 11,187 మందికి శిక్షణ ఇచ్చింది. గ్రామ సర్వేయర్లకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన మూడు రకాల డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో 94 శాతం మంది ఉత్తీర్ణులవడానికి ఈ శిక్షణ ఉపయోగపడింది.



శిక్షణ ఇలా

తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్వే అకాడమీ ద్వారా సర్వే సెటిల్మెంట్ శాఖ వీరికి శిక్షణ ఇచ్చింది. ఒక ప్రణాళిక ప్రకారం భూ సర్వేకి సంబంధించి 50కి పైగా అంశాల్లో శిక్షణ ఇచ్చింది. సంప్రదాయ సర్వే విధానాలకు ఆధునిక టెక్నాలజీని జోడించి సిలబస్ రూపొందించింది. కీలకమైన డ్రోన్ పైలట్ సర్వే, డ్రోన్ డెస్టినేషన్ సర్వే కోసం జిల్లాల్లో డ్రోన్ పైలట్, కో పైలట్‌లు గ్రామ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా మండలాల వారీగా మిగిలిన వారికి ఇవే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 679 మండలాల్లోనూ మండలానికో డ్రోన్ సర్వే ట్రైనర్‌ను నియమించారు. వీరి ద్వారానే ప్రస్తుతం డ్రోన్ సర్వే జరుగుతోంది.

రీసర్వే విజయవంతంగా జరగడానికి గ్రామ సర్వేయర్లే కారణం

సర్వే అకాడమీ ద్వారా ఆధునిక, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి అవసరమయ్యేలా సంప్రదాయ, ఆధునిక, క్షేత్ర స్థాయి ప్రత్యక్ష సర్వే విధానాలపై శిక్షణ ఇచ్చాం. దీని ఫలితంగా రీ సర్వే విజయవంతంగా జరుగుతోంది.

– సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్, ఏపీ సర్వే అకాడమీ

అబద్ధాలు చెప్పటమే అసలు దగా!

▶ మొదటి పేజీ తరువాయి

నవంబరు వరకూ... అంటే మూడున్నరేళ్లలో ఎస్సీల సంక్షేమానికి రూ.58,353.07 కోట్లు, ఎస్టీలకు 15,660.03 కోట్లు ఖర్చు చేసింది. ఇదీ ఇద్దరికీ తేడా!!.

విద్యకు ఇంత ప్రాధాన్యం ఎన్నడైనా ఉందా?

ఎస్సీ, ఎస్టీల విద్యను పట్టించుకోవడం లేదనేది రామోజీ విషప్రచారం. చంద్రబాబు హయాంలో అమలు చేసిన విదేశీ విద్య అద్యంతం అక్రమాల పుట్ట. నకిలీ విదేశీ వర్సిటీలను చూపించి తమ వారి ఖాతాల్లోకే డబ్బులు మళ్లించేశారు. ఇది విజిలెన్స్ విచారణలోనూ వెలుగుచూసింది. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో విదేశాలకు వెళ్లేవారు రాష్ట్రానికి పేరు తెచ్చేలా... ఇక్కడి సంపదను పెంచేలా ఉండాలని భావించిన ముఖ్యమంత్రి జగన్... ప్రపంచంలోని టాప్-100 వర్సిటీల్లో సీట్లు సాధించినవారికి పూర్తి ఫీజును రీఇంబర్స్ చేస్తామని ప్రకటించారు. టాప్-200 వర్సిటీల్లో చేరినవారికి రూ.50 లక్షల సాయం ప్రకటించారు. అంతేకాదు. నాడు-నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, వసతి దీవెన వంటి అనేక పథకాల ద్వారా విద్యావకాశాలు, మౌలిక వసతులను మెరుగుపరిచింది.

- రాష్ట్రంలోని స్టడీ సర్కిల్స్ ద్వారా విశాలో సివిల్ సర్వీసెస్, విజయవాడలో గ్రూప్-1, తిరుపతిలో బ్యాంకు పోస్టులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్టడీ సర్కిల్స్‌లో ఈ ఏడాది ఆగస్టు వరకు 10,976 మందికి ఎస్సీ విద్యార్థుల కోసం రూ.12.75 కోట్లు ఖర్చు చేశారు.
- ఎస్సీ గురుకులాలకు టీడీపీ హయాంలో 9 ఐఐటీ, 19ఎన్ఐటీ, 18 ఎంబీబీఎస్ సీట్లు వస్తే... ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు 57ఐఐటీ, 101ఎన్ఐటీ, 40ఎంబీబీఎస్ సీట్లు సాధించారు ఎస్సీ విద్యార్థులు. దీన్నిబట్టే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. అదే తీరులో గిరిజన సంక్షేమ గురు కులాలనూ ప్రోత్సాహించటంతో గతేడాది 30 మంది ఐఐటీ, 59 మంది ఎన్ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించారు.

పథకాల్లో సింహభాగం...

ఎన్నికల మేనిఫెస్టోనే పవిత్ర గ్రంథంలా భావించి చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ప్రభుత్వం... 2019 జూన్ నుంచి ఇప్పటివరకు రకరకాల పథకాలతో ఎస్సీ, ఎస్టీలకు గరిష్ఠ ప్రయోజనాన్ని చేకూర్చింది.

- ఎస్సీ,ఎస్టీల వివాహాలు, కులాంతర వివాహాలకు ఎన్నికలకు 3 నెలల ముందు పథకాన్ని ప్రకటించిన చంద్రబాబు... ఒక్కరికైనా ఇస్తే ఒట్టు. బాబు ప్రకటించిన మొత్తాలను సీఎం జగన్ రెట్టింపు చేశారు.

	ఎస్సీలు	ఎస్టీలు	అందిన మొత్తం (రూ.కోట్లలో)
డీబీటీ	1,16,50,761	35,79,541	38,605.33
నాన్-డీబీటీ	56,32,045	18,09,918	35,407.77
మొత్తం	1,72,82,806	53,89,459	74,013.10

రుణాల మంజూరు కనిపించదా రామోజీ?

- ఈ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధి, జీవనోపాధి మెరుగుదల కోసమిచ్చే రుణాలు 53 శాతం పెరిగాయి. ఇది సాక్షాత్తూ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ తాజా నివేదిక చెప్పిందే. - 'జగనన్న తోడు' పథకం కింద చిన్న వ్యాపారాలు చేసుకునే 9.05 లక్షల మందికి రుణాలివ్వగా... ఈ ఏడాది మూడో దశలో ఏకంగా 9 లక్షల మందికి రుణాలివ్వాలని లక్ష్యించారు. వారిలో 5.10 లక్షల మందికి ఇప్పటికే రుణాలిచ్చారు. ఈ రుణాలపై వడ్డీ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 32.51 కోట్లను బ్యాంకులకు చెల్లించింది.

ఎస్సీ, ఎస్టీలకు మూడేళ్లలో ఇచ్చిన రుణాలివీ...

ఏడాది	రుణ మొత్తం రూ.కోట్లలో)
2019-20	15,791
2020-21	18,689
2021-22	28,577

రాజకీయాల్లో సముచిత స్థానం...

వాడుకుని వదిలేయడానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అడుగడుగునా నిర్లక్ష్యమే ఎదురైంది. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీల రాజకీయ సాధికారతలో కొత్త అధ్యాయం లిఖిస్తున్నారనటానికి కేబినెట్లో వారికిచ్చిన స్థానమే నిదర్శనం. తొలి కేబినెట్లో 56 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను రెండవ విడతలో 70 శాతానికి తీసుకెళ్ళారు. ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులిస్తే వారిలో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే. పెద్దల సభ శాసన మండలి చైర్మన్‌గా కొయ్యే మోషేన్‌రాజు (ఎస్సీ), వైస్ చైర్మన్‌గా జకియాఖానం (మైనారిటీ), అసెంబ్లీ స్పీకర్‌గా తమ్మినేని సీతారాం(బీసీ)ను ఉన్నతస్థానాల్లో కూర్చోబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. 32 మంది వైసీపీ ఎమ్మెల్సీల్లో 18 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలేనంటే... ముఖ్యమంత్రి జగన్ వారికిచ్చిన ప్రాధాన్యమేంటో తెలియకమానదు.

ప్రత్యేక కార్పొరేషన్లతో అభివృద్ధికి ఊతం...

ఎస్సీ, ఎస్టీలకు వేరువేరు కార్పొరేషన్లతో పాటు ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ, గిరిజన సహకార సంస్థ వంటి ప్రత్యేక కార్పొరేషన్‌తో వారి అభివృద్ధికి ఊతమిస్తున్నారు. మాదిగలకు లిడ్‌క్యాప్ చైర్మన్, డైరెక్టర్ పోస్టులిచ్చారు.

- స్థానిక సంస్థల పదవుల విషయానికొస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వాటా 67 శాతం పైనే. 13 జెడ్పీ చైర్మన్ పదవుల్లో 9 ఈ వర్గాలకే. 14 నగర కార్పొరేషన్ మేయర్ పదవుల్లో 12 వీరివే. పార్టీ గెలిచిన 84 మున్సిపాల్టీలలో 58 స్థానాలు వీరివే. 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లలో 117 పదవులు ఈ వర్గాలకే కేటాయించారంటే ముఖ్యమంత్రి చిత్తశుద్ధి తెలియకమానదు. ఇక ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవులలో 79... 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవుల్లో 280 ఈ వర్గాలకే కేటాయించారు.
- ఇవి మాత్రమే కాదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలు, 2.60 లక్షల వాలంటీర్లలో 84 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే!.
- విజయవాడలో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సీఎం... వేగంగా నిర్మాణం చేయిస్తున్నారు. దీనికి ప్రభుత్వం రూ.268.48కోట్లు ఖర్చు చేస్తోంది.

గిరి జనానికి అండాదండ

వివిధ పథకాల్లో ఎస్టీలకు సముచిత వాటా ఇవ్వటంతో పాటు... వారికి భూమి హక్కు(ఆర్వోఎఫ్ఆర్, డీకేటీ పట్టాలు) కల్పించడంలో ఈ ప్రభుత్వానికి ఎవ్వరూ సాటిరారనే చెప్పాలి. ఎందుకంటే రాష్ట్రంలో గత 12 ఏళ్లలో 2.34 లక్షల ఎకరాలను పట్టాలుగా ఇవ్వగా.. ఈ ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఏకంగా 2.48,887లక్షల ఎకరాలను పంచి రికార్డు సృష్టించింది.

- ప్రత్యేక గిరిజన విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల, ఇంజనీరింగ్ కాలేజీ, సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలతో ఎస్టీలకు సాంకేతిక, వైద్య విద్యను అందుబాటులోకి తేవడంతో పాటు అరకు కాఫీ, నల్లమల నన్నారి వంటి గిరిజన ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్‌ను కల్పించి ప్రోత్సహిస్తున్నారు. వీటన్నిటినీ మరుగున పరుస్తూ... చంద్రబాబు కాలమే స్వర్ణయుగమనే 'ఈనాడు' రాతలు ఇంకెన్నాళ్లు?

సిరులకు ప్రాధాన్యం

సిరి ధాన్యాల సాగుకు సర్కారు ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: సిరి ధాన్యాల సాగును రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. మిషన్ మిల్లెట్ కింద రాష్ట్రంలో సిరి ధాన్యాల సాగును విస్తరించడంతో పాటు ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు వచ్చే ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతి నెలా మిల్లెట్ మహోత్సవాల పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. మిషన్ మిల్లెట్ కింద వచ్చే ఐదేళ్లలో కొత్తగా 5.25 లక్షల ఎకరాల్లో వీటిని సాగు చేయడం ద్వారా కనీసం 5.39 లక్షల టన్నుల దిగుబడులను అదనంగా సాధించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ప్రధానంగా 3.46 లక్షల ఎకరాల్లో రాగులు, 1.54 లక్షల ఎకరాల్లో కొర్రలు సాగు చేయాలనే లక్ష్యంతో జిల్లాల వారీగా అనువైన ప్రాంతాలున్న మండలాలను అధికారులు మ్యాపింగ్ చేశారు. ఈ ఏడాది కొత్తగా 50 వేల ఎకరాలు సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రబీలో ఆరుతడి పంటలుగా బోర్ల కింద సిరి ధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు.

రైతులకు అవగాహన పెంచేలా..

అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా-2023ను ప్రకటించిన నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. జనవరిలో మిల్లెట్స్ క్లస్టర్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఫిబ్రవరిలో కరపత్రాలు, పోస్టర్స్ పంపిణీ, ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నారు. మార్చిలో రాష్ట్ర, జిల్లా స్థాయి వర్కుషాపులు నిర్వహణ, ఏప్రిల్‌లో సిరిధాన్యాల సాగు, అభివృద్ధిపై బుక్‌లెట్స్ పంపిణీ, మేలో జిల్లా స్థాయిల్లో రోడ్ షోలు, ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించడం, జూన్‌లో మిల్లెట్స్ సాగు చేసే వారికి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్ కోసం శిక్షణ కార్యక్రమాలు, జూలైలో గుర్తించిన క్లస్టర్స్‌లో డెమోన్‌స్ట్రేషన్స్ ద్వారా రైతులకు క్వాలిటీ సీడ్స్ పంపిణీ, ఆగస్టులో చిరు ధాన్యాలలో పోషక విలువలపై పాఠశాల స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు చేపడతారు. సెప్టెంబర్‌లో ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం లో చిరుధాన్యాల వినియోగానికి శ్రీకారం చుట్టడం తదితర పనులు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరి హరికిరణ్ వివరించారు.

షూటౌట్ సాగిందిలా...

ఫ్రాన్స్		స్కోరు	అర్జెంటీనా	
ఎంబాపె	✔	1-1	మెస్సీ	✔
కోమన్	✘	1-2	దిబాలా	✔
చువమెని	✘	1-3	పరెడెస్	✔
రాన్‌డల్	✔	2-4	మోంటీల్	✔

నోట్: ఫలితం తేలిపోవడంతో ఐదో షాట్‌ను తీసుకోలేదు

3 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టైటిల్ సాధించడం అర్జెంటీనాకిది మూడోసారి. గతంలో ఆ జట్టు 1978, 1986లలో సాధించింది.

3 ప్రపంచకప్‌ను అత్యధిక సార్లు గెలిచిన జట్ల జాబితాలో అర్జెంటీనా మూడో స్థానానికి చేరుకుంది. బ్రెజిల్ (5 సార్లు) టాప్ ర్యాంక్‌లో, జర్మనీ (4 సార్లు), ఇటలీ (4 సార్లు) సంయుక్తంగా రెండో ర్యాంక్‌లో ఉన్నాయి.

3 'షూటౌట్' ద్వారా ప్రపంచకప్ నెగ్గిన మూడో జట్టు అర్జెంటీనా. గతంలో బ్రెజిల్ (1994లో), ఇటలీ (2006లో) ఈ ఘనత సాధించాయి. అత్యధికంగా ఆరు సార్లు ప్రపంచకప్‌లో 'షూటౌట్'లలో మ్యాచ్‌లు గెలిచిన జట్టుగా అర్జెంటీనా గుర్తింపు పొందింది.

3 డిఫెండింగ్ చాంపియన్ తదుపరి టోర్నీ ఫైనల్లో ఓడిపోవడం ఇది మూడోసారి. గతంలో అర్జెంటీనా (1990లో), బ్రెజిల్ (1998లో) జట్లకు ఇలాంటి ఫలితమే ఎదురైంది.

2 ప్రపంచకప్ టోర్నీ ఫైనల్లో 'హ్యాట్రిక్' సాధించిన రెండో ప్లేయర్ ఎంబాపె (ఫ్రాన్స్). 1966 ఫైనల్లో జర్మనీపై ఇంగ్లండ్ ప్లేయర్ జెఫ్ హర్స్ట్ తొలిసారి ఈ ఘనత సాధించాడు.

1 ఒకే ప్రపంచకప్ టోర్నీలో గ్రూప్ దశ మ్యాచ్‌లో, ప్రిక్వార్టర్ ఫైనల్లో, క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో, ఫైనల్లోనూ గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్ మెస్సీ.

26 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా మెస్సీ (26 మ్యాచ్‌లు) గుర్తింపు పొందాడు.

ఏమా ఆట... ఎంతటి అద్భుత ప్రదర్శన... ఒకరు ఎక్కువ కాదు, ఒకరు తక్కువ కాదు... ప్రపంచకప్ ఫైనల్ అంటే ఇలా ఉంటుంది... కాదు, కాదు.. ఇంత గొప్పగా, ఇలాగే ఉంటుంది అనిపించేలా సాగిన ఆట... మైదానంలో ఆటగాళ్లు కొదమసింహాల్లా పోటీపడుతుంటే... స్టేడియంలో 90 వేల మంది ప్రేక్షకులే కాదు, ప్రపంచం మొత్తం ఊగిపోయింది... ఫైనల్లో ఆడుతున్న జట్లు మాత్రమే కాదు... ఏ జట్టుతో సంబంధం లేకపోయినా, రెప్పార్పకుండా చూసిన వీరాభిమానుల సంఖ్యకు లెక్కే లేదు... ఆట ఆరంభంలో అర్జెంటీనా దూకుడు చూస్తే మ్యాచ్ ఏకపక్షమే అనిపించింది... ఒకసారి కాదు, రెండుసార్లు కాదు... పదే పదే అటాక్ మంత్రంగా ఆ జట్టు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది... రెండు గోల్స్ ఆధిక్యం సాధించాక మెస్సీ మాయలో ఊగిపోతున్న అర్జెంటీనా అభిమానులు సంబరాలు షురూ చేసేశారు... తొలి అర్ధ భాగం చూస్తే అసలు ఫ్రాన్స్ ఫైనల్ చేరిన జట్టేనా అనిపించింది... స్టార్ ఆటగాళ్ల జాడే కనిపించలేదు. రెండో అర్ధభాగంలో కూడా కూడా అర్జెంటీనా తగ్గలేదు... మొత్తం 67 నిమిషాల ఆట సాగినా... ఒక్క షాట్ కూడా గోల్ పోస్ట్‌పై కొట్టలేకపోయింది.

అప్పుడొచ్చాడు ఎంబాపె... అప్పటి వరకు కనీసం పాస్‌లు కూడా అందుకోలేకపోయిన ఈ సంచలన ఆటగాడు తనేంటో చూపించాడు... 97 సెకన్ల వ్యవధిలో రెండు గోల్స్ చేసేసి అర్జెంటీనాను ఒక్కసారిగా అచేతనంగా మార్చాడు. ఆపై తమదే ఆట అన్నట్లుగా ఫ్రాన్స్ దూసుకుపోగా, మెస్సీ సేన నిస్సహాయంగా కనిపించింది... స్కోరు సమం చేయడం సంగతేమో కానీ డిఫెన్స్‌తో తమ గోల్‌పోస్ట్‌ను కాపాడుకోవడమే అర్జెంటీనాకు కనాకష్టంగా మారింది. నిర్ణీత సమయం ముగిసింది... ఇంజ్యూరీ టైమ్ కూడా అయిపోయింది. స్కోర్లు సమంగానే ఉన్నాయి. అప్పుడు అదనపు సమయం తప్పలేదు. మళ్లీ మెస్సీ పైనే గెలుపు భారం పడింది... తన కోసం, తన దేశం కోసం అన్నట్లుగా ఒక్కసారిగా శక్తి పుంజుకున్న మెస్సీ మరో గోల్‌తో ముందంజలో నిలిపి విజయధ్వానం చేశాడు... అయితే అది కొద్ది క్షణాలకే పరిమితమైంది... ఎంబాపె మళ్లీ మ్యాజిక్ ప్రదర్శించడంతో స్కోరు మళ్లీ సమమైంది. దాంతో ఫలితం పెనాల్టీ 'షూటౌట్'కు వెళ్లింది.

'అర్జెంటీనా జట్టు గెలవాలని ప్రపంచం మొత్తం కోరుకుంటోంది. మా దేశంలో కూడా అలాంటివారు ఉన్నారు'... ఫైనల్‌కు ముందు ఫ్రాన్స్ కోచ్ డెషాంప్స్ చేసిన వ్యాఖ్య ఇది. సగటు ఫుట్‌బాల్ అభిమాని దృష్టిలో ఇది నిజంగా నిజం... అందుకు ఒకే ఒక్క కారణం లయోనల్ మెస్సీ... ప్రపంచవ్యాప్తంగా అతడిని అభిమానించే వారెందరో అతను వరల్డ్‌కప్‌ను అందుకోవాలని కోరుకున్నారు. వారంతా ఫైనల్ రోజు అర్జెంటీనా అభిమానులుగా మారిపోయారు... అందుకే మెస్సీ కొట్టిన ప్రతీ గోల్ వారిని ఆనందంతో ముంచెత్తితే... ఎంబాపె ఆట చూస్తుంటే ఎక్కడో గుండెల్లో అలజడి... ఎక్కడ అతను మ్యాచ్‌ను లాగేసుకుంటాడేమోనని ఆందోళన... కానీ అందరి కల నెరవేరింది... ఐదో ప్రపంచకప్ ప్రయత్నంలో మెస్సీ తన టీమ్‌ను విశ్వవిజేతగా నిలిపాడు. ఆ ఒక్క లోటును అధిగమించి ఆల్‌టైమ్ గ్రేట్‌గా నిలిచాడు. సంవత్సరం క్రితం దివికేగిన డీగో మారడోనా పైనుంచి ఆశీర్వదించినట్లుగా 36 ఏళ్ల తర్వాత అర్జెంటీనా చాంపియన్‌గా మారింది.



2010 ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టు కెప్టెన్ కాసిలాస్‌తో బాలీవుడ్ నటి దీపిక పదుకోన్

అర్జెంటీనా గర్జన

జగజ్జేతగా మెస్సీ బృందం



- మూడోసారి ప్రపంచకప్ టైటిల్ గెలిచిన అర్జెంటీనా
- ఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం
- 'షూటౌట్'లో తేలిన ఫలితం
- 4-2 గోల్స్‌తో మెస్సీ సేనదే పైచేయి

దోహా: గొంజాలో మోంటీల్... కొన్ని క్షణాల ముందు అర్జెంటీనా 3-2తో ఆధిక్యంలో ఉండి గెలుపు ఖాయమనుకుంటున్న దశలో అప్రయత్నంగానే మోచేతికి బంతికి తగిలించాడు... దాంతో ఫ్రాన్స్‌కు పెనాల్టీ కిక్ దక్కి స్కోరు సమమైంది. సబ్‌స్టిట్యూట్‌గా కొన్ని నిమిషాల క్రితమే మైదానంలోకి దిగి ఒక్క పొరపాటుతో విలన్‌గా మారిపోయాడు... కానీ మరికొన్ని నిమిషాల తర్వాత అతనే హీరోగా నిలిచాడు. షూటౌట్‌లో అర్జెంటీనా ఓడి ఉంటే తన తప్పిదపు భారాన్ని అతను జీవితకాలం మోయాల్సి వచ్చేదేమో... షూటౌట్‌లో అర్జెంటీనా 3-2తో ఉండగా మోంటీల్ పెనాల్టీ తీసుకున్నాడు... అతను కొట్టిన కిక్ ఫ్రాన్స్ గోల్ కీపర్ లోరిస్‌ను దాటి నెట్‌లో పడింది! అంతే... అర్జెంటీనా బృందం విజయ గర్జన చేసింది... కన్నీళ్లతో మోంటీల్ భావోద్వేగభరితమయ్యాడు.

ఆదివారం జరిగిన ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్లో అర్జెంటీనా 4-2 (షూటౌట్‌లో) తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయం, అదనపు సమయం కలిపి ఇరు జట్లు 3-3తో సమంగా నిలవగా, షూటౌట్‌లో ఫలితం తేలింది. అర్జెంటీనా తరఫున కెప్టెన్ మెస్సీ (23వ నిమిషం, 108వ నిమిషం), మరియా (36వ నిమిషం) గోల్స్ చేయగా... ఫ్రాన్స్ తరఫున ఎంబాపె ఒక్కడే (80వ నిమిషం, 81వ నిమిషం, 118వ నిమిషం) మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ నమోదు చేశాడు.

హోరాహోరీ...

విజిల్ మోగిన దగ్గరి నుంచి అర్జెంటీనా ఆధిపత్యమే సాగింది. వరుసగా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై జట్టు దాడులు చేస్తూ పోయింది. అదే జోరులో ఫలితం రాబట్టింది. పెనాల్టీ ఏరియాలో ఫ్రాన్స్ వింగర్ ఉస్మాన్ డెంబెలెను దాటి అర్జెంటీనా ఆటగాడు డి మరియా బంతితో దూసుకుపోయాడు. అతడిని నిలువరించే క్రమంలో ఉస్మాన్ వెనకనుంచి మరియాను తోసేశాడు. దాంతో మరో మాట లేకుండా రిఫరీ అర్జెంటీనాకు పెనాల్టీ ప్రకటించాడు. మెస్సీ ప్రశాంతంగా ఎడమ కాలితో కుడి వైపు చివరకు కిక్ కొట్టగా, మరోవైపు దూకిన గోల్ కీపర్ హ్యూగో లోరిస్ బంతిని ఆపడంలో పూర్తిగా విఫలమయ్యాడు. ఆ తర్వాత మెస్సీ, అల్వారెజ్ అద్భుత సమన్వయంతో పాస్‌లు ఇచ్చుకుంటూ దూసుకుపోయారు. బంతి అలిస్టర్‌కు చేరగా, అతడి నుంచి పాస్ అందుకున్న మరియా అద్భుత గోల్‌గా మలిచాడు. తొలి అర్ధభాగంలో అసలు ఫ్రాన్స్ ఆటగాళ్లు ఏం చేస్తున్నారో కూడా అర్థం కాని పరిస్థితి. పాస్‌లు సరిగా అందుకోలేకపోగా, కదలికల్లో కూడా వేగం లోపించింది. రెండో అర్ధభాగంలో కూడా అర్జెంటీనా ఆట చూస్తే తామే వెనుకబడి ఉన్నామా అన్నట్లు అనిపించింది. మళ్లీ మళ్లీ అదే దూకుడుతో వారు ప్రత్యర్థిపై చెలరేగారు. అయితే నికోల్స్ పొరపాటుతో ఫ్రాన్స్‌కు పెనాల్టీ దక్కింది. దీనిని గోల్‌గా మలచిన ఎంబాపె తర్వాతి నిమిషంలో అద్భుత ఆటతో ఫీల్డ్ గోల్ నమోదు చేశాడు. మెస్సీ సేన బేలగా చూస్తూ ఉండిపోయింది. ఆ తర్వాత మాత్రం అర్జెంటీనా కాస్త తేరుకుంది. దాంతో అదనపు సమయం మొత్తం పోటాపోటీగా సాగింది. మెస్సీ, ఎంబాపె ఇద్దరూ తమ అత్యుత్తమ ఆటను ప్రదర్శిస్తూ చెరో గోల్‌తో మళ్లీ మ్యాచ్‌లో జీవం పోశారు. చివరకు పెనాల్టీ షూటౌట్ విశ్వవిజేతను తేల్చింది.

మెస్సీ 'మిషన్ పాసిబుల్'



ఏడుసార్లు ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాల్ ఆటగాడిగా 'బాలన్ డీ'ర్' అవార్డు... ప్రతిష్టాత్మక క్లబ్ బార్సిలోనా తరఫున ఏకంగా 35 టైటిల్స్‌లో భాగం... ఏ లీగ్‌లోకి వెళ్లినా అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా ఘనత... లెక్కలేనన్ని రికార్డులు, అపార ధనార్జన... అపరిమిత సంఖ్యలో అతని నామం జపించే అభిమానులు... మెస్సీ గురించి ఇది ఒక చిన్న ఉపోద్ఘాతం మాత్రమే. ఫుట్‌బాల్ మైదానంలో అతను చూపించిన మాయకు ప్రపంచం దాసోహమంది... ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా గొప్పగా కీర్తించింది...

కానీ...కానీ... అదొక్కటి మాత్రం లోటుగా ఉండిపోయింది. మెస్సీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా వరల్డ్ కప్ మాత్రం గెలవలేదే అనే ఒక భావన... 2006లో అడుగు పెట్టిన నాటి నుంచి 2018 వరకు నాలుగు టోర్నీలు ముగిసిపోయాయి. కానీ ట్రోఫీ కోరిక మాత్రం తీరలేదు. 2014లో అతి చేరువగా ఫైనల్‌కు వచ్చినా, పేలవ ఆటతో పరాభవమే ఎదురైంది. వరల్డ్ కప్ లేకపోయినంత మాత్రాన అతని గొప్పతనం తగ్గదు... కానీ అది కూడా ఉంటే బాగుంటుందనే ఒక భావన సగటు ఫ్యాన్స్‌లో బలంగా నాటుకు పోయింది. అతని సమకాలీకుడు, సమఉజ్జీ క్రిస్టియానో రొనాల్డోతో ప్రతీసారి ఆటలో పోలిక... కానీ ఇప్పుడు మెస్సీ వరల్డ్ కప్ విన్నర్ కూడా... ఈ విజయంతో అతను రొనాల్డోను అధిగమించేశాడు... అర్జెంటీనా ఫుట్‌బాల్ అంటే మారడోనానే పర్యాయపదం... 1986లో అతను ఒంటి చేత్తో (కాలితో) తమ టీమ్‌ను విశ్వవిజేతగా నిలిపిన క్షణం ఆ దేశపు అభిమానులు మరచిపోలేదు. అంతటివాడు అనిపించుకోవాలంటే వరల్డ్ కప్ గెలవాల్సిందే అన్నట్లుగా ఆ దేశం మెస్సీకి ఒక అలిఖిత ఆదేశం ఇచ్చేసింది! ఎట్టకేలకు అతను ఆ సవాల్‌ను స్వీకరించాడు... తొలి మ్యాచ్‌లో సౌదీ అరేబియా చేతిలో పరాజయం ఎదురైన తర్వాత తమను లెక్కలోంచే తీసేసిన జట్లకు సరైన రీతిలో సమాధానమిచ్చాడు. మైదానం అంతటా, అన్నింటా తానై అటు గోల్స్ చేస్తూ, ఇటు గోల్స్ చేసేందుకు సహకరిస్తూ టీమ్‌ను నడిపించాడు. ప్రపంచ కప్ చరిత్రలో గ్రూప్ దశలో, ప్రిక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్లో, సెమీస్‌లో, ఫైనల్లో గోల్ చేసిన ఏకైక ఆటగాడు కావడంతో పాటు జట్టును శిఖరాన నిలిపాడు. శాశ్వత కీర్తిని అందుకుంటూ అర్జెంటీనా ప్రజలకు అభివాదం చేశాడు. చివరగా...మెస్సీ భావోద్వేగాలు చూస్తుంటే సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజం కూడా తన కెరీర్‌లో అన్నీ సాధించిన తర్వాత లోటుగా ఉన్న క్రికెట్ ప్రపంచకప్‌ను ఆరో ప్రయత్నంలో అందుకోవడం, అతడిని సహచరులు భుజాలపై ఎత్తుకొని మైదానంలో తిరిగిన ఘటన మీ కళ్ల ముందు నిలిచిందా!

–సాక్షి క్రీడా విభాగం

వరల్డ్‌కప్-2022 అవార్డులు

గోల్డెన్ బాల్ (బెస్ట్ ప్లేయర్)
మెస్సీ (7 గోల్స్)

గోల్డెన్ బూట్ (టాప్ స్కోరర్: 8 గోల్స్)
ఎంబాపె

గోల్డెన్ గ్లౌవ్ (బెస్ట్ గోల్‌కీపర్)
మార్టినెజ్ (అర్జెంటీనా: 34 సార్లు గోల్స్ నిలువరించాడు)

బెస్ట్ యంగ్ ప్లేయర్
ఎంజో ఫెర్నాండెజ్ (అర్జెంటీనా)

మ్యాన్ ఆఫ్ ద ఫైనల్
మెస్సీ

ఫెయిర్ ప్లే అవార్డు
ఇంగ్లండ్

ప్రపంచకప్ విశేషాలు

172 ప్రపంచకప్‌లో నమోదైన మొత్తం గోల్స్. ఒకే టోర్నీలో ఇవే అత్యధికం. 1998, 2014 ప్రపంచకప్‌లలో 171 గోల్స్ చొప్పున నమోదయ్యాయి.

64 జరిగిన మ్యాచ్‌లు

217 ఎల్లో కార్డులు

3 రెడ్ కార్డులు

16 టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన జట్టు (ఫ్రాన్స్)

8 ఒకే మ్యాచ్‌లో నమోదైన అత్యధిక గోల్స్ (ఇంగ్లండ్ 6, ఇరాన్ 2)

2 టోర్నీలో నమోదైన సెల్ఫ్ గోల్స్

2 టోర్నీలో నమోదైన 'హ్యాట్రిక్'లు (ఎంబాపె, గొన్సాలో రామోస్)



గోల్డెన్ బూట్‌తో ఎంబాపె

ఎవరికెంత వచ్చాయంటే...

విజేత: అర్జెంటీనా
4 కోట్ల 20 లక్షల డాలర్లు (రూ. 347 కోట్లు)

రన్నరప్: ఫ్రాన్స్
3 కోట్ల డాలర్లు (రూ. 248 కోట్లు)

మూడో స్థానం: క్రొయేషియా
2 కోట్ల 70 లక్షల డాలర్లు (రూ. 223 కోట్లు)

నాలుగో స్థానం: మొరాకో
2 కోట్ల 50 లక్షల డాలర్లు (రూ. 206 కోట్లు)

క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిన జట్లకు (4)
కోటీ 70 లక్షల డాలర్ల చొప్పున (రూ. 140 కోట్ల చొప్పున)

ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిన జట్లకు (8)
కోటీ 30 లక్షల డాలర్ల చొప్పున (రూ. 107 కోట్ల చొప్పున)

గ్రూప్ లీగ్ దశలో నిష్క్రమించిన జట్లకు (16)
90 లక్షల డాలర్ల చొప్పున (రూ. 74 కోట్ల చొప్పున)

లాంఛనం లంచ్‌లోపే...

- తొలి టెస్టులో 188 పరుగులతో భారత్ ఘనవిజయం
- రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 324 ఆలౌట్
- మ్యాచ్‌లో 8 వికెట్లు తీసిన కుల్దీప్
- 22 నుంచి రెండో టెస్టు

చట్టోగ్రామ్: వన్డే సిరీస్‌ను పరాజయంతో మొదలుపెట్టిన భారత్... టెస్టు సిరీస్‌కు ఘనవిజయంతో శ్రీకారం చుట్టింది. ఇక ఆఖరి టెస్టు ఓడినా కూడా సిరీస్ కోల్పోని పటిష్టస్థితిలో టీమిండియా నిలిచింది. ఆఖరి రోజు లాంఛనం లంచ్‌లోపే ముగిసింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 113.2 ఓవర్లలో 324 పరుగుల వద్ద ఆలౌటైంది. భారత్ 188 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 272/6తో చివరి రోజు ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ 11.2 ఓవర్లు మాత్రమే ఆడి 52 పరుగులు జతచేసి మిగితా నాలుగు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ షకీబుల్ హసన్ (84; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) ఆడినంతసేపు ధాటిగా ఆడాడు. ఆట మొదలైన కాసేపటికే ఓవర్‌నైట్ బ్యాటర్ మెహిదీ హసన్ మిరాజ్ (13)ను పేసర్ సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. స్పెషలిస్టు బ్యాటర్లు ఇంకెవరూ లేకపోవడంతో మరో ఓవర్‌నైట్ బ్యాటర్ షకీబ్ బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 80 బంతుల్లో (3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. తైజుల్ (4)తో కలిసి జట్టు స్కోరును 300 పరుగులు దాటించాడు. అయితే తన వరుస ఓవర్లలో కుల్దీప్... షకీబ్, ఇబాదత్ (0)లను అవుట్ చేశాడు. తైజుల్‌ను అక్షర్ పటేల్ క్లీన్‌బౌల్డ్ చేయడంతో బంగ్లా రెండో ఇన్నింగ్స్‌కు తెరపడింది. చివరి రోజు ఆటలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/73) రెండు వికెట్లు పడేయగా, మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ (4/77), సీమర్ సిరాజ్ (1/67) చెరో వికెట్ తీశారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ కలుపుకొని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' కుల్దీప్ (8/113) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేశాడు. ఈ నెల 22 నుంచి మిర్పూర్ వేదికపై చివరిదైన రెండో టెస్టు జరుగుతుంది.



కుల్దీప్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 404; **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 150; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 258/2 డిక్లేర్డ్; **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** నజ్ముల్ (సి) పంత్ (బి) ఉమేశ్ 67; జాకీర్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 100; యాసిర్ అలీ (బి) అక్షర్ 5; లిటన్ దాస్ (సి) ఉమేశ్ (బి) కుల్దీప్ 19; ముష్ఫికర్ (బి) అక్షర్ 23; షకీబ్ (బి) కుల్దీప్ 84; నూరుల్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 3; మెహిదీ హసన్ (సి) ఉమేశ్ (బి) సిరాజ్ 13; తైజుల్ (బి) అక్షర్ 4; ఇబాదత్ (సి) అయ్యర్ (బి) కుల్దీప్ 0; ఖాలిద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (113.2 ఓవర్లలో ఆలౌట్) 324. వికెట్ల పతనం: 1–124, 2–131, 3–173, 4–208, 5–234, 6–238, 7–283, 8–320, 9–324, 10–324. **బౌలింగ్:** సిరాజ్ 19–4–67–1, ఉమేశ్ 15–3–27–1, అశ్విన్ 27–3–75–1, అక్షర్ 32.2–10–77–4, కుల్దీప్ యాదవ్ 20–3–73–3.

రెండు రోజుల్లోనే టెస్టు ఖతం

తొలి టెస్టులో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా 6 వికెట్లతో గెలుపు

బ్రిస్బేన్: అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మేటి జట్లు. ఇలాంటి బలమైన ప్రత్యర్థుల మధ్య టెస్టు మ్యాచ్ రెండే రోజుల్లో ముగియడం అసాధారణం. పేసర్లకు స్వర్గధామమైన 'గాబా' పిచ్‌పై ఆతిథ్య ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. పేస్‌కు బ్యాటర్సంతా విలవిలలాడిన పిచ్‌పై అత్యధిక స్కోరు చేసిన ట్రవిస్ హెడ్ (96 బంతుల్లో 92; 13 ఫోర్లు, 1 సిక్స్)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఓవర్‌నైట్ స్కోరు ఆదివారం 145/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా లంచ్‌కు ముందే 218 పరుగుల వద్ద ఆలౌటైంది. హెడ్ మరో 14 పరుగులు జతచేసి నిష్క్రమించగా, క్యారీ (22 నాటౌట్), గ్రీన్ (18), స్టార్క్ (14) రెండంకెల స్కోరు చేశారు. రబడ 4, జాన్సెన్ 3 వికెట్లు తీశారు. ఆసీస్‌కు 66 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. తర్వాత దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగులకే కుప్పకూలింది. జోండో (36; 6 ఫోర్లు) టాప్ స్కోరర్! కమిన్స్ (5/42) నిప్పులు చెరిగాడు. అయితే వాన్ డెర్ డసెన్ (0)ను బౌల్డ్ చేయడంతో స్టార్క్ 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. అతనికి, బొలాండ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం 34 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆస్ట్రేలియా... రబడ (4–1–13–4) పేస్ పదునుకు ఆపసోపాలు పడింది. చివరకు 7.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 35 పరుగులు చేసి నెగ్గింది. ఈ రెండు రోజుల్లో 34 వికెట్లు కూలడం విశేషం. 26 నుంచి 'బాక్సింగ్ డే' రెండో టెస్టు మెల్‌బోర్న్‌లో జరుగుతుంది.



కమిన్స్

బ్రూక్ సెంచరీ: ఇంగ్లండ్‌కు ఆధిక్యం

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టుకు 50 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 7/1 తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 81.4 ఓవర్లలో 354 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (111; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా మూడో టెస్టులోనూ సెంచరీ సాధించడం విశేషం. ఓలీ పోప్ (51; 4 ఫోర్లు), బెన్ ఫోక్స్ (64; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 50 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాక్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది.



హ్యారీ బ్రూక్

15 ఇంగ్లండ్ తరఫున వరుసగా మూడు టెస్టుల్లో సెంచరీలు సాధించిన 15 క్రికెటర్‌గా బ్రూక్ నిలిచాడు. గతంలో బారింగ్టన్, హాబ్స్, హ్యామండ్, సట్‌క్లిఫ్, బాయ్‌కాట్, లాంబ్, క్రిస్ బ్రాడ్, గూచ్, బెల్, స్ట్రాస్, రవి బొపారా, కుక్, రూట్, బెయిర్‌స్టో ఈ ఘనత సాధించారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
19-12-2022

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	461	61,338
నిఫ్టీ ▽	146	18,269

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,705	▽	105
డోజోన్స్	32,920	▽	282
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,332	▽	94
డాక్స్	13,893	▽	93
షాంఘై	3,207	▽	1
నికాయ్	27,527	▽	525

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపిటి	82.05	83.72
£	యూరో	ఎపిటి	86.72	89.81
€	బ్రిటన్ పౌండ్	ఎపిటి	99.51	102.87
¥	జపాన్ ఎన్ (100)	ఎపిటి	59.40	61.30
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎపిటి	54.60	56.99
S$	సింగపూర్ డాలర్	ఎపిటి	60.12	62.10
SAR	సౌదీ రియాల్	ఛానల్	21.01	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	ఛానల్	21.67	23.46
¥	చైనా యువాన్	ఛానల్	10.76	12.79

పన్నుల రూటే సెప'రేటు'!



ఈక్విటీ, డెట్ సాధనాలకు పన్ను భిన్నం ● ఈక్విటీల్లోనూ స్వల్ప, దీర్ఘకాల లాభాల పన్ను ఈక్విటీ, డెట్‌లో హోల్డింగ్ వ్యవధి వేర్వేరు ● బ్యాంక్ సేవింగ్స్ ఖాతా ఆదాయంపైనా పన్ను అద్దె ఆదాయం, ప్రాపర్టీ విక్రయంపైనా బాధ్యత ● బంగారంలో రాబడిపైనా పన్ను చెల్లించాలి

పెట్టుబడి పెట్టే ముందు రాబడి ఒక్కటే చూస్తే కాదు. వచ్చిన లాభంపై పన్ను బాధ్యత ఎంతన్నది కూడా ముఖ్యమే. అప్పుడే కదా నికర రాబడి గురించి తెలిసేది. మ్యూచువల్ ఫండ్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తదితర డెట్ సాధనాలు, బంగారం, జీవిత బీమా పథకాలు, యులిప్‌లు ఇలా ఎన్నో పెట్టుబడి సాధనాలున్నాయి. వీటన్నింటిపైనా ఒకే విధమైన పన్ను లేదు. పైగా కాల వ్యవధి ఆధారంగా పన్ను బాధ్యత కూడా మారిపోతుంది. అందుకే ఇన్వెస్టర్లు ప్రతి పెట్టుబడి సాధనం, అందులో వచ్చే రాబడులపై చెల్లించాల్సిన పన్ను, అమలయ్యే టీడీఎస్ తదితర వివరాలు తప్పకుండా తెలుసుకోవాల్సిందే. ఈ వివరాలను అందించే కథనమే ఇది.

సేవింగ్స్ బ్యాంకు అకౌంట్

సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ అంటూ కొంత ఉంచుతుంటాం. దీనికితోడు మనకు జమయ్యే వేతనం, ఇతరత్రా అన్నీ కూడా వచ్చి ముందుగా నిల్వ ఉండేది బ్యాంకు ఖాతాలోనే. మరి ఈ మొత్తంపై బ్యాంకులు సుమారు 3 శాతం మేర వడ్డీ చెల్లిస్తాయని తెలిసింది తక్కువ మందికే. ఇలా బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో జమయ్యే వడ్డీ ఆదాయం ఆదాయపన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ బ్యాంకు డిపాజిట్ల వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు ఉంటే పన్ను లేదు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80టీటీఏ పన్ను మినహాయింపు కల్పిస్తోంది. రూ.10వేలలోపు ఉన్నా



కానీ ఆదాయపన్ను రిటర్నుల్లో ఈ మొత్తాన్ని చూపించాలి. వడ్డీ ఆదాయం రూ.10,001 అంతకంటే ఎక్కువ ఉంటే పన్ను చెల్లించాలి. సంబంధిత వ్యక్తి ఆదాయం ఏ శ్లాబ్ పరిధిలో ఉంటే ఆ రేటు ప్రకారం, సేవింగ్స్ బ్యాంకు వడ్డీ ఆదాయంపై పన్ను చెల్లించాలి. ఒకవేళ 60 ఏళ్లు నిండి ఉంటే వారికి రూ.50,000 వరకు సేవింగ్స్ బ్యాంకు వడ్డీ ఆదాయంపై పన్ను లేదు. రూ.50,001, అంతకంటే ఎక్కువ ఆదాయం ఉంటే సీనియర్ సిటిజన్లు (వృద్ధులు) సైతం తమ పన్ను రేటు ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకు ఎఫ్‌డీపై వచ్చే రాబడి ఎంతైనా కానీయండి, ఆ మొత్తం సంబంధిత వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారి ఆదాయానికి వర్తించే శ్లాబ్ రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. అయితే 2018–19 నుంచి బ్యాంకు/పోస్టాఫీసు ఎఫ్‌డీలు, రికరింగ్ డిపాజిట్లపై (ఆర్‌డీలు) ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50,000 వరకు ఉంటే సెక్షన్ 80టీటీబీ కింద పన్ను మినహాయింపు కల్పించారు. వడ్డీ ఆదాయం రూ.40,000 దాటితే బ్యాంక్‌లు ఆ మొత్తం నుంచి 10 శాతం టీడీఎస్ కింద



కోసి, ఐటీ శాఖకు జమ చేస్తాయి. సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయం రూ.50,000 దాటితే 10 శాతం టీడీఎస్ అమలవుతుంది. ఒక బ్యాంకు పరిధిలో ఒకటికి మించిన శాఖల్లో డిపాజిట్లు కలిగి ఉన్నా, అన్నింటిపై వడ్డీ ఆదాయాన్ని బ్యాంకు కలిపి టీడీఎస్ అమలు చేస్తుంది. ఖాతాదారు పాన్ నంబర్ వివరాలు ఇవ్వకపోతే టీడీఎస్ కింద 20 శాతాన్ని బ్యాంకులు తగ్గిస్తాయి.

కంపెనీ ఎఫ్‌డీలు/ఆర్‌డీలు



వీటి నుంచి వచ్చే వడ్డీ రాబడి అంతా వ్యక్తి వార్షిక ఆదాయానికి వెళ్లి కలుస్తుంది. ఒక ఏడాదిలో వీటిపై వడ్డీ ఆదాయం రూ.5,000 మించినప్పుడు ఆ మొత్తంపై 10 శాతం టీడీఎస్ కింద తగ్గించి, మిగిలినది ఇన్వెస్టర్‌కు చెల్లిస్తారు.

పన్నులేని బాండ్లు



పేరులో ఉన్నట్టుగా ఈ బాండ్లపై వచ్చే రాబడి కానీ, పెట్టుబడి వృద్ధిపైనా పన్ను ఉండదు. నిర్ణీత కాలానికి ముందుగా విక్రయించినట్టయితే అప్పుడు పన్ను పడుతుంది. ఏడాదిలోపు విక్రయిస్తే రాబడి అంతా వ్యక్తి ఆదాయానికి కలుస్తుంది. ఏడాది తర్వాత, నిర్ణీత గడువు ముగియకుండా అమ్మేస్తే రాబడిపై 20 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. ఇక్కడ కూడా ఇండెక్సేషన్ ప్రయోజనం ఉండదు.

ఎన్‌ఎస్‌సీ/కేవీపీ



ఈ సాధనాల్లో వచ్చే రాబడి సైతం వ్యక్తి ఆదాయానికి కలుస్తుంది. రిటర్నుల్లో చూపించి, పన్ను పరిధిలో ఉంటే పన్ను చెల్లించాలి. టీడీఎస్ అమలు చేయరు.

ఎన్‌సీడీలు/బాండ్లు

వీటిపై వచ్చే వడ్డీ ఆదాయం సైతం వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఒక ఏడాదిలో వీటిపై వడ్డీ ఆదాయం రూ.5,000 మించినప్పుడు ఆ మొత్తంపై 10 శాతం టీడీఎస్ పేరిట తగ్గించి, మిగిలినది ఇన్వెస్టర్‌కు చెల్లిస్తారు. అయితే, ఈ బాండ్లు లేదా ఎన్‌సీడీలను డీమ్యాట్ రూపంలో కలిగి ఉంటే టీడీఎస్ అమలు చేయరు. ఎన్‌సీడీలు/బాండ్లను కొనుగోలు చేసిన వారు నిర్ణీత కాలవ్యవధి వరకు కలిగి ఉండకుండా, ముందుగానే సెకండరీ మార్కెట్ అంటే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో విక్రయించినట్టయితే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది. ఏడాదిలోపు విక్రయించినట్టయితే స్వల్పకాల మూలధన లాభాల పన్ను



అమలవుతుంది. దీనిపై ప్రత్యేకంగా పన్ను రేటు లేదు. వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఇన్వెస్టర్ పన్ను బాధ్యత ప్రకారం చెల్లిస్తే సరిపోతుంది. ఏడాది తర్వాత ఈ పెట్టుబడులను విక్రయించినప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల కిందకు రాబడులు వస్తాయి. అప్పుడు రాబడిపై 10 శాతం పన్ను అమలవుతుంది. దీనికి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం మినహాయింపు) ప్రయోజనం లేదు.

పోస్టల్ సేవింగ్స్ అకౌంట్

పోస్టల్ సేవింగ్స్ ఖాతాలో ఒక్కరి పేరు మీదే ఖాతా ఉంటే, అందులోని బ్యాలెన్స్‌పై వడ్డీ ఆదాయం ఒక ఏడాదిలో రూ.3,500 వరకు పన్ను లేదు. జాయింట్ హోల్డర్ అకౌంట్ (ఇద్దరి పేరు మీద) అయితే ఈ ఆదాయం రూ.7,000 మొత్తంపై పన్ను లేదు. ఇంతకుమించి ఆదాయం ఉంటే, మినహాయింపు పోను మిగిలిన మొత్తం వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 10(15)(ఐ) కింద ఈ ప్రయోజనం ఉంది. ఇప్పుడు ఒక వ్యక్తికి బ్యాంక్ సేవింగ్స్ ఖాతా ఉండి,



అదే వ్యక్తి పోస్టల్ సేవింగ్స్ ఖాతా కూడా కలిగి ఉన్నాడని అనుకుందాం. అప్పుడు బ్యాంక్ సేవింగ్స్ ఖాతాపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 మొత్తంపైనా (సెక్షన్ 80టీటీఏ కింద), పోస్టల్ సేవింగ్స్ ఖాతాలపై రూ.3,500 మొత్తంపైనా (సెక్షన్ 10(15)(ఐ)) పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందడానికి అర్హులే. పోస్టల్ సేవింగ్స్ వడ్డీ ఆదాయంపై టీడీఎస్ అమలు చేయరు.

సావరీన్ గోల్డ్ బాండ్స్

సార్వభౌమ బంగారం బాండ్లను కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి హామీతో ఆర్‌బీఐ ఏటా పలు విడతలుగా జారీ చేస్తుంటుంది. బంగారంలో పెట్టుబడుల కోసం ఉద్దేశించిన సాధనం ఇది. కాల వ్యవధి ఎనిమిదేళ్లు. కాల వ్యవధి ముగిసేవరకు పెట్టుబడిని కొనసాగించినట్టయితే, రాబడిపై ఎలాంటి పన్ను లేదు. మూడేళ్లు మించి, ఎనిమిదేళ్ల లోపు విక్రయించినప్పుడు వచ్చే రాబడిపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంది. మూడేళ్లలోపు విక్రయించినప్పుడు వచ్చే రాబడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది.



రిఫండ్ కోరొచ్చు


కొన్ని రకాల పెట్టుబడి సాధనాలపై రాబడి నిర్ణీత పరిమితి దాటితే మూలం వద్ద పన్ను వసూలు చేసే (టీడీఎస్) విధానం అమల్లో ఉంది. 10–20 శాతం మేర టీడీఎస్ అమలవుతుంది. ఈ మొత్తాన్ని బ్యాంక్‌లు, పోస్టాఫీసులు, కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు సంబంధిత ఇన్వెస్టర్ పాన్ నంబర్ ఆధారంగా ఐటీ శాఖకు జమ చేస్తాయి. ఒకవేళ ఇన్వెస్టర్ వార్షిక ఆదాయం పన్ను పరిధిలోకి వస్తే.. ఈ వడ్డీ ఆదాయంపైనా అంతే మేర పన్ను పడుతుంది. ఒకవేళ వార్షికాదాయం పన్ను వర్తించని పరిధిలో ఉంటే అప్పుడు రిటర్నులను విధిగా నిర్ణీత గడువులోపు దాఖలు చేయాలి. అలా దాఖలు చేసిన తర్వాత టీడీఎస్ రూపంలో మినహాయించిన మొత్తాన్ని తిరిగి తనకు చెల్లించాలంటూ రిఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చు.

బంగారం



బంగారం ఆభరణాలు, భౌతిక రూపంలో బంగారం కొనుగోలు చేసి, వాటిని మూడేళ్ల తర్వాత విక్రయిస్తే, రాబడిపై 20 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్ను పడుతుంది. మూడేళ్లలోపు విక్రయించినప్పుడు వచ్చే లాభం వార్షిక ఆదాయానికి కలుస్తుంది.

గోల్డ్ మానిటైజేషన్..




ఈ పథకంలో భాగంగా తమ వద్ద నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని జమ చేయవచ్చు. ఇలా జమ చేసే బంగారం విలువపై ఏటా 2.5% వరకు వడ్డీ లభిస్తుంది. ఈ మొత్తంపై పన్ను లేదు.

అద్దె ఆదాయం



అద్దె ఆదాయంపై 30 శాతం స్టాండర్డ్ డిడక్షన్ అమలవుతుంది. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీలపై వచ్చే అద్దె ఆదాయంలో 30 శాతం పోను మిగిలిన మొత్తం వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఒకవేళ అదే ఇంటికి రుణం తీసుకుని వడ్డీ చెల్లిస్తుంటే, ఆదాయపన్ను చట్టంలోని నిబంధనల కింద రూ.2 లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ కోరొచ్చు.

ప్రాపర్టీ విక్రయం



ప్రాపర్టీని రెండేళ్లకు మించి ఉంచుకుని విక్రయించినప్పుడు వచ్చే లాభంపై 20 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మినహాయించుకోవచ్చు. రెండేళ్లలోపు విక్రయించినప్పుడు వచ్చే లాభం వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది.

మ్యూచువల్ ఫండ్స్

పన్ను విషయానికొస్తే మ్యూచువల్ ఫండ్స్‌లో డెట్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్‌కు వేర్వేరు విధానాలు అమల్లో ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ పథకం ఏదైనా కానీ తన నిర్వహణ ఆస్తుల్లో 65 శాతం, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని షేర్లలో ఇన్వెస్ట్ చేస్తే ఈక్విటీ పథకంగా పరిగణిస్తారు. ఇంతకంటే తక్కువ ఈక్విటీ పెట్టుబడులు కలిగి ఉంటే డెట్ ఫండ్స్ కిందకు వస్తాయి. ఆర్బిట్రేజ్ ఫండ్స్, 65 శాతం అంతకంటే ఎక్కువ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్ అన్నింటికీ ఒక పన్ను విధానం అమల్లో ఉంది. వీటిల్లో పెట్టిన పెట్టుబడి ఒక ఏడాది నిండకుండా వెనక్కి తీసుకుంటే, రాబడి స్వల్పకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. ఈ మొత్తంపై 15 శాతం పన్ను చెల్లించాలి. వ్యక్తి వార్షిక ఆదాయం పన్ను పరిధిలో లేకపోయినా కానీ, ఈక్విటీ లాభాలపై పన్ను చెల్లించాల్సిందే. ఏడాది, అంతకుమించిన కాలానికి ఈక్విటీ పెట్టుబడులపై వచ్చే రాబడి దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. దీనిపై



10 శాతం పన్ను చెల్లించాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో దీర్ఘకాల మూలధన రాబడి రూ.లక్ష వరకు పన్ను లేదు. లక్షకు మించినప్పుడు, ఆ అదనపు మొత్తంపైనే 10 శాతం పన్ను బాధ్యత అమలవుతుంది.

•••

లిక్విడ్ ఫండ్స్, డ్యురేషన్ ఫండ్స్, ఇంటర్నేషనల్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, బ్యాలెన్స్‌డ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్లు తదితర సాధనాలన్నీ డెట్ ఫండ్స్ కిందకు వస్తాయి. వీటిల్లో పెట్టుబడులను మూడేళ్లు నిండకుండా వెనక్కి తీసుకున్నప్పుడు వచ్చే లాభంపై స్వల్పకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. ఈ మొత్తం వ్యక్తి ఆదాయానికి కలిపి చూపించాలి. మూడేళ్లు నిండిన డెట్ పెట్టుబడి వెనక్కి తీసుకుంటే వచ్చే రాబడి, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. రాబడి నుంచి సగటు ద్రవ్యోల్బణాన్ని తీసేసి, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ఉద్యోగుల భవిష్యనిధి



ఈపీఎఫ్ పథకం కింద కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, రిటైర్మెంట్ సమయంలో ఉపసంహరించుకునే మొత్తం కూడా పన్ను మినహాయింపు కిందకు వస్తుంది. ఐదేళ్లలోపు సర్వీసు ఉండి, కార్పస్‌ను వెనక్కి తీసుకుంటే కనుక, ఈ మొత్తం వార్షిక ఆదాయానికి తోడు అవుతుంది. రిటైర్మెంట్ వరకు ఆగకుండా, గడువుకు ముందే ఈపీఎఫ్ నిధిని ఉపసంహరించుకుంటే, ఈ మొత్తం రూ. 50,000 మించితే దీనిపై 10% టీడీఎస్ అమలవుతుంది. పాన్ లేకపోతే 20% టీడీఎస్ అమలవుతుంది.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

60 ఏళ్లు నిండి, క్రమం తప్పకుండా ఆదాయం కోరుకునే వారికి ఉద్దేశించిన ఈ పథకంలో పెట్టుబడిపై రాబడి వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది.

ఎన్‌పీఎస్

ఎన్‌పీఎస్ సభ్యులు 60 ఏళ్లు రాగానే పథకం నుంచి వైదొలగొచ్చు. అప్పటి వరకు సమకూరిన కార్పస్‌లో కేవలం 60 శాతాన్ని వెనక్కి తీసుకోగలరు. ఈ మొత్తంపై ఎటువంటి పన్ను ఉండదు. మిగిలిన 40%తో యాన్యుటీ ప్లాన్ (పెన్షన్ చెల్లింపులకు సంబంధించి) తీసుకోవాల్సి ఉంటుంది.

పెన్షన్ ప్లాన్లు

పెన్షన్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసిన వారు మెచ్యూరిటీలో మూడింట ఒక వంతును వెనక్కి తీసుకోవచ్చు. ఈ మొత్తంపై పన్ను ఉండదు. మిగిలిన రెండొంతులతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇలా యాన్యుటీ ప్లాన్లపై వచ్చే రాబడి పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది. వ్యక్తి మొత్తం వార్షిక ఆదాయం పన్ను పరిధిలోకి వస్తే అప్పుడే పన్ను చెల్లించాలి.

ఎండోమెంట్/మనీబ్యాక్ బీమా పథకాలు

మనలో చాలా మందికి ఎండోమెంట్, మనీ బ్యాక్ పాలసీలు ఉంటాయి. జీవిత బీమా రక్షణతో పాటు, గడువు ముగిసేవరకు జీవించి ఉంటే, పాలసీదారులకు నిర్ణీత మొత్తం ఈ ప్లాన్ల కింద వస్తుంది. టర్మ్ ప్లాన్లలో కేవలం మరణించినప్పుడే పరిహారం దక్కుతుంది. చివరి వరకు జీవించి ఉంటే ఏమీ రాదు. అందుకని ఎక్కువ మంది ఎండోమెంట్ ప్లాన్లు తీసుకుంటుంటారు. ఈ పథకాల్లో గడువు ముగిసేవరకు కొనసాగితే వచ్చే మెచ్యూరిటీపై పన్ను ఉండదు. యూనిట్ లింక్డ్ ప్లాన్ల



(యులిప్‌లకు) సైతం ఇదే అమలవుతుంది. వీటిల్లో వార్షికంగా చెల్లించే ప్రీమియం రూ.2.5 లక్షలు మించనప్పుడు ఈ ప్రయోజనానికి అర్హులు. వార్షిక ప్రీమియం రూ.2.5 లక్షలు మించినప్పుడు, ఈక్విటీ పథకాల మాదిరే ఉపసంహరణ సమయంలో పన్ను రేట్లు అమలవుతాయి.

బ్లూ స్టార్	ఆనంద్ రాఠీ రీసెర్చ్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,262 **టార్గెట్:** రూ. 1,517

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)లో బ్లూ స్టార్ రిటర్న్ రేషియోలు మరింత పుంజుకునే వీలుంది. ఈ ఏడాది తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లోనే నికర లాభం రూ. 117 కోట్లను తాకింది. గత పూర్తి ఏడాది(2021–22)కి రూ. 167 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్– మార్చి)తోపాటు 2023–24లో కంపెనీ ప్రాజెక్టుల బిజినెస్ ఔట్‌లుక్ అత్యంత ఆశావహంగా కనిపిస్తోంది. 2023 జనవరికల్లా ప్రారంభంకానున్న శ్రీ సిటీ ప్లాంటు వచ్చే ఏడాది వేసవి సీజన్ అమ్మకాలను అందిపుచ్చుకోనుంది. అన్ని విభాగాల్లోనూ నమోదైన విక్రయాలు ఈ ఏడాది జులై–సెప్టెంబర్(క్యూ2)లో 27 శాతం ఆదాయ వృద్ధికి దోహదపడింది. కాగా, తీవ్ర పోటీ నెలకొన్న మార్కెట్‌లో వచ్చే రెండేళ్లు కంపెనీ మార్జిన్లు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవచ్చు.



యాక్సిస్ బ్యాంక్	చాయిస్ ఇంటర్నేషనల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 935 **టార్గెట్:** రూ. 1,205

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసిక పనితీరు తదుపరి యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం విశ్లేషకులతో సమావేశాన్ని నిర్వహించింది. ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ బ్యాంకులో తీసుకువస్తున్న కీలక మార్పులను తెలియజేస్తూ జులై–సెప్టెంబర్(క్యూ2)లో పటిష్ట ఫలితాలను సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇకపైన సైతం బ్యాంకు నిలకడైన పనితీరును చూపనున్నట్లు విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా బలమైన మార్జిన్లను సాధించేందుకు వీలుగా బ్యాంక్ వ్యవస్థాగత నిర్మాణం మరింత మెరుగుపడినట్లు తెలియజేశారు. రానున్న కాలంలో బ్యాంకింగ్ పరిశ్రమ వృద్ధికంటే 4–6% అధికంగా యాక్సిస్ అడ్వాన్సుల్లో(రుణాలు) పురోగతి నమోదుకానున్నట్లు అభిప్రాయపడ్డారు. ఇందుకు భారత్ బ్యాంకింగ్ దోహదపడిందన్నారు. 2024–25కల్లా కాస్ట్ టు అసెట్స్ రేషియో 2 శాతం స్థాయిలో సాధారణ స్థితికి చేరుకోనున్నట్లు భావిస్తోంది.



ప్రతి నెలా రూ.50 వేల పొదుపు కోసం..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

నాకు పోస్టాఫీసు ఎంఐఎస్, ఎస్‌సీఎస్ఎస్, పీఎంవీవై పథకాల్లో పెట్టుబడులు ఉన్నాయి. నా ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఒకటి గడువు తీరడంతో కొంత మొత్తం చేతికి వచ్చింది. వడ్డీ రేట్లు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకుంటే మెరుగైన రాబడులు వస్తాయి? – అరుణ్

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రాబడులు మెరుగ్గా ఉండవు. కనుక మీరు మెరుగైన రాబడుల కోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎఫ్‌డీలతో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ అస్థిరతలతో ఉంటాయి. అచ్చమైన ఈక్విటీ ఫండ్స్‌తో పోలిస్తే ఆటుపోట్లు తక్కువే. ఇవి 15–30 శాతం వరకు ఈక్విటీల్లో, మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో, ఆర్బిట్రేజ్ ట్రేడింగ్ అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. స్వల్పకాలానికి ఈ ఫండ్స్‌లోనూ రిస్క్ ఉంటుంది. మూడు నుంచి ఐదేళ్లు అంతకుమించిన కాలానికి రిస్క్ అని నేను అనుకోను. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌ను కూడా పరిశీలించొచ్చు. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ రాబడులు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో మాదిరే ఉంటాయి. కాకపోతే వీటిల్లో లిక్విడిటీ ఎక్కువ. పోస్టాఫీసు ఎంఐఎస్, ఎస్‌సీఎస్ఎస్, పీఎంవీవీవై పథకాల్లో పెట్టుబడులు ఉండడంతో, వాటి నుంచి క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంటుంది. ఈ పథకాల నుంచి రాబడి తీసుకుంటూ ఉంటారు కనుక పెట్టుబడి విలువ పెరగదు. కనుక మీకు ఉన్న వాటిల్లో ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్ అవుతుంది. ఈక్విటీ వద్దనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు వెళ్లొచ్చు.

నా వయసు 45 ఏళ్లు. నా విశ్రాంత జీవనం కోసం వచ్చే పదేళ్ల పాటు, ప్రతి నెలా రూ.50,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలన్నది నా ప్రణాళిక. ఏ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి? – ఆశిష్ అథాలే

రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకోవాలనుకునే వారు వాస్తవికంగా ఆలోచించాల్సిందే. ముందుగా రిటైర్మెంట్ కోసం ఎంత మొత్తం కావాలన్నది నిర్ణయించుకోవాలి. రిటైర్మెంట్ నాటికి ఎంత నిధి సమకూర్చుకోగలరో అవగాహనకు రావాలి. విశ్రాంత జీవన అవసరాలకు కావాల్సినంత మీరు కూడబెట్టే విధంగా ప్రణాళిక ఉండాలి. రెండు నుంచి మూడు వరకు మంచి ఫ్లెక్సీక్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. నెలవారీ సిప్ ద్వారా వాటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మరో పదేళ్ల పాటు మీ కెరీర్ కొనసాగనుంది. కనుక మీ పెట్టుబడి వృద్ధి చెందడానికి తగినంత వ్యవధి మిగిలి ఉంది. ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి అవగాహన లేకపోతే, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే కొంచెం తక్కువ అస్థిరతలతో ఉంటాయి. అలాగే రిటైర్మెంట్ కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాలు, ఈక్విటీ పథకాలను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత.. ఈక్విటీ పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల్లోకి మార్చాల్సిన అవసరం ఏర్పడదు. ఎందుకంటే సగం పెట్టుబడులు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్ ఫండ్స్) సాధనాల్లోనే ఉంటాయి. ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపు జాగ్రత్తగా ఉండాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించేలా, వడ్డీ రేట్లు తగ్గినప్పుడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై పడే ప్రభావాన్ని అధిగమించేలా ఈ సమతూకం ఉండాలి.

ఒకే ప్లాన్‌లో అధిక ప్రయోజనాలు

రిలయన్స్ జనరల్ నుంచి ఇన్ఫినిటీ ప్లాన్



హైదరాబాద్: రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ 'రిలయన్స్ హెల్త్ ఇన్ఫినిటీ' పేరుతో ప్రీమియం ఉత్పత్తిని విడుదల చేసింది. ఈ ప్లాన్‌లో అపరిమిత కవరేజీ సదుపాయం ఉంటుందని సంస్థ తెలిపింది. రూ.5 కోట్ల వరకు కవరేజీ తీసుకోవచ్చని, మేటర్నిటీ కవరేజీ, అంతర్జాతీయ కవరేజీ, అపరిమిత రీస్టోరేషన్ (సమ్ ఇన్సూరెన్స్ అయిపోతే పునరుద్ధరించడం), 15 వరకు యాడాన్ ప్రయోజనాలు ఉన్నట్టు సంస్థ ప్రకటించింది. ఆర్థికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్న వారికి రివార్డులు ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. మెరుగైన క్రెడిట్ స్కోర్ కలిగిన వారికి, శారీరక వ్యాయామాలతో ఆరోగ్యకర బీఎంఐను నిర్వహిస్తున్న వారికి రివార్డులు అందించనుంది. ఓపీడీ కన్సల్టేషన్ చార్జీలకు సైతం కవరేజీ ఉంది. అలాగే, ఒక్కటే క్లెయిమ్ సమ్ ఇన్సూరెన్స్ దాటినప్పుడు నూరు శాతం అదనపు కవరేజీ లభిస్తుంది. హాస్పిటల్ రూమ్‌ల విషయంలో పరిమితులు కూడా లేవు.


పార్వతీపురం మన్యం జిల్లా తురకనాయుడువలసలో ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి


పశ్చిమగోదావరి జిల్లా పాలమూరులో ప్రజలతో ఎమ్మెల్యేలు శ్రీరంగనాథరాజు, గ్రంధి శ్రీనివాస్


నెల్లూరు జిల్లా కొలపనాయుడుపల్లిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


ప్రకాశం జిల్లా ఒంగోలులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

క్లుప్తంగా...

చూసే దృష్టి ఉంటే జీవితంలో ఎన్నో కథలు

- ప్రముఖ రచయిత, విమర్శకులు వీఆర్ రాసాని



కడప కల్చరల్: సునిశితంగా పరిశీలించి ముఖ్యాంశాన్ని పట్టుకోగలిగే దృష్టి ఉంటే మానవ జీవితంలో ఎన్నో కథలు కనిపిస్తాయని ప్రముఖ రచయిత, విమర్శకులు వీఆర్ రాసాని అన్నారు. యువ రచయితలు డాక్టర్ వేంపల్లె షరీఫ్, కొత్తపల్లి సురేష్ ఆధ్వర్యంలో కడప నగరం ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో రాయలసీమ కథా కార్యశాల రెండో రోజు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో కథ ఆవిర్భావం, పరిణామ క్రమం, తెలుగులో తొలి కథల గురించి తెలుపుతూ రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్‌చంద్ కథలను ఉదహరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి కథ, ప్రచారం గురించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ప్రముఖ కథకులు శ్రీనివాసమూర్తి కథల్లో కాలం, చారిత్రక నేపథ్యం గురించి వివరించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్ కథా విమర్శ, మంచి కథల లక్షణాల గురించి వివరిస్తూ సభ్యుల కథాంశం ఆధారంగా చర్చ నిర్వహించారు. కార్యశాల నిర్వహిస్తున్న వేంపల్లె షరీఫ్, కొత్తపల్లి సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ కథకులు పాలగిరి విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి కూస్తోందని పోలీసులకు ఫిర్యాదు

బనశంకరి: కోడిపుంజు కూతతో నిద్రకు ఆటంకం కలుగుతోందని పోలీసులను ఆశ్రయించాడు ఓ ఐటీ ఇంజినీర్. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని జేపీ నగర 8వ ఫేజ్‌లో ఓ అపార్టుమెంటులో ఉత్తర భారతదేశానికి చెందిన టెక్కీ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల అతడు నగర పోలీసుల ట్విట్టర్ అకౌంట్‌కు తన ఫిర్యాదును ట్యాగ్ చేశాడు. తమ అపార్టుమెంటు వద్ద స్థలంలో ఒక రైతు కోడిపుంజులు, కోళ్లను పెంచుతున్నాడని, కోడిపుంజులు కూత వేస్తుండటంతో నిద్రాభంగం కలుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కోళ్ల పెంపకందారుని ప్రశ్నించారు. నా స్థలంలో కోళ్లను పెంచుకుంటే నేరమా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు టెక్కీకి, కోళ్ల రైతుకు సర్దిచెప్పి పంపించారు.

మన కొలీజియంలో పారదర్శకత లేదు

- అన్ని విషయాలు రహస్యంగానే ఉంటున్నాయి
- వ్యవస్థలో అనేక లోపాలు కూడా..
- కొందరు న్యాయమూర్తుల చేతుల్లోనే నియామకాలుంటున్నాయి
- జడ్జీల బదిలీలపై లాయర్లు ధర్నాలు చేయడం సరికాదు
- 'సాక్షి'తో జస్టిస్ చంద్రు

అనంతపురం (కల్చరల్): సుప్రీంకోర్టు కొలీజియంలో పారదర్శకత లేదని, అన్ని విషయాలు రహస్యంగానే ఉంటున్నాయని మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రు అన్నారు. అనంతపురంలో ఆదివారం జరిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చిన్నపరెడ్డి శత జయంతి వేడుకలకు విశిష్ట అతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రు న్యాయవ్యవస్థలోని లోపాలు, వివిధ న్యాయపరమైన విషయాలపై 'సాక్షి'తో ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పారదర్శకత ఆశించలేం

కొలీజియం వ్యవస్థలో అనేక లోపాలున్నాయి. ఎవరైతే పైస్థాయిలో ఉంటారో వారికి సంబంధించిన వర్గాల వారికే అవకాశాలు మెండుగా ఉంటున్నాయనడంలో సందేహం లేదు. అమెరికా లాంటి దేశాల్లో ప్రతి న్యాయమూర్తి ఎంపిక విషయం ముందుగానే తెలుస్తుంది. కానీ.. ఇక్కడ కొద్దిమంది న్యాయమూర్తుల చేతుల్లో నియామకాలుంటాయి. కాబట్టి పారదర్శకత ఉంటుందని పెద్దగా ఆశించలేం. కొలీజియంకు ముందే జస్టిస్ కృష్ణయ్యర్, చిన్నపరెడ్డి వంటి వారు న్యాయమూర్తులుగా ఉన్నారు కాబట్టి స్వతంత్రంగా వ్యవహరించారు. ఇటీవల కొన్ని హైకోర్టుల్లో న్యాయమూర్తుల బదిలీలపై న్యాయవాదులు ధర్నాలు చేయడం సహేతుకం కాదు. కోర్టు తన విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునేటట్టు అందరూ సహకరించాలి. నిరసన తెలియజేసే హక్కు అందరికీ ఉంటుంది. కానీ.. కోర్టు విధులకు ఆటంకం కల్గించి కానీ, వ్యవస్థను ప్రభావితం చేసేలా కానీ ఉండొద్దు.

వేటికవే స్వతంత్ర సంస్థలు

శాసన, న్యాయవ్యవస్థలు వేటికవే స్వతంత్ర సంస్థలు. ఎవరూ ఎందులోనూ జోక్యం కల్పించుకోవడం ఉండదు. న్యాయవ్యవస్థ అతిగా స్పందించిందని అనుకుంటే సుప్రీంకోర్టు అడ్డుకుంటుంది. పార్లమెంట్ ప్రత్యేక చట్టాల ద్వారా కూడా అతి జోక్యాన్ని ఆపే అవకాశం ఉంటుంది. అతి జోక్యమనేది అపోహ మాత్రమే. బ్యాంకుల జాతీయకరణ చట్టాన్ని కోర్టు వ్యతిరేకించింది. కానీ.. రాజ్యాంగ సవరణ ద్వారా చట్టాన్ని చేశారు. ఎల్‌ఐసీ కార్మికులకు న్యాయం జరిగే విషయంలోనూ అదే జరిగింది. అలాంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి. న్యాయవ్యవస్థ, చట్టసభలకు మధ్య సఖ్యత ఉండకపోవడమనేది దశాబ్దాలుగా సాగుతోంది. కొన్నిసార్లు విభేదాలు పొడసూపిన సందర్భాలూ ఉన్నాయి. కానీ.. చరిత్ర పరిశీలిస్తే న్యాయవ్యవస్థే చాలాసార్లు ప్రభుత్వాల అస్థిత్వాన్ని కాపాడింది. ఎమర్జెన్సీ తర్వాత ప్రభుత్వ కొనసాగింపునకు కోర్టులే సహకారం అందించాయి. విభేదాలు లేకుండా ఉంటేనే వ్యవస్థ సుభిక్షంగా ఉంటుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అతిగా స్పందిస్తున్నందున న్యాయవ్యవస్థ చర్చల్లోకి వస్తోంది.

ఆమోద యోగ్యంగానే సుప్రీంకోర్టు తీర్పు

కోవిడ్ సమయంలో విద్యావ్యవస్థలో పరీక్షలు కొనసాగించే విషయమై ముంబై కోర్టు, కేరళ కోర్టులకు భిన్నంగా ఏపీ హైకోర్టు తీర్పు ఉండొచ్చు. ఎందుకంటే.. న్యాయవ్యవస్థ యంత్రం కాదు. వ్యక్తులంతా ఒకేలా ఆలోచించకపోవచ్చు. కాబట్టి ఒక్కోసారి తీర్పుల్లో వ్యత్యాసాలుంటాయి. కానీ.. అంతిమంగా సుప్రీంకోర్టు అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయమే తీసుకుంటుంది.

సామాన్యుల పక్షపాతి జస్టిస్ చిన్నపరెడ్డి

అనంతపురం కల్చరల్: సామాన్యులకూ న్యాయం అందుబాటులో ఉండాలని గాఢంగా నమ్మడమే కాకుండా ఆచరణలో చూపిన వ్యక్తి జస్టిస్ చిన్నపరెడ్డి అని మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రు అన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో జస్టిస్ చిన్నపరెడ్డి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డితో పాటు జస్టిస్ చంద్రు విశిష్ట అతిథిగా విచ్చేసి 'రాజ్యాంగ విలువలు–జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పులు' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. జస్టిస్ చిన్నపరెడ్డి వివిధ సందర్భాలలో తనదైన విలక్షణ వ్యక్తిత్వంతో విస్పష్టంగా ఇచ్చిన తీర్పులు రాజ్యాంగ ఔన్నత్యాన్ని ఘనంగా చాటాయని జస్టిస్ చంద్రు అన్నారు. నేడు చాలా మంది మతవాదాన్ని తలకెత్తుకోవడం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. ఈబీసీ కింద 10 శాతం రిజర్వేషన్లు అణగారిన వ్యక్తులకు ప్రతిబంధకంగా ఉన్నాయన్నారు. రిజర్వేషన్లు కేవలం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దక్కాలన్నారు. అభివృద్ధి పేరుతో ఈరోజుల్లో సాగుతున్న ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి , డాక్టర్ ప్రగతి, కార్యక్రమ కన్వీనర్ రాజమోహన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రు

ఏపీలో గిరిజనుల సంక్షేమానికి కృషి భేష్

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరూట

తిరుమల: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించడం అభినందనీయమని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరూట అన్నారు. ఆమె ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల కోసం సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని, బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించారని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ద్వారా తెలుసుకున్నానని, చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ కమిషన్‌ను ఐదుగురు సభ్యులతో ఏర్పాటుచేయడం అభినందనీయన్నారు. గిరిజన శాఖ సహాయ మంత్రిగా కేంద్రం నుంచి రాష్ట్రానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రిని తిరుమల అతిథిగృహంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు.


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి రేణుక సింగ్ సరూట

తెలంగాణ

పథకం అతనిది.. కక్ష మాత్రం ఆమెది

ఆరుగురు సజీవ దహనం కేసులో పోలీసుల అదుపులో ఏడుగురు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తన భర్త వేరొకరితో సహజీవనం చేస్తూ తమను పట్టించుకోవడం లేదని కక్షగట్టిన భార్య తన భర్తతో పాటు మరో ఐదుగురు మంటల్లో బూడిదయ్యేలా చేసింది. ఈ నెల 17న తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం వెంకటాపూర్ ఎమ్మెల్యే కాలనీలో ఓ ఇంటికి నిప్పు పెట్టడంతో ఆరుగురు సజీవ దహనమైన విషయం తెలిసిందే.

డబ్బు గొడవలే కక్ష రేపాయి!

మృతుడు శాంతయ్య తండ్రికి లక్సెట్టిపేట మండలం ఊత్కూరులో 1.15 ఎకరాల భూమి వివాదంలో ఇటీవల రాజీ కుదిరింది. దీంతో రూ.90 లక్షలు రాగా, శాంతయ్య వాటాకు రూ.12 లక్షలు వచ్చాయి. అప్పటినుంచి శాంతయ్య, అతడి భార్య సృజన మధ్య గొడవలు తారస్థాయికి చేరాయని, ఈ కక్షలే చంపేవరకు తీసుకెళ్లాయని తెలుస్తోంది. కాగా, మృతుడు శాంతయ్య భార్య సృజనకు దగ్గరి వ్యక్తిగా ఉన్న లక్సెట్టిపేట వాసి, కాంగ్రెస్ కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓటమిపాలైన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈ కేసులో అన్నీ తానై వ్యవహరించాడు. డ్రైవర్‌గా పని చేసే ఓ యువకుడు, గతేడాది జూన్ 2న లక్సెట్టిపేటలో ఓ వ్యక్తిని చంపిన కేసులో నిందితుడొకరు, వెంకటాపూర్ పరిధిలోని గుడిపెల్లి వ్యక్తి వీరికి సహకరించారు. నిందితులకు అయిన రూ.లక్షల్లో ఖర్చు అంతా సృజన భరించింది.

ఆ రోజు ఏం జరిగిందంటే..

నిందితులు ఈ నెల 16న రాత్రి నస్పూర్‌లోని షిర్కేకు వెళ్లే దారిలో ఓ బంకు నుంచి రెండు క్యాన్లలో 40 లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి ఆటోలో తీసుకెళ్లారు. ఆ ఆటోలో డ్రైవర్‌తో పాటు లోపల కూర్చున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి బంకు సిబ్బందికి సుమారు రూ.5 వేల బిల్లు చెల్లించాడు. తర్వాత మరొకరి సాయంతో శివయ్య ఇంటికి వెళ్లి ఇంటి పైన, చుట్టూ పెట్రోల్ చల్లి చల్లి నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి వరకు శాంతయ్య భార్య, కూతురు, ఆటోడ్రైవర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి, మరో ముగ్గురిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.